# దారి దీపం
మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 1 - సంచిక 12 సెప్టెంబరు 2023 వెల : రూ.15

ఓటమి భయంతోనే అడ్డదారులు

నిగ్గుదేలిన భారత శాస్త్రవేత్తల సత్తా

అనంత గొంతుకల అద్భుత భారత్!

సత్యమేవ సైన్స్

ప్రాచీన విజ్ఞాన శాస్త్రం

సైన్స్ పేరుతో మనువాదుల అభూత కల్పనలు

వివిధ సంస్థలను స్వాధీనం చేసుకుంటున్న ఆర్.ఎస్.ఎస్

సార్వత్రిక ప్రాథమిక ఆదాయం

గద్దర్ పాటే ముద్దు.. వివాదం వద్దు

నువ్వు లేవు నీ పాట ఉంది

ఉద్యమ కళగా మారుతున్న జానపద కళ

సమాజాన్ని మార్చే ప్రయోగం

పధ్నాలుగు తోడేళ్ల కథ

మత దుర్మార్గాన్ని కళ్ళకు కట్టిన నవల - ఏది నిత్యం ?

ఆయన జీవితమే ఒక సందేశం !

చరిత్ర మరచిన చిత్తరువు

విస్తరిస్తున్న లాల్ నీల్ మైత్రి

కమ్యూనిస్టు ప్రణాళిక - కొన్ని ముఖ్యాంశాలు

సెప్టెంబరు - 2023

# దారి దీపం
మాసపత్రిక

సంపుటి : 1 - సంచిక : 12


**డీవీవీఎస్ వర్మ**
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణ మూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. ఓటమి భయంతోనే అడ్డదారులు 3
2. నిగ్గుదేలిన భారత శాస్త్రవేత్తల సత్తా
 - డాక్టర్ సోమ మర్ల 4
3. అనంత గొంతుకల అద్భుత భారత్!
 - రాహుల్‌గాంధీ 6
4. సత్యమేవ సైన్స్ - ప్రసాదమూర్తి 7
5. ప్రాచీన విజ్ఞాన శాస్త్రం - హిందూత్వ
 - ప్రబీర్ పురకాయస్థ 8
6. సైన్స్ పేరుతో మనువాదుల అభూత కల్పనలు
 - దేవరాజు మహారాజు 13
7. వివిధ సంస్థలను స్వాధీనం చేసుకుంటున్న
 ఆర్.ఎస్.ఎస్ -ప్రొఫెసర్ పి.గోపీనాథ్ 15
8. సార్వత్రిక ప్రాథమిక ఆదాయం
 - ప్రభాత్ పట్నాయక్ 21
9. గద్దర్ పాటే ముద్దు.. వివాదం వద్దు - ప్రసాదమూర్తి 23
10. నువ్వు లేవు నీపాట ఉంది - రాచపాళెం చంద్రశేఖరరెడ్డి 24
11. ఉద్యమ కళగా మారుతున్న జానపద కళ - కె.శాంతారావు 25
12. సమాజాన్ని మార్చే ప్రయోగం - ప్రకాష్‌రాజ్ 27
13. పధ్నాలుగు తోడేళ్ల కథ - విరించి విరివింటి 29
14. మత దుర్మార్గాన్ని కళ్ళకు కట్టిన నవల ఏది నిత్యం ? -డాక్టర్ కందాళ శోభారాణి 30
15. ఆయన జీవితమే ఒక సందేశం ! - గౌరవ్ 34
16. చరిత్ర మరచిన చిత్తరువు - సురవరం సుధాకరరెడ్డి 35
17. నరసాపురంలో పుస్తకావిష్కరణ 35
18. విస్తరిస్తున్న లాల్ నీల్ మైత్రి - డీవీవీఎస్ వర్మ 37
19. కమ్యూనిస్టు ప్రణాళిక - కొన్ని ముఖ్యాంశాలు 39
20. కార్టూన్స్ 43
21. స్వీకారం.. కొత్త పుస్తకాలు 44




కార్టూన్ : సతీష్ ఆచార్య

**దారి దీపం**
మాసపత్రిక
**మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి**


**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**

సంపాదకీయం



# ఓటమి భయంతో అడ్డదారులు

రాజకీయ నాయకులకు ఓటమి భయానికి మించిన ఉపద్రవం మరొకటి వుండదు. మోదీ చర్యలు చూస్తుంటే ఆయనను ఓటమి భయం వెంటాడుతున్నట్లు కనిపిస్తోంది. ఆగస్టు 15న ఎర్రకోట మీద మోదీ ఒక ఎన్నికల ప్రకటన చేశారు. 2024లో కూడా తానే ఇక్కడ జెండా ఎగరవేస్తానన్నారు. ఇది ధీమాకంటే మేకపోతు గాంభీర్యంగానే కనిపిస్తున్నది. ఈ భయానికి కారణాలున్నాయి. గత పదేళ్లుగా దేశవ్యాపితంగా మోదీని ఢీకొట్టగల ప్రత్యర్థి లేకుండా వుంది. బలమైన ప్రాంతీయ పార్టీలున్నా వాటి ప్రభావం ఆ రాష్ట్రాలకే పరిమితం కావడంతో పరిస్థితి మోదీకి అనుకూలించింది. ఇప్పుడు పరిస్థితి మారింది. భారత్ జోడో యాత్ర తర్వాత మోదీని రాజకీయంగా ఎదుర్కొనే నేతగా రాహుల్‌గాంధీ తెర ముందుకొచ్చారు. పైగా బలమైన ప్రాంతీయ పార్టీల కూటమి రూపుదిద్దుకుంటూ ఎదుగుతున్నది. ఈ పరిణామాలు మోదీకి కంటకప్రాయంగా మారాయి. రాహుల్ పార్లమెంట్ సభ్యత్వాన్ని హుటాహుటిన రద్దు చేసి 2024 ఎన్నికలలో పోటీకి అనర్హుడిగా చేసి ఈ పరిణామాల నుండి బయటపడ్డట్టు భావించారు. కాని, సుప్రీంకోర్టు తీర్పుతో ఆ అంచనా ఎదురుతిరిగింది. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పులతో మోదీ తన విజయానికి సాధనాలుగా చేసుకున్న ఒక్కొక్క అస్త్రం చేజారుతున్నట్లు స్పష్టమైంది. వీటిని తిరిగి హస్తగతం చేసుకోవడానికి అడ్డదారులు శరణ్యం అయ్యాయి.

మోదీ విజయానికి ఈడీ ఒక అస్త్రం. దీని ద్వారానే ఆయన కొన్ని పార్టీలను స్వాధీనం చేసుకున్నారు. చాలా మంది నాయకులను లోబరుచుకున్నారు. ఇప్పుడు ఈ సాధనం మీద సుప్రీంకోర్టు ఆంక్షలు విధించింది. మోదీ నియమించినా మూడు, నాలుగుసార్లు పదవీ కాలం పొడిగించిన మిశ్రా పదవీ కాలం పొడిగింపు చెల్లదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.. కాని, మోదీకి ఆయనే కావాలి. దాని కోసం సుప్రీంకోర్టు తీర్పును వమ్ము చేయడానికి అడ్డదారులు వెతుకుతున్నారు. దీని కోసం ఈడీ, సీబీఐల మీద ఒక పర్యవేక్షకుని హోదాని కల్పించి, దానికి ప్రస్తుత ఈడీ మిశ్రాను నియమించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇది ఓటమి భయం నుంచి పుట్టుకొచ్చిన అడ్డదారి తప్ప వేరు కాదు. అలాగే ఎన్నికల కమిషన్‌ను మోదీ ప్రభుత్వం తన గుప్పెట్లో పెట్టుకుంది. ఎప్పుడు ఎన్నికలు జరపాలి, ఏ రాష్ట్రంలో తమ ప్రచారానికి వీలుగా ఎన్ని విడతలు జరపాలి ? ఎన్నికల ఉల్లంఘనల పేరుతో ప్రతిపక్షాలను కట్టడి చేయించడం వగైరాలకు ఎన్నికల కమిషన్‌ను మోదీ ప్రభుత్వం వినియోగించుకుంటున్నది.

ఇప్పుడు ఎన్నికల కమిషన్ నియామకంపై సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలను, దాని ఎంపికకు ఒక కొలీజియంను ప్రకటించింది. ఈ కొలీజియంలో ప్రధాని, ప్రతిపక్ష నేతతోపాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉంటారు. అంటే ఎన్నికల కమిషనర్ల నియామకంలో మోదీ పప్పులు ఉడకవు. కాని, ఈ తీర్పును తిరగదోడడానికి పార్లమెంటులో చట్టం చేసే అడ్డ దారిని మోదీ ప్రభుత్వం ఎంచుకుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ఒక కేంద్ర మంత్రి ఉండేలా చట్టం చేసింది. ఇది కూడా ఓటమి భయం నుంచి పుట్టుకొచ్చిన మరో అడ్డదారి. ఇప్పటి వరకు పైకి కనిపించకుండా తన ఎన్నికల విజయాలకు సాధనాలుగా వినియోగించుకున్న అస్త్రాలలో గుట్టు ఇప్పుడు అందరికీ బహిర్గతమైంది. పాలనా సంస్థల దుర్వినియోగం ఇప్పుడు బట్టబయలైంది. ఈ అడ్డదారి రాజకీయం మోదీని మరింత అప్రతిష్టపాలు చేస్తుంది. అది ఓటమిని తప్పించకపోగా మరింత చేరువ చేస్తుంది.


**- డీవీవీఎస్ వర్మ**

**సంపాదకులు, 85006 78977**

# నిగ్గుదేలిన భారత శాస్త్రవేత్తల సత్తా

- డాక్టర్ సోమ మర్ల

**భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన చంద్రయాన్ 3 రాకెట్టు విజయవంతంగా 43 రోజుల అనంతరం బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చంద్రుని ఉపరితలంపై నెమ్మదిగా దిగటం మనందరికి గర్వకారణం. ఆగస్టు 23వ తేదీ చంద్రయాన్ 3 నుండి వెలువడిన విక్రమ్ ల్యాండరు చంద్రునిపై దిగిన నాలుగు గంటలకు దాని నుండి 'ప్రజ్ఞాన్' రోబో రోవరు బైటకు వచ్చి చంద్రుని ఉపరితలంపై నడవటం మొదలుపెట్టింది.**



ప్రజ్ఞాన్ చంద్రుడిపై ఒక చంద్ర దినం(అంటే మనభూమిపై 14 రోజులకు సమానమైన) సెకండుకు ఒక సెం.మీ వేగంతో సంచరిస్తుంది. ఈ క్రమంలో తన చుట్టూ వున్న వాతావరణం, మట్టి, శిలలు, పర్వతాలు, ఖనిజాలు, నీటి లభ్యత గురించిన సమాచారాన్ని సేకరిస్తుంది. ఇప్పటికే అమెరికా, పూర్వపు సోవియట్ యూనియన్, చైనా దేశాలు చంద్రుని ఉపరితలంపై రాకెట్టు దింపినా, అతి క్లిష్టమైన దక్షిణ ధృవప్రాంతంలో అడుగు పెట్టడం మన చంద్రయాన్ 3 విశిష్టత. అనేక సాంకేతికపరమైన ఇబ్బందులతో కూడిన ప్రయోగాన్ని దిగ్విజయంగా సాగించి నందు భారత్ శాస్త్ర సాంకేతిక ప్రతిష్టను ప్రపంచ దేశాలన్నీ ప్రశంసించడం మన జాతికి గర్వకారణం.

### చంద్రుని దక్షిణ ధృవం :

అపోలో వ్యోమ నౌక నుండి దిగి మొదటిసారిగా చంద్రునిపై (ఆగస్టు, 1969) కాలుపెట్టిన 'సీ ఆఫ్ ట్రాంక్విలిటీ' ఉత్తర ప్రాంతం కాంతివంతమైన, చదునైనది, పెద్దగా ఇబ్బంది లేని ఉపరితలం. కానీ దక్షిణ ధృవ ప్రాంతం ఎత్తయిన పర్వతాలతో, దాదాపు 8 కి.మీల లోతైన గోతులు, లోయలు, రాళ్లు, శిలలతో నిండిన అతి శీతలమైన చీకటి ప్రాంతం. ఇది చంద్రుని వెనుక భాగం కావటంతో సంవత్సరం పొడవునా సూర్యకాంతి పడక, చీకటిగా 230 డిగ్రీల చలితో ఉంటుంది. సూర్యుడి నుండి భూమి 5.6 బిలియన్ సంవత్సరాల క్రితం వేరుపడగా, ఆ తర్వాత 5.5 బిలియన్ సంవత్సరాల తర్వాత చంద్రుడు భూమి నుండి వేరు పడి భూమి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఉంది. అప్పటి నుండి సూర్యకాంతి లేని అతి శీతలప్రాంతం కావటం వలన భూమి ఏర్పడినప్పటి భౌగోళిక, రసాయనిక పరిస్థితులు ఇంకా చెక్కు చెదరకుండా దక్షిణ ధృవంలో ఉన్నాయని నాసా (అమెరికా) శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో సంచరించే ప్రజ్ఞాన్ రోబో రోవర్‌లో చుట్టూ ఉన్న మట్టి, శిలలు, వాతావరణాన్ని పరిశీలించి, మట్టి నమూనాలను, శిలలను రసాయన పరీక్షలు చేసే స్పెక్ట్రో మీటర్లు, లేజరు కిరణ యంత్రాలు, ఛాయాచిత్రాలు తీసే కెమెరాలు బిగించారు. సేకరించిన విలువైన సమాచారాన్ని ఇప్పటికే చంద్రుని చుట్టూ కక్ష్యలో పరిభ్రమిస్తున్న చంద్రయాన్ 2 (2019లో ప్రయోగించడమైంది)కి పంపిస్తుంది. చంద్రయాన్ 2 ఈ సమాచారాన్ని భూమిపై మన ఇస్రో లేబొరేటరీలకు పరిశోధనకై పంపిస్తుంది. ప్రజ్ఞాన్ రోవర్ కేవలం 14 భూదినాలు సంచరిస్తుంది. అది సేకరించవలసిన సమాచారం ఖనిజ సంపద, నీటిలభ్యత, వాతావరణం తదితరాలు.


### నీటి లభ్యత :

2008లో ప్రయోగించిన చంద్రయాన్ 2 రాకెట్టు, చంద్రుని చుట్టూ కక్ష్యలో చక్కర్లు కొడుతూ చంద్రుని గురించి విలువైన సైన్సు సమాచారం పంపింది. అందులో ముఖ్యమైనది 'చంద్రునిపై నీరు లభించగల అవకాశాలు ఉన్నాయని. ఈ విషయాన్ని ఆ తర్వాత ప్రయోగించిన ఉపగ్రహం 92009 సైతం నిర్ధారించింది. అలాగే 2018లో మనం ప్రయోగించిన చంద్రయాన్ 2 నీరు, ఐస్, హైడ్రాక్సిన్ మాలిక్యూల రూపంలో ఉన్నదని కనుగొంది (చిత్రంలో చూడండి). నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, కార్లసన్

(అపోలో) భూమికి తెచ్చిన మట్టి నమూనాలను తిరిగి ఇటీవల పరిక్షించగా నీటి లభ్యత ఆనవాళ్లు లభించాయి. మనిషి చంద్రయానం చెయ్యాలన్నా, అక్కడ అవాసాలు ఏర్పరచుకోవాలన్నా నీటి లభ్యత అత్యావశ్యకం. లక్షల లీటర్ల నీరు భూమి నుండి చంద్రుడికి తీసుకు వెళ్లడం అసంభవం. నీరు లభిస్తే, మానవ యానానికి, నివాసాలకే కాక, దాని నుండి విడగొట్టే హైడ్రోజన్ సైతం రాకెట్ ఇంధనంగా తిరుగు ప్రయాణానికి ఉపయోగపడుతుంది.

**ఖనిజసంపద :**

చంద్రునిపై, ముఖ్యంగా దక్షిణ ధృవప్రాంతంలో నికెల్, లిథియం, బంగారం, ప్లాటినమ్, మాంగనీసు తదితర విలువైన ఖనిజాలు పుష్కలంగా లభించే అవకాశాలున్నట్లు నాసా, భారత్, సోవియట్ ఉపగ్రహాలు సేకరించిన సమాచారం వెల్లడిస్తున్నది. ఎలక్ట్రానిక్, కంప్యూటరు మైక్రోచిప్స్‌లో వినియోగించే ఖనిజాల లభ్యత భూమిపై అంతంతమాత్రమే. ఈ ఖనిజాల అన్వేషణ జరిగితే, మన దేశ పారిశ్రామికాభివృద్ధికి, అభివృద్ధికి తోడ్పడగలదు. కాగా చంద్రుడిపై అడుగుపెట్టిన దేశాలను, సేకరించిన ఖనిజ సంపదపై, వలసలు ఏర్పరచుకోటానికి శాశ్వత యాజమాన్య హక్కులుంటాయా అన్నది శేష ప్రశ్న. కాగా ఐక్యరాజ్య సమితి (ఐరాస) 1966లోనే చంద్ర మండలం, దాని సంపద ఏ ఒక్క దేశానికి కాక అన్ని దేశాలకు చెందుతుందని ప్రకటించింది. చంద్రయాన్ 1, 2, 3 రాకెట్ల ప్రయోగానికి నాందిపలికిన పరిశోధనలకు కేంద్రం ఇస్రో, భారత్ అంతరిక్ష పరిశోధనాసంస్థ (మొదట్లో దీని పేరు INp AR)ను మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1962లో స్థాపించారు. ఆ తర్వాత 1969లో విక్రమ్ సారాభాయి, సతీష్‌ధావన్ వంటి శాస్త్రజ్ఞులు దీనిని అభివృద్ధిచేసి ఇస్రోగా నామకరణం చేశారు. అర్యభట్ట, ఇన్‌సాట్ తదితర అనేక ఉపగ్రహాలు ప్రయోగించే మనం నిత్యం వినియోగించే టీవీ, టెలిఫోన్ అంతర్జాత స్పెక్ట్రమ్, వాతావరణ, రిమోట్ సెన్సింగ్, వ్యవసాయ తదితర సమాచార సేకరణకు ఉపయోగించేవారు. కాగా 1990వ దశకం నుండి గ్రహాంతర వ్యోమనౌకల అభివృద్ధిని, సాంకేతికతను ప్రారంభించారు. 90వ దశకంలో రాకెట్లలో వినియోగించే ద్రవశీతల ఇంధనాన్ని (క్రియోజెనిక్ ఫ్యూయల్)ని సరఫరాను నిరాకరించి భారత్ అంతరిక్ష పరిశోధనలను అడ్డుకోవాలని ప్రయత్నించినా మన శాస్త్రజ్ఞుల కృషి ఫలితంగా నేడు చంద్రయాన్ 3 రాకెట్ ప్రొపల్షన్‌లో, గమనంలో వినియోగించే ఈ ఇంధనాన్ని మనశాస్త్రజ్ఞులే తయారు చేయడం గర్వకారణం. చంద్రయాన్ రాకెట్ ప్రయోగంలోని వివిధ దశలైన రాకెట్ ప్రొపల్షన్, చంద్రుని కక్ష్యలోకి ప్రవేశ పెట్టడం, రాకెట్ నుండి విక్రమ్ లాండర్‌ను (ప్రజ్ఞాన్ రోబోను కల్గి ఉన్నా) విడగొట్టి, లాండరును సురక్షితంగా చంద్రునిపై దింపటం, ప్రజ్ఞాన్ చలనం, సమాచార సేకరణ, భూమి నుండి



పంపే సూచనలకు అనుగుణంగా పనిచెయ్యటం, భూమికి తిరిగి సమాచారాన్ని పంపటం సాంకేతికలతో కూడినది, క్లిష్టమైనది. దీనిలో ఉపయోగించిన మౌలిక సదుపాయాల రూపకల్పన, కంప్యూటరు అల్గారిథమ్‌లు, సాఫ్ట్‌వేర్, రాకెట్లు, లాండరు,రోవర్ నిర్మాణం కేవలం స్వశక్తితో మన శాస్త్రజ్ఞులు, ఇంజినీర్లు చేయగలిగారు. వీరిలో ప్రధానపాత్ర వహించిన ప్రాజెక్టు డైరెక్టర్లు సోమనాథ్, డిప్యూటీ డైరెక్టరు వేరు ముత్తువేలు, ఉన్ని కృష్ణన్ సాయరు, డా. రిటూ కిరండాల్, శ్రీమతి కల్పన, శంకరన్ ప్రముఖులు. వీరే కాక 56 మంది మహిళా ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు ఎంతో తోడ్పడ్డారు. దాదాపు 60 ఏళ్ల ఇస్రో చారిత్రకత, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి, ప్రత్యక్షంగా చేసి నిరూపించిన వందల మంది శాస్త్రజ్ఞులకృషి ఎంతో ప్రశంసనీయం. వీరికి జేజేలు. కాగా ఇప్పటి వరకు పుష్పక విమానాలు, మంత్రోచ్ఛరణతో గ్రహాంతరయానం చేయవచ్చని పుక్కిట పురాణాలు, మూఢ విశ్వాసాలను ప్రచారం చేస్తూ వచ్చిన మతోన్మాదులు చంద్రయాన్ ప్రయోగానికి ముందు తిరుపతి వెంకటేశ్వరుని ఆశీస్సులు పొందటం, గత రెండు, మూడు రోజులుగా చంద్రయాన్ 3  విజయాన్ని కాంక్షిస్తూ హెూమాలు, పూజలు గుళ్లలో చేస్తూ వచ్చారు. అంటే ఎంతో కృషి చేసి శాస్త్రజ్ఞులు రూపొందించిన రాకెట్ ప్రయోగాలపై నమ్మకం, గౌరవం చూపకుండా కేవలం భగవంతుని ఆశీస్సులతో, కృపతో చంద్రయాన్ 3 విజయవంతం కావాలని కోరటం అశాస్త్రీయం. ఇది శాస్త్రజ్ఞుల కృషిని, సైన్సుని అవమానపరచటమే. కాగా చంద్రయాన్ ప్రయోగాలను టీవీలో, యూట్యూబ్‌లో ఉత్కంఠతో వీక్షించిన పాఠశాల, కాలేజీ విద్యార్థుల జిజ్ఞాస, ఉత్సుకత ప్రశంసనీయం. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెరగటం భవిష్యత్‌లో భారతదేశ శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి శుభసూచకం. ప్రస్తుత గ్రహాంతర యానాలు, పరిశోధనలు, సైన్సు ఆవిష్కరణలు కంపెనీలకు లాభాలు తెచ్చేవిగా కాక ప్రజా సంక్షేమానికి, సామాజికాభివృద్ధికి, ఉపయోగపడగలవని ఆశిద్దాం. ఇంతటి విజయానికి మూలమైన శాస్త్రవేత్తలకు గత నాలుగు నెలలుగా ఇవ్వని వేతనాలను తక్షణం చెల్లించాలి. అలాగే శాస్త్రవేత్తలకు పురస్కారాలు ఇవ్వాలి. ❑

# అనంత గొంతుకల అద్భుత భారత్!



- రాహుల్‌గాంధీ

'మాటలు హృదయం నుంచి వస్తే అవి ఆత్మలోకి ప్రవేశిస్తాయి' అని పర్షియన్ మహాకవి జలాలుద్దీన్ రూమి అన్నాడు. గత ఏడాది నేను 145 రోజులు పాదయాత్ర చేస్తూ గడిపాను. ఈ గడ్డపై కడలి నుంచి కొండ దాకా నడిచాను. కన్యాకుమారిలో సముద్రం అంచున ప్రారంభించి ఎండ, ధూళి, వానలో నడిచాను. అడవులు, పట్టణాలు, పర్వత సీమలను దాటుతూ నా ప్రియమైన కశ్మీర్ కోమల మంచు కొండలు చేరే వరకు నడిచాను. ఈ యాత్ర సాగిన అన్నిచోట్లా చాలా మంది నన్ను అడిగారు 'ఈ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారు ? ఎందుకు ఇలా ఆసేతు హిమాచలం నడుస్తున్నారు ? దేని కోసం మీరు చూస్తున్నారు? మీ లక్ష్యమేమిటి ? ఏమి కనుగొన్నారు ?' అని.

నేను ప్రేమిస్తున్నదేమిటి ? నా జీవితంతో సహా దేనినైనా వదులుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నది దేనికోసం? అనేక సంవత్సరాలుగా ఎంతో బాధను, తీవ్రమైన నిందలను భరించగలిగేలా నన్ను చేస్తున్నది ఏమిటి ? ఈ భూమా ? పర్వతాలా ? సాగరమా ? అది ఒక వ్యక్తా ? ప్రజా సమూహమా ? భావ సముదాయమా ? నేను అభిమానిస్తున్నదేమిటో నికరంగా తెలుసుకోదలిచాను. నేను అవగాహన చేసుకోదలిచింది ఇంకేదో ఉంది. అనేక సంవత్సరాలుగా నేను ప్రతీ సాయంత్రమూ ఎనిమిది నుంచి పది కిలోమీటర్ల దూరం పరుగెత్తుతుండేవాణ్ణి. ఈ కారణంగా రోజుకు 25 కిలోమీటర్లు నడవగలనని అనుకున్నాను. ఓ పాతిక కిలోమీటర్లు నడవడం ఎంతో తేలిక అని నేను నిశ్చితంగా భావించాను.

పాదయాత్ర ప్రారంభమైంది. కొద్ది రోజులలోనే నొప్పి నన్ను చేరింది. బాధ తీవ్రమైంది. గతంలో నా మోకాటి చిప్పకు గాయమైంది. దానితో కలిగిన నొప్పి కొద్ది గంటల ఫిజియోథెరపీతో పూర్తిగా తగ్గిపోయింది. అయితే ఇప్పుడు ఆ నొప్పి మళ్లీ తిరగబెట్టి ఎంతో బాధించసాగింది. మరుసటి రోజు ఉదయం కంటెయినర్‌లో ఒంటరిగా కూర్చున్నప్పుడు దుఃఖం ఆగలేదు. ఇంకా 3,800 కిలోమీటర్ల దూరాన ఉన్న గమ్యాన్ని ఎలా చేరుకోగలను ? కుమిలిపోయాను. గర్వం దిగిపోయింది. అహంకృత ఆసరా కూలిపోయింది.

పొద్దు పొడుపుకు ముందు విడీవీడని చీకటిలో నడవడం ప్రారంభించేవాళ్లం. వెంటనే మోకాటిచిప్పలో నొప్పి ప్రారంభమయ్యేది. ఆకలిగొన్న తోడేలు వలే అది నన్ను వెన్నంటి ఉండేది. నేను ఎప్పుడు నడక ఆపుతానా అని వేచి వుండేది. పాదయాత్ర ప్రారంభమైన కొద్దిరోజుల అనంతరం నా ఫిజియో థెరపిస్ట్ నాతో చేరాడు. నొప్పి నుంచి ఉపశమనం పొందేందుకు సలహాలు ఇచ్చాడు. అయినా బాధ మిగిలిపోయింది.

ఇక అప్పుడు ఒక కొత్త విషయం నా గ్రహింపులోకి రావడం ప్రారంభమయింది. పాదయాత్ర విరమిద్దామని ఆలోచించిన ప్రతీసారీ, నడకకు స్వస్తి చెప్పాలనే సూచనను పరిగణనలోకి తీసుకున్నప్పుడల్లా ఎవరో ఒకరు పాదయాత్రను కొనసాగించేందుకు అవసరమైన శక్తిని నాకు కానుకగా ఇచ్చేవారు. ఒకసారి ఒక చిన్న బాలిక, మరొకసారి ఒక వృద్ధురాలు. ముద్దు గొలిపే ఆ బాలిక ఒక అర్థవంతమైన లేఖను ఇచ్చింది. అనురాగమైన ఆ వృద్ధ మూర్తి బనానా చిప్స్ ఇచ్చింది. అంతలో ఒక మనిషి హఠాత్తుగా పరుగెత్తుకు వచ్చి నన్ను ఆలింగనం చేసుకున్నాడు. ఒక నిశ్శబ్ద శక్తి నన్ను ఆవహించినట్టనిపించేది. అది నా లక్ష్య పరిపూర్తిలో ముందుకు సాగేలా చేసేది. అవును, చీకటి గుయ్యారంలా ఉన్న అడవిలో మిణుగురుల్లా, ఆ శక్తి ఎల్లెడలా నన్ను ఆవహిస్తుండేది. కొత్త శక్తి నాకు నిజంగా అవసరమైనప్పుడల్లా అది నాకు తోడయ్యేది, నేను ముందుకు సాగిపోయేందుకు మార్గదర్శిగా ఉండేది.

పాదయాత్ర పురోగమించింది. తొలుత, నేను ఆలోచిస్తున్న దాన్ని, నా భావాలను ప్రతి ఒక్కరికి చెప్పాలని ఆకాంక్షించాను, ఆరాటపడ్డాను. మీరు ఎదుర్కొంటున్న సమస్యలను నేను అర్థం చేసుకున్నానని వారికి స్పష్టం చేయదలిచాను. వారి సమస్యలకు పరిష్కారాల గురించి మాట్లాడాను. కొద్ది రోజుల్లోనే నా వద్దకు వస్తున్న ప్రజల సంఖ్య బాగా పెరిగిపోయింది. నా మోకాటి చిప్పలో నొప్పి మళ్లీ తీవ్రమవసాగింది. వెల్లువలా వస్తున్న జనసమూహాలను అలా చూస్తూండేవాడిని. చిన్నా పెద్దా ప్రతీ ఒక్కరూ చెప్పే దానిని శ్రద్ధగా వింటూండేవాడిని. మేము నడుస్తున్న ప్రదేశంలో నిరంతరం కోలాహలం నిండుగా ఉండేది. చెవులు చిల్లులు పడే శబ్దాలు మారుమోగుతుండేవి. నినాదాలు నింగిలో ప్రతి ధ్వనిస్తుండేవి. కెమెరాలు క్లిక్‌మంటూ దృశ్య ఘోషలు విన్పిస్తుండేవి. అయినా, ప్రతీ రోజూ ఎనిమిది నుంచి పది గంటలపాటు నేను కేవలం ఒక శ్రోతగా ఉండేవాణ్ణి.

ఉన్నట్టుండి ఒక రోజు పూర్తిగా మూకీ భావంలోకి జారిపోయాను. అటువంటి అవ్యక్తానుభూతిని నేను అంతకు ముందు ఎన్నడూ పొందలేదు. నా చేయి పట్టుకుని నాతో మాట్లాడుతున్న

వ్యక్తి గళం తప్ప నాకు ఏమీ విన్పించడం లేదు. వినలేకపోతున్నాను కూడా. నేను బాలుడిగా వున్న నాటి నుంచి నాతో మాట్లాడే, నన్ను ప్రేరేపించే అంతర్వాణి నా నుంచి వెళ్లిపోయింది. అతడు ఒక రైతు. తన పొలాలు, పంటల గురించి మాట్లాడాడు. పాడైపోయిన పత్తిని చూపిస్తూ బాధతో వణికిపోయాడు. కన్నీటితో తడిసిపోయాడు. అతని కళ్లలో ఆశాజ్యోతులు ఆరిపోవడాన్ని గమనించాను. సంవత్సరాలుగా కూడగట్టుకొని ఉన్న బాధను అతని చేతుల్లో చూశాను. పనికిరాకుండా పోయిన పత్తిలో అతడు తన బిడ్డల భవిష్యత్తు కోసం పడుతున్న వేదన కనిపించింది. ఎండిపోయిన చూపులతో వెలవెలపోతున్న అతని ముఖంలో ఆకలి దప్పులతో అతడు గడిపిన అనేక రాత్రులను చూశాను. తనకు జన్మనిచ్చిన తండ్రి దీనంగా చనిపోతుంటే తాను ఎలా నిస్సహాయంగా చూస్తూ ఉండిపోవలసివచ్చిందీ అతడు చెప్పాడు. తన భార్యకు ఇవ్వడానికి తన వద్ద నయా పైసా కూడా మిగలకపోవడం ఎంత అవమానకరమయిందో ఆ అన్నదాత చెప్పాడు. నేను చెప్పగలిగేది ఏముంటుంది? నడక ఆపేసి, అతడిని ఓదార్పుగా కౌగలించుకున్నాను.

ఇటువంటి అనుభవమే మళ్లీ మళ్లీ ఎదురయింది. బాలలతో సంభవించింది. మాతృమూర్తులతో తటస్థించింది. విద్యార్థులతో జరిగింది. దుకాణదారులు, వడ్రంగులు, శ్రామికులతో సంభవించింది. విశ్రాంత సైనికులూ తమ బాధలూ వెళ్లబోసుకున్నారు. నాకు నా మనోరోదన వినబడటం లేదు, చుట్టూ ఉన్న శబ్దాలూ వినపడటం లేదు. నా చెవిలో మాట్లాడుతున్న వ్యక్తి నుంచి నా దృష్టి ఏ మాత్రం మరలడం లేదు. నాలో అప్పటికే గూడుకట్టుకొని ఉన్న నిశ్చితాభిప్రాయాలు నా నుంచి వెళ్లిపోతున్నాయి. తాను పరీక్షల్లో పాస్ కాలేకపోతానేమోనని ఒక విద్యార్థి భయాందోళనలతో అన్నప్పుడూ నేను వింటాను. బతకడానికి వీధుల్లో బిచ్చమెత్తుకోవడం మినహా గత్యంతరంలేని బాలలు కొంత మంది ఒక ఉదయం నా ముందు వణుకుతూ కన్పించినప్పుడు ఇకపై నేను నా టీ షర్ట్‌లోనే నడవాలని నిర్ణయించుకున్నాను. నేను అభిమానిస్తున్నదీ, ఆరాటపడుతున్నదీ నా కళ్ళముందు ఆవిష్కృతమైంది. నా ప్రియతమ భారతదేశం ఒక భూ ఖండం కాదు. అదొక భావ సముదాయం కాదు. అదొక ప్రత్యేక సంస్కృతి, చరిత్ర, మతం కాదు. ప్రజలకు ఆపాదించే కులం అంతకంటేకాదు. అది ప్రతీ ఒక్క భారతీయుని గళం. అది ఎంత బలహీనమైనదైనా శక్తిమంతమైనదైనా కావచ్చు. కోటానుకోట్ల గళాల్లో నిగూఢంగా దాగి ఉన్న ఆనందం, భయం, బాధల సమస్తమే భారత్. ఇండియా వాణిని చెవొగ్గి వినేందుకు నా గళం, నా అకాంక్షలు, నా ఆరాటాలు నిశ్శబ్దమవాలి. నేను మౌనంగా ఉన్నప్పుడు, విన్నప్పుడు మాత్రమే అది తన సొంత మనిషితో మనసు విప్పి మాట్లాడగలుగుతుంది. ❑

# సత్యమేవ సైన్స్

- ప్రసాదమూర్తి

అయ్యా నన్ను ప్రయోగించండి అంతరిక్ష కక్ష్యలోకి
చంద్రయాన్.. సూర్యయాన్.. అంగారక మహాయాన్
పేరు ఏదైనా పెట్టండి – నన్ను ప్రయోగించండి
అనంత కాంతి మండలాల బ్రహ్మాండంలోకి
నా దేహం వెలుపల నా దేశం వెలుపల
నా భూమి వెలుపలు అన్ని కక్ష్యలూ దాటాలంటే
నా ఆత్మ చుట్టూ ఉన్న కక్ష్యలోకి ముందు ప్రవేశించాలి
పర్వాలేదు యుగాలు పట్టినా సరే
నన్ను సరిగ్గా నా కక్ష్యలోనే ప్రవేశపెట్టండి
ప్రయోగమే ముఖ్యం ప్రయాణం అదే సాగుతుంది
నా ప్రతి వైఫల్యమూ నా వైభవ విజయ సోపానమే
నన్ను ప్రవేశపెట్టండి నా కలల కక్ష్యల్లోకి
నన్ను ప్రయోగించే చేతులకు ఏ చీకటి మరకా అంటకూడదు
నన్ను చూసే చూపులకు ఏ అజ్ఞాన ధూళి పొరా కమ్మకూడదు
స్వచ్ఛ లోకాలవైపు నా ప్రయాణానికి
మీ స్వేచ్ఛా కాంక్షలే ఇంధనం
మనిషి చుట్టూ మనిషిని తిప్పే ప్రతి మనిషీ ఒక సైంటిస్టే
అయ్యా నన్ను తిప్పండి నా చుట్టూ
నా రోవర్ నాలుగు కాళ్లూ విజ్ఞానమే
నా ల్యాండర్‌లో ప్రతి అవయవమూ విజ్ఞానమే
నేను ఒక ఆర్బిట్ నుండి మరొక ఆర్బిట్‌లోకి ప్రవేశించిన ప్రతిసారీ
పెళ్ళలు పెళ్ళలుగా బెరళ్ళు బెరళ్ళుగా
కులాలు మతాలు ప్రాంతాలు సరిహద్దులు సమస్తం రాల్చుకుంటూ
నన్ను నేను పేల్చుకుంటూ అనంతశూన్యంలో
నా దందహ్యమాన ఆత్మ నుంచి
నన్ను నేను కొత్తగా పేర్చుకుంటూ
పైపైకి దూసుకుపోతాను
చంద్రుడి కక్ష్యలోకి వెళ్తాను సూర్యుడి కక్ష్యలోకి వెళ్తాను
అంగారకాది అనంత గోళాల మహాకాంతి కక్ష్యల్లోకి వెళ్తాను
అక్కడ నా సేఫ్ ల్యాండింగ్ దృశ్యాలను
మీ కోసం వెలుగు వానలుగా కురిపిస్తాను
నన్ను ప్రయోగించండి నాలోకి నన్ను నాలోంచి నన్ను
అఖండ బ్రహ్మాండ వీధుల్లోకి ప్రయోగించండి
తిరిగి తిరిగి విశ్వరహస్యాలలో
సంచరించి సంచరించి
ఒకే ఒక్క వార్త మోసుకొస్తాను
సైన్సే సూనృతం.. సైన్సే శాశ్వతం.

(చంద్రయాన్ – 3 సక్సెస్ కోరుకుంటూ, 23-08-23)

# ప్రాచీన విజ్ఞాన శాస్త్రం - హిందూత్వ



- ప్రబీర్ పురకాయస్థ

**ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలను అభివృద్ధి చేయాలని భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో నిర్దేశించడం జరిగింది. పౌరులు తమ ప్రాథమిక కర్తవ్యాల్లో భాగంగా 'శాస్త్రీయ ఆలోచనలను, మానవత్వాన్ని (మానవతా వాదాన్ని), ప్రశ్నించే తత్వాన్ని, సంస్కరణ స్వభావాన్ని అభివృద్ధి చేయాలని' భారత రాజ్యాంగంలోని 51A(h) అధికరణం నిర్దేశిస్తోంది! నానాటికి పెరుగుతున్న అసహనం, అసమ్మతిని అణచివేసే పరిస్థితులకు వ్యతిరేకంగా నిరసన గళమెత్తుతున్న మేధావుల సంఖ్య నానాటికి పెరుగుతోంది.**

ఇటీవల దేశంలోని మరో 107 మంది ప్రముఖ శాస్త్రవేత్తలు వీరితో చేతులు కలిపారు. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు భిన్నంగా ప్రభుత్వంలోని ప్రధాన కార్యనిర్వాహకులే హేతువిరుద్ధమైన, దురభిమానపూరిత భావాలను ప్రోత్సహించడం మనం చూస్తున్నాం. అవి వీరు తమ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్.ఎస్.ఎస్ దాని అనుచరులు తాము భావించే ఆర్య భారతం యొక్క గొప్పదనాన్ని గురించి, గొప్పగా చెప్పే ఆతురతలో, విజ్ఞాన శాస్త్రంలో వేదాలే అంతిమమని, పురాణాల్లో చేసిన కల్పనలను ఆధారం చేసుకుని, చారిత్రక వాస్తవాలుగా చిత్రించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక కొత్తగా పరిశోధించి కనుగొనవల్సిన విషయాలు ఏమీ లేవని, వాటిన్నింటిని గతంలోనే మన రుషులు కనుగొన్నారని చేస్తున్న మోసపూరిత వాదనల మీదనే పూర్తిగా ఆధారపడుతున్నారు. ఇది విజ్ఞాన శాస్త్రం గురించి బాత్రా కథనం.

ఆర్.ఎస్.ఎస్ సృష్టించిన 'ఇతిహాస్ బచావో ఆందోళన (ఇతిహాసాలను రక్షించాలని కోరే ఉద్యమం)' అనే సంస్థను దీనానాథ్ బాత్రా నిర్వహిస్తున్నారు. గుజరాత్ పాఠ్య ప్రణాళికలో భాగమైన తేజోమయ భారతం (ప్రకాశవంతమైన భారతంలో ఆయన ఈ విధంగా వ్రాశారు. "మానవ శరీరంలోని కణ నిర్మాణంలో అత్యంత ముఖ్యమైన స్టెమ్సెల్స్ (మూలకణాలు)ను కనుగొన్న పరిశోధనలకు సంబంధించిన ఖ్యాతిని తన ఖాతాలలో వేసుకోవాలని అమెరికా కోరుకుంటోందని, అయితే వాస్తవానికి డాక్టర్ బాలక్రిష్ణ గణపత్ మాతాపుర్కార్, శరీరంలోని వివిధ అవయవాల పునరుత్పత్తికి సంబంధించిన పేటెంట్‌ను ఇప్పటికే పొంది వున్నారు. ఈ పరిశోధనలు ఏ మాత్రం కొత్త కాదంటే మీకు ఆశ్చర్యం కలుగవచ్చు. డాక్టర్ మాతాపుర్కార్ మహా భారతం (92-93 పేజీలు) నుండి ప్రేరణ పొందాడు. గాంధారి గర్భంలోని ఒక్క అండం నుండి 100 మంది కౌరవుల జననం, ప్రాచీన భారతంలో స్టెమ్సెల్ పరిశోధనకు ఒక ఉదాహరణేగాని, కేవలం కల్పిత గాథ కాదు" అని ఆయన రాశాడు. మహాభారత కాలంలోనే టెలివిజన్లు ఉన్నాయని ఆయన తన పుస్తకాల్లో పేర్కొన్నాడు. మహాభారత యుద్ధానికి సంబంధించిన వివరాలను దూరం నుండే ధృతరాష్ట్రునికి వివరించడాన్ని చూస్తే, ఆనాడే టెలివిజన్లు వున్నాయని చెప్పడానికి ఉదాహరణగా ఆయన పరిగణించాడు. భారతీయ పురాణాల్లో గణేశునికి ఏనుగు తలను అమర్చడానికి కాస్మెటిక్ (సౌందర్య సాధక) శస్త్ర చికిత్సగా పరిగణించాలని ఆయన పేర్కొన్నాడు.

సైన్సుకు సంబంధించి బాత్రా దృక్పథాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడి కూడా బలపర్చాడు. గత ఏడాది ప్రసంగిస్తూ ప్రాచీన భారతదేశంలోనే జన్యుశాస్త్రం, అవయవ మార్పిడి అందుబాటులో వుండేవని పేర్కొన్నాడు. 'మన దేశానికి ఈ శక్తి సామర్థ్యాలు ఉన్నాయని చెప్పడమే నా వుద్దేశ్యం. వీటిని తిరిగి సాధించాల్సిన అవసరం వుంది' అని ఆయన అన్నారు. సైన్సుతో పనిలేదు. సంస్కృతం చదువుకోండి. ఇంకా ప్రగతి సాధించన వసరం లేదు. 'ప్రాచీన' విజ్ఞానాన్ని తిరిగి సంపాదించుకుంటే సరిపోతుంది. మోడి హయాంలో సైన్సుకు బడ్జెటు కేటాయింపుల్లో నిరంతరం కోత విధించడం ఆశ్చర్యకరమైన విషయం కాదు. సైన్సు నుండి ప్రాచీన భారత చరిత్ర వరకు అన్ని విషయాలను అధికారికంగా ప్రకటించడం బి.జె.పి కుట్ర పూరిత ప్రణాళికలో భాగం కావడం అంత ఆశ్చర్యకరమైన విషయం కాదు. ప్రాచీన భారత విజ్ఞాన శాస్త్రం మీద, నిర్వహించబడిన భారతసైన్స్ కాంగ్రెస్ సమావేశాల సందర్భంగా, ముంబై విశ్వ విద్యాలయంలోని సంస్కృతం విభాగం ప్రాచీన భారత విజ్ఞాన శాస్త్రం మీద ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి, రుగ్వేదం ఐదు వేల నుండి పది వేల సంవత్సరాల ప్రాచీనమైనదని, ఆర్యులు భారతదేశానికి వలస వచ్చిన వారు కాదని ప్రకటించింది.

'సాక్ష్యాధారాల' స్థానంలో 'విశ్వాసాల'ను నిలబెట్టి, వాటిని హిందూత్వ హిందూ మతోన్మాద శక్తులు ప్రచారం చేస్తున్నాయి. అప్పుడు విశ్వాసాల మీద ఆధారపడి పురాణాలు, కాల్పనిక గాథలు 'నిజమైన' చరిత్ర అయిపోతాయి. కేవలం వేదాలు, రామాయణ, మహాభారతాలనే ప్రామాణిక సాక్ష్యాలుగా

ఉపయోగించాలని, వీటిలో విభేదించే ఏ విధమైన భాషాశాస్త్రం, పురావస్తు పరిశోధన ఫలితాలు, ఇతర మూల గ్రంథాలను పరిగణనలోకి తీసుకోనవసరం లేదని, భారత చరిత్ర పరిశోధన మండలి (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారిక్ రీసెర్చ్ – ICHR) ప్రస్తుత అధిపతి వై.ఎస్. రావు ప్రబోధిస్తున్నాడు.

ఉదాహరణకు, కార్బన్ ఐసోటోపు సహాయంతో మానవుడు నిర్మించిన వస్తువుల కాలాన్ని నిర్ణయించే విధానం ద్వారా శాస్త్రీయంగా వేదకాలాన్ని 3500 సంవత్సరాల ముందు కాలంగా నిర్ణయించగా, ఈ ప్రమాణాన్ని తోసి పుచ్చి, మౌఖిక (ఆ నోట ఈ నోట చెప్పుకున్న) సంప్రదాయం ప్రకారం వేద కాలాన్ని పది వేల నుంచి 20 వేల ఏళ్ల పురాతనమైనదిగా చెప్పడం జరిగింది.

చరిత్రను శాస్త్రీయంగా అవగాహన చేసుకోవడానికి, సాక్ష్యాధారాల ప్రాతిపదిక తన పరిశోధనలు చేసి, ప్రజలు ఏ విధంగా జీవనం సాగించిందో, సమాజం ఏ విధంగా అభివృద్ధి చెందిందీ అనే అంశాల గురించి ఒక పొందికైన విధంగా చరిత్రను రూపొందించాలి. మౌఖికమైన లేదా రాత పూర్వకమైన అంశాలను ఇతర సాక్ష్యాధారాల ద్వారా ప్రామాణికం చేయాల్సి వుంటుంది. ఇతర శాస్త్రాల వలెనే చరిత్ర కూడా శాస్త్రీయమైన పరిశీలన, విచారణలకు సంబంధించిన సానుకూల, ప్రతికూల పరిణామాలను విమర్శనాత్మకంగా పరిశీలించడమే. ఇది దీనానాథ్ బత్రా లేదా వైఎస్ రావులకు గిట్టదు. వారి దృష్టిలో తమ విశ్వాసాలను ధ్రువీకరించకపోయినట్లయితే హేతుబద్ధతకు అర్థమే లేదు. ఈ విశ్వాసాలు ప్రాచీన హిందూ మత ప్రభావాన్ని కీర్తించడానికి మాత్రమే. కాల్పనితకు వాస్తవికత ముసుగు వేసే ఈ దృష్టి కోణం కేవలం చరిత్రకే గాక, సైన్సు, గణితాలకు కూడా నష్టం వాటిల్లజేస్తుంది. ఇది సైన్స్, గణితం, చరిత్రలను సహితం ధ్వంసం చేస్తుంది. కొత్త ఆవిష్కరణలను మన శాస్త్రజ్ఞులు కనుగొన్నట్టుగా కాక కేవలం సంస్కృతం చదువుకుని అందులో ఉన్న వాటినే తిరిగి ఆవిష్కరించినట్టు అవుతుంది.

### భారతీయ శాస్త్ర విజ్ఞానం వాస్తవ చరిత్ర :

ఖగోళం, గణితం, తర్కం, న్యాయశాస్త్రం, వైద్యం మరియు భాషలకు సంబంధించి ప్రాచీన భారతం ఎంతటి ప్రగతి సాధించిందో నిరూపించేందుకు అనేక సాక్ష్యాధారాలున్నాయి. లోహ శాస్త్రం(మెటలర్జీ)లో బ్రహ్మాండమైన ప్రగతి సాధించి, ఉక్కుగా ప్రసిద్ధి గాంచిన గట్టి ఇనుమును తయారు చేయడం జరిగింది. ఇది యూరపులో డమాస్కస్ స్టీల్‌గా ప్రసిద్ధిగాంచిన గట్టి ఇనుము (స్టీల్)కంటే శ్రేష్ఠమైనది.

గణితశాస్త్రంలో ఇతర అంకెల వలెనే 'సున్నా'ను ఉపయోగంలోకి తేవడం గణితశాస్త్రానికి, భారతీయ గణిత శాస్త్రం విశేష సేవలందించింది. క్రీ.శ. 476 సం॥లో జన్మించిన ఆర్యభట్టు స్థానానికి విలువ ఇచ్చే పద్ధతి (place value Notation ఒక సంఖ్యలోని అంకె వున్న స్థానానికి విలువ ఇచ్చే పద్ధతి, ఉదాహరణకు ఒక సంఖ్యలో ఒకట్ల స్థానం, పదుల స్థానం, వందలస్థానం వగైరా)ని స్పష్టమైన విధంగా సూత్రీకరించాడు. 'స్థానం స్థానం దశగుణం' అంటే ఒక స్థానంలో వున్న అంకెను పదితో గుణిస్తే తర్వాత స్థానం వస్తుంది. ఇప్పుడు పాకిస్థాన్‌లో వున్న పెషావర్‌కు సమీపంలోని భక్షాలీలో లభించిన భూర్జపత్రాలు (ఒక రకమైన కొండ రావి చెట్టు బెరడు) మీద రాయబడిన భక్షాలీ రాత ప్రతిలో వున్న విజ్ఞానాన్ని పరిశీలిస్తే, అది క్రీ.శ. 2 నుంచి 4వ శతాబ్దం మధ్య కాలానికి చెంది వుంటాయని భావించడం జరుగుతోంది. అయితే, అసలు ప్రతి అంతకుముందు నాటి పాత ప్రతులకు నకలుగా పరిగణించడం జరుగుతోంది. ఇది ఒక సంఖ్యలో అంకెకు వున్న స్థానం యొక్క విలువను సూచిస్తుంది.

ఆర్యభట్టుకన్నా చిన్నవాడైన ఆయన సమకాలికుడైన వరాహ మిహిరుడు 'సున్నా'ను గణిత సంబంధమైన లెక్కల్లో మొట్ట మొదటసారి వుపయోగించాడు. అయినప్పటికి 'సున్నా'ను గణితంలో వుపయోగించుకునేందుకు సంబంధించిన నిబంధనలు రూపొందించిన బ్రహ్మగుప్తునికి మనం రుణపడి వున్నాం. సున్నాతో కూడికలు, తీసివేతలు, హెచ్చవేతల (గుణింతం)కు సంబంధించిన నిబంధనలను ఆయన సరిగ్గా రూపొందించినప్పటికీ, సున్నాతో భాగించడం విషయంలో ఆయన ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. అసలు భాగాహారాన్ని రద్దు చేయడం ద్వారా, ఆధునిక గణితశాస్త్రం ఈ సమస్యను పరిష్కరించింది. అంకెలను సంబంధించి నేడు మనం వినియోగిస్తున్న చిహ్న(గుర్తు)లను భారతదేశమే అందించడం చాలా ఆసక్తికరమైన విషయం. బ్రాహ్మ లిపిలో ఉపయోగించిన అంకెల నుంచే వీటిని గ్రహించడం జరిగింది. జైన గణితంలో ప్రధాన ప్రతులను రూపొందించిన ప్రాకృత భాషలో బ్రాహ్మి లిపి ని విస్తృతంగా ఉపయోగించడం జరిగింది. యూరపు, ఆంగ్లో–అమెరికన్ విలువలు, అనుభవాల ప్రాతిపదికగా (యూరో సెంట్రిక్) చేసిన నూతన ఆవిష్కరణలకు సంబంధించిన కథనాల్లో భారతదేశంలోని సమాజాల పాత్రను పరిశీలించిన విధంగానే, ఇతర సమాజాల పాత్రను తక్కువచేసి చూపడం జరిగింది.

### పైథాగరస్ సిద్ధాంతం :

ఈ సిద్ధాంతాన్ని పైథాగరస్ అనే గ్రీకు గణిత శాస్త్రజ్ఞుడు కనిపెట్టాడు. మిక్కిలి ప్రసిద్ధి పొందిన రూపంలో ఈ సిద్ధాంతం ప్రకారం, ఒక లంబ కోణ త్రిభుజంలో కర్ణం (లంబ కోణానికి ఎదురుగా వున్న భుజం) మీద చదరం, మిగిలిన రెండు భుజాల మీద చదరాల మొత్తానికి సమానం. వేర్వేరు పద్ధతుల్లోనైన

ప్పటికీ ఇతర సమాజాల్లోను ఈ అవగాహన తెలిసినదే. అయితే ఇవి భారతదేశంలో వేదాలకు అనుబంధాలుగా భావించబడుతున్న శ్రుత సూత్రాల్లో భాగమైన సులభ సూత్రాల్లో (కొలతలకు సంబంధించిన వివరాలు భాగంగా ఉన్నాయి. ఈ సులభ సూత్రాలు), మతపరమైన కార్యకలాపాలకు అవసరమైన బలి పీఠాలు లేదా హెూమగుండాలు లేదా వేదికలను వివిధ రకాలుగా ఏ విధంగా తయారు చేయాలో వివరిస్తాయి. వీటిలో ప్రధానమైన బౌధాయన సులభసూత్రాలు క్రీ.పూ. 700 నుండి 800 సంవత్సరాల మధ్యకాలంలోనూ, క్రీ.పూ 600 సంవత్సరాల ప్రాంతంలో ఆపస్తంబ, క్రీ.పూ. 750 ప్రాంతంలో 750 మానవ, క్రీ.పూ. 200 ప్రాంతంలో కాత్యాయన సులభసూత్రాలు సంకలనం చేయబడ్డాయి.

సులభ సూత్రాలు త్రిభుజాలకు బదులుగా దీర్ఘ చతురస్రాన్ని ఉపయోగించి, ఈ సిద్ధాంతానికి ఒక భిన్నమైన సూత్రీకరణ చేయడం జరిగింది. ఒక లంబకోణం త్రిభుజంలోని మూడు భుజాల మధ్య రేఖా గణిత సంబంధం గ్రంథకర్తలకు తెలుసుననే విషయం మూల గ్రంథాల నుంచి స్పష్టమవుతోంది. దీనికి అనుగుణంగానే వున్న పైథాగరియన్ ట్రిప్లెట్‌లో పేర్కొనబడుతున్న 'సెట్ ఆఫ్ నంబర్స్' కూడా వారికి తెలుసు.

పైథాగరస్ సిద్ధాంతం కేవలం భారత్, గ్రీస్‌లోనే గాక బాబిలోన్, చైనా, ఈజిప్టుల్లో కూడా తెలిసివుండడమే గాక, ఈ దేశాల్లో భూములు కొలిచేందుకు, మతపరమైన కట్టడాలను నిర్మించేందుకు(ఈజిప్టులో పిరమిడ్లు, భారతదేశంలో హెూమ గుండం నిర్మాణానికి), కాల్వల నిర్మాణానికి (బాబిలోను వలె) యోగించడం జరుగుతుండేది. సులభ సూత్రాల సంకలనానికి ముందుగానే క్రీ.పూ.1800వ సంవత్సరానికి ముందే విద్యార్థుల కు బోధించేందుకు 'బాబిలోనియన్ టాబ్లెట్'లను వుపయోగించేవారు. వారికి పైథాగరేనియన్ ట్రిప్లెట్లు, పైథాగరస్ సిద్ధాంతం గురించి తెలిసినట్లు స్పష్టమవుతోంది. ఈజిప్టు, బాబిలోన్ దేశాలు సరుకులు, విజ్ఞానం, మూల గ్రంథాలను పరస్పరం మార్పిడి చేసుకోవడం సర్వ సాధారణమైన విషయంగా వుండేది. ఈజిప్టు స్వతంత్రంగానూ, బాబిలోన్ ద్వారాను పైథాగరస్ సిద్ధాంతానికి సంబంధించిన విజ్ఞానాన్ని సమకూర్చుకుంది. పైథాగరస్ తన జీవితంలోని తొలి రోజుల్లో గణనీయమైన కాలాన్ని ఈజిప్టులో గడిపి, ఈజిప్షియన్ల నుండి గణితశాస్త్రం నేర్చుకున్నట్లు తెలుస్తోంది. చైనాలో కూడా పైథాగరస్ సిద్ధాంతం గురించి బాగా తెలుసు. చైనాలో పైథాగరస్ సిద్ధాంతాన్ని కోయూ-క్యూ (kou-ku) సిద్ధాంతంగా వ్యవహరిస్తుండేవారు.

వివిధ సంస్కృతులకు ఆలవాలమైన అనేక ప్రాంతాల్లో పైథాగరస్ సిద్ధాంతం ప్రాశస్త్యం పొందినట్లు పండిత ప్రకాండులు సైతం అంగీకరించారు. వివిధ సమాజాలు కొన్ని సందర్భాలలో విజ్ఞానం పరస్పరం మార్పిడి చేసుకోవడం ద్వారానూ, మరికొన్ని సందర్భాల్లో స్వతంత్రంగానూ, ఒకే సమయంలో ఒకే విధమైన నూతన ఆవిష్కరణలను చేసిన విషయాన్ని ఇక్కడ గమనించ వలసి వుంది. ప్రాచీన భారతంలో శాస్త్రజ్ఞులు చేసిన నూతన ఆవిష్కరణల(పరిశోధించి కనుగొన్న విషయాల పట్ల గర్వపడవ ల్సిందే. అయితే అదే సమయంలో మొత్తం విజ్ఞానానికి కేవలం భారతదేశం ఒక్కటే భాండాగారం వంటిదనే సిద్ధాంతాలను సృష్టించడం. ఇక మనం చేయవల్సిందల్లా వేద గణితం శాస్త్ర విజ్ఞానానికి సంబంధించిన ఇతర అంశాలను బోధించడం మాత్రమేనని గొప్పలు పోవడం, ప్రాచీన భారతంలో శాస్త్రజ్ఞుల విశిష్ట కృషికి చిహ్నంగా నిలిచిన మార్పులకు, శాస్త్ర విజ్ఞానానికి సంబంధించిన నూతన అంశాలను ఆవిష్కరించే స్ఫూర్తి, చైతన్యాలను తీవ్రంగా దెబ్బ తీస్తుంది.

## వేద గణితం - విజ్ఞాన సముపార్జన స్ఫూర్తి

పూరీ శంకరాచార్య స్వామి భారతీకృష్ణ తీర్థ వేదగణితం పేరిట అనేక వాదనలు ముందుకు తెచ్చాడు బొంబాయి IITలో గణిత శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చి (CSIR) సంస్థ, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన రంగంలో విశిష్ట పరిశోధనలు చేసిన వారికి ప్రతి ఏడాది అందించే శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డును గణితశాస్త్రంలో 1990 సంవత్సరంలో గణిత శాస్త్రవేత్త, భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని (NBHM) ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన వాడు, 2007లో థర్డ్ వరల్డ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ శ్రీకృష్ణ గోపాలరావు, ప్రొఫెసర్ డానీ తదితరులు వేద గణితానికి, ప్రాచీన గణిత శాస్త్రానికి, వేదాలకు ఏ విధమైన సంబంధం లేదని నిరూపించారు. అంతేగాక నేటి కాలిక్యులేటర్లు, కంప్యూటర్లు యుగంలో వీటికి ప్రాధాన్యత లేదు. వేద గణితానికి పురాతనత్వాన్ని ఆపాదించినప్పటికీ, వేదాలకు సంబంధించి ప్రస్తుతం అందుబాటులో వున్న సాహిత్యంలో అధర్వణ వేదానికి సంబంధించిన మూల గ్రంథంలో ఈ అంశాలు లేవు.

హిందూత్వ లాబీకి సంబంధించినంత వరకు, కల్పనతో కూడిన గతమే యావత్ విజ్ఞానానికి భాండాగారం వంటిదని, ప్రస్తుతం మనకు తెలిసిన (అందుబాటులో వున్న) చరిత్ర అంతా కోల్పోయిన ఈ విజ్ఞానాన్ని తిరిగి రాబట్టడం మాత్రమే. నిరంతరం సాగుతున్న పరిణామాల పరంపరే వాస్తవ చరిత్ర. సులభ సూత్రాలకు సంబంధించిన నాలుగు కథనాలు ఒకే విధంగా లేవు. విధానాల్లో స్పష్టమైన అభివృద్ధి, ఖచ్చితమైన ఫలితాలు, సమయాన్ని బట్టి సైద్ధాంతిక సూత్రీకరణలను ఇవి సూచిస్తాయి. అదేవిధంగా పది అంకె ప్రాతిపదికగా ఒక సంఖ్యలోని అంకె స్థానాన్ని బట్టి విలువ ఇచ్చే పద్ధతి (Place value Notation) నుండి, విలువనిచ్చే విధంగా సున్నాను వుపయోగించడం,

చివరకు వరాహ మిహిరుడు, బ్రహ్మగుప్తుడు సున్నాను ఒక సంఖ్యగా పరిగణించే స్థాయికి గణితశాస్త్రం అభివృద్ధి సాధించింది. సైన్సు, గణిత శాస్త్రాల చరిత్ర అంటే ఎవరు దేనిని ముందుగా కనిపెట్టారనేది కాక, విశాల ప్రాతిపదికన పువ్వెత్తున సాగిన అభివృద్ధి, దానిలో ఏ ఏ సాంస్కృతిక ప్రాంతాలు ఏ మేరకు భాగస్వామ్యం వహించిందీ, పైథాగరస్ సిద్ధాంతం, సంఖ్యా సిద్ధాంతం అభివృద్ధి స్పష్టం చేస్తున్నాయి. ఏదైనా నిర్దిష్ట సాంస్కృతిక ప్రాంతానికి చెందిన సాంస్కృతిక జాత్యహంకారుల వాదనలకు ఇది పూర్తిగా భిన్నమైనది.

### చరిత్ర గురించి హిందూత్వ జాత్యాహంకారుల దృక్పథంతో తారతమ్యాలు :

నేడు హిందూత్వ ప్రచారకులు సాగిస్తున్న ప్రచారానికి భిన్నంగా, ఆనాటి విదేశాల నుండి విజ్ఞానాన్ని స్వీకరించిన విషయాన్ని అంగీకరించడంలో భారతీయ విజ్ఞానశాస్త్రం ఏ మాత్రం సంకోచించలేదు. క్రీ.పూ. 6వ శతాబ్దంలో వరాహ మిహిరుడు ఖగోళ శాస్త్ర విజ్ఞానాన్ని సంకలనం చేసి రూపొందించిన 'ప్రపంచ సైద్ధాంతిక' (ఖగోళశాస్త్ర విజ్ఞానానికి సంబంధించిన 5 సూత్రాలను వివరించే గ్రంథం), గ్రంథంలోని 'పౌలిసా' (ఈ గ్రంథానికి మూలాలు గ్రీసులో, బహుశ అలెగ్జాండ్రియాలో వుండి వుండవచ్చు.) రోమక (దీని మూలాలు రోమ్ లేదా గ్రీసులో వుండి వుండవచ్చు)లను విదేశాల నుండి స్వీకరించినట్లు పేర్కొన్నాడు. అదేవిధంగా ప్రాచీన కాలం నాటి ఖగోళ శాస్త్రం, గణిత శాస్త్రాలకు సంబంధించిన విజ్ఞానం మీద బాబిలోన్ ప్రభావం వున్నట్లు కనబడుతుంది.

ఆ తర్వాత మధ్య యుగాల్లో అరబ్బులు భారతీయ గణిత శాస్త్రాన్ని, ఖగోళ శాస్త్రాన్ని, వైద్యం విజ్ఞానానికి సంబంధించిన గ్రంథాలను పశ్చిమాసియాకు తీసుకుని వెళ్ళారు. ప్రాచీన భారతంలోని మన శాస్త్రజ్ఞుల వలెనే, అరబ్ దేశాల్లోని శాస్త్ర వేత్తలు లామా విజ్ఞానాన్ని ఏ దేశం నుండి గ్రహించింది వెల్లడించడానికి సంకోచించలేదు. క్రీ.పూ. 8వ శతాబ్దంలో పశ్చిమాసియాలో ఫజారి ఖగోళశాస్త్రంలో భారతీయ విధానాలను ప్రవేశపెట్టాడు. ఈయన బంద్ హింద్ (భారతీయ ఖగోళశాస్త్ర విధానాలు) అనే గ్రంథంలోని బ్రహ్మగుప్తుని బ్రహ్మ స్ఫుట సిద్ధాంతానికి సంబంధించిన విజ్ఞానాన్ని సంకలనం చేశాడు. భారతీయ సంఖ్యా శాస్త్రం మీద 'కితాబ్ అల్ – గామ్' 'వా – అల్ – తాఫ్రిక్బీ–బీ' 'ఇసాబల్ – హింద్' పేరిట అల్ఖ్వార్జ్మే (9వ శతాబ్దం ప్రారంభంలో బాగ్దాద్‌లోని హౌస్ ఆఫ్ విజ్ డమ్ సభ్యుడయ్యాడు. వివిధ రంగాలు, సంస్కృతులకు సంబంధించిన సమాచారాన్ని, ఆలోచనలను పంచుకునేందుకు ఏర్పాటు చేయబడిన విద్య, పరిశోధన సంస్థ హౌస్ ఆఫ్ విజ్డమ్) దీనిలో యూదు, క్రైస్తవ మత నేపథ్యం కల్గిన వారితో సహా అనేక మంది ప్రసిద్ధిచెందిన పండితులు దీనిలో భాగస్వాములు) ఒక ప్రామాణిక గ్రంథాన్ని రచించారు. దీనిని అల్గోరిత్మ డి నూమెరో ఇండోరమ్ (అల్–ఖ్వారిజ్మి ఆన్ ది హిందూ ఆర్ట్ ఆఫ్ రికనింగ్) (లెక్కలు వేయడంలో హిందువుల కౌశలం) పేరిట లాటిన్ భాషలోకి తర్జుమా చేయడం జరిగింది. 'లిబర్ అబాకీ' (బుక్ ఆఫ్ కాలిక్యులేషన్స్) అనే పుస్తకం ద్వారా భారతీయ సంఖ్యా శాస్త్రాన్ని వియోనార్టో ఆఫ్ పీసా యూరపు అంతటా వ్యాప్తిలోకి తెచ్చాడు. మధ్య యుగాల్లో భారత సాంకేతిక పరిజ్ఞానం పెద్ద ఎత్తున అభివృద్ధి సాధించింది. హిందూత్వ జాత్యహంకార ఆలోచనా విధానం ఈ ప్రగతిని పక్కన పెట్టింది. మధ్య ఆసియా, పశ్చిమాసియాల మధ్య పరస్పర సంబంధాల వల్ల భారత దేశంలో అనేక నూతన విధాలైన శిల్పకళ, ఇంద్రధనుస్సు ఆకారంలో ఆర్చీలు (తోరణాలు), గోపురాలు నిర్మించే శక్తి, సామర్థ్యాలను సంతరించుకోవడంతోపాటు, కాగితం వినియోగాన్ని వ్యాప్తిచేయడం, కుట్టిన దుస్తులు ధరించడం, లోహాలు తాపడం (పొదగడం) చేయడం, లోతైన బావుల నుండి నీటిని తోడి వ్యవసాయం చేసేందుకు పర్షియన్ చక్రాలను వుపయోగించడం, ప్రత్తి వస్త్రాల నేతకు నూతన రకాలైన మగ్గాలను తీసుకురావడం వంటి అనేక పరిణామాలు సంభవించాయి.

### వైమానిక శాస్త్రం, రాకెట్ తయారీ రంగాల్లో భారత ప్రతిభ:

హైదర్ ఆలి, టిప్పు సుల్తాన్‌లు రాకెట్ తయారీ రంగాన్ని అభివృద్ధి చేయడంలో పథ నిర్దేశకులుగా నిలిచారు. మైసూరు రాజులకు, ఆంగ్లేయులకు మధ్య జరిగిన యుద్ధాల్లో బ్రిటీషు వారికి వ్యతిరేకంగా సమర్థవంతంగా రాకెట్లను ప్రయోగించడం జరిగింది. భారతదేశంలో వైమానిక రంగంలో కృషి చేసిన ఆద్యు ల్లో ఒకరైన రొద్దం నరసింహ, 1985లో తాను ప్రచురించిన పత్రంలో రాకెట్ తయారీ రంగానికి టిప్పుసుల్తాన్, హైదర్ ఆలీలు చేసిన సేవలను గురించి చర్చించాడు. ప్రస్తుత ప్రభుత్వం లో సాంస్కృతిక శాఖా మంత్రి మహేష్ శర్మ చేత 'ముస్లిం అయినప్పటికీ జాతీయవాది'గా పేర్కొనబడిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ తన ఆత్మకథలో 'రాకెట్ తయారీ రంగానికి' టిప్పు సుల్తాన్, హైదర్ ఆలీలు చేసిన సేవలకు వున్నతమైన ప్రశంసలందించారు.

11వ శతాబ్దంలో చైనాలో తుపాకి మందు, రాకెట్ తయారీకి సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని కనుగొన్న విషయంతో పాటు, భారతదేశంతో సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు వారు ఏ విధంగా పయనించిందీ రొద్దం నరశింహ ఆ పత్రంలో చర్చించారు. 13వ శతాబ్ధంలో 'ఫిరంగి' కనుగొనబడిన తర్వాత సాపేక్షంగా రాకెట్ల వినియోగం తగ్గిపోయింది. రాకెట్ తయారీ రంగానికి టిప్పు సుల్తాన్, హైదర్ ఆలీలు పెద్దఎత్తున అందించిన

సహకారాన్ని రొద్దం విశ్లేషించారు. అప్పటి వరకు రాకెట్లను వినియోగిస్తున్న వెదురు, కాగితం తొడుగులకు బదులుగా వీరు లోహపు తొడుగులు ఉపయోగించిన విషయాన్ని ఆయన గమనించాడు. లోహపు తొడుగుల ఏర్పాటు వల్ల రాకెట్లు పయనించే పరిధిని 2 కి.మీ. వరకు పెంచగలిగారు. ఈ రాకెట్లు తమతో ఎక్కువ బరువును తీసుకెళ్ళగల్గిన సామర్థ్యం కల్గి వున్నాయి. దీపావళి రాకెట్ల పథగమనాన్ని క్రమబద్ధం చేసేందుకు పొడవైన కర్ర ముక్కలను కట్టిన విధంగానే రాకెట్లకు పదునైన కత్తులను కట్టేవారు. శత్రు సైనికుల మధ్య పడినప్పుడవి ఆయుధాలవలె వుపయోగపడ్డాయి.

టిప్పు సుల్తాన్ భారీస్థాయిలో రాకెట్లను తయారు చేయించాడు. బ్రిటిషు వారికి వ్యతిరేకంగా సాగించిన యుద్ధాల్లో రాకెట్ దాడులను పెద్ద ఎత్తున వుపయోగించాడు. 1780లో పొల్లిలూర్ (ఆంగ్లేయులు, మైసూర్ రాజ్యానికి మధ్య జరిగిన రెండవ యుద్ధం) వద్ద జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారి పరాజయంలో టిప్పు సాగించిన రాకెట్ దాడులు ప్రధాన పాత్ర వహించాయి. 4వ ఆంగ్లో మైసూర్ యుద్ధంలో టిప్పు పరాజయం పాలైన తర్వాత, ఉపయోగించకుండా పెద్ద సంఖ్యలో మిగిలిపోయిన రాకెట్లను బ్రిటిషు వారు ఇంగ్లండ్‌కు ఎత్తుకు పోయారు. ఇంగ్లండ్‌లో విలియం కాంగ్రేవ్ వీటిని శాస్త్రీయంగా అధ్యయనం చేశాడు. రివర్స్ ఇంజనీరింగ్ (అప్పటికే తయారు చేయబడిన వస్తువుల భాగాలను విడదీసి, వాటిని అధ్యయనం చేసి, వాటిని అభివృద్ధి చేయడం)గా నేడు చెప్పుకుంటున్న ప్రక్రియలో కాంగ్రీవ్స్ పరిశోధనలు సాగించి, అభివృద్ధి చేసిన రాకెట్లనే బ్రిటిషు వారు నెపోలియన్ నాయకత్వంలో ఫ్రెంచి వారితో చేసిన యుద్ధాల్లోనూ, ఆ తర్వాత అమెరికన్లతోనూ ఆ జరిగిన యుద్ధాల్లోనూ ఉపయోగించారు.

వైమానిక శాస్త్రం, రాకెట్ తయారీ పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడంలో భాగస్వామ్యం గురించి హిందూత్వ లాబీ మోసపూరితమైన వాదనలు చేస్తోంది. గత ఏడాది జరిగిన 102వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ముంబై విశ్వ విద్యాలయానికి చెందిన సంస్కృత విభాగం 'సంస్కృతం ద్వారా ప్రాచీన విజ్ఞాన శాస్త్రాలు' అనే శీర్షికతో ఒక సమావేశం నిర్వహించింది. ప్రాచీన భారత వైమానిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మీద ఇద్దరు ఉపన్యాసకులు ఒక పత్రం సమర్పించారు. రిటైరైన పైలట్ కెప్టెన్ ఆనంద్ జె బో డాస్ వారిలో ఒకరు. 'ఆధునిక శాస్త్ర విజ్ఞానం అశాస్త్రీయమైనది'. వేద కాలంలోనూ, ప్రాచీన భారత కాలంలో విమానం 'గాలిలో ఎగురుతూ, ఒక దేశం నుండి మరో దేశానికి, ఒక ఖండం నుండి మరొక ఖండానికి, ఒక గ్రహం నుండి మరొక గ్రహానికి ప్రయాణించగల్గిందని, అది ఎడమ వైపుకు, కుడి వైపుకు, వెనుకకు కూడా కదలగల్గిందని' ఆయన పత్రికలతో మాట్లాడుతూ, రత్నాల్లాంటి పలుకులు పలికాడు.

సుబ్బరాయశాస్త్రి రచించిన సంస్కృత గ్రంథంలోని 'వైమానిక శాస్త్రం' ఆధారం చేసుకుని బోడాస్ వాదించాడు. శాస్త్రి 1866 నుండి 1940 వరకు జీవించి వుండగా భరద్వాజుడు కనీసం 2000 సంవత్సరాలకు ముందు కాలంలో జీవించి వున్నాడు. శాస్త్రి గారు తాను మానసికంగా సమాధి స్థితిలో వుండగా, భరద్వాజ మహర్షి ఆయన వద్దకు వచ్చి వైమానిక శాస్త్రాన్ని ఆయన చెపితే తాను వ్రాసినట్లు చెప్పుకున్న విషయం ఒక్కటే ఆ గ్రంథానికి పురాతనమైన సాక్ష్యం.

బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లోని వైమానిక, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన ఐదుగురు ప్రొఫెసర్ల బృందం ఈ 'వైమానిక శాస్త్ర' గ్రంథాన్ని విస్తృతంగా అధ్యయనం చేసింది. వారు కొన్ని ఖచ్చితమైన నిర్ధారణలు చేశారు. 'వైమానిక శాస్త్రం' ప్రాచీన గ్రంథం కాదని, అది 20వ శతాబ్దం ప్రారంభంలో ఆధునిక సంస్కృత భాషలోనే గాని, వైదిక సంస్కృత భాషలో రచించబడలేదని నిర్ధారించారు. 'వైమానిక శాస్త్రం'లో పేర్కొన్న విషయాలు విజ్ఞాన శాస్త్ర వ్యతిరేకమైన అంశాలని, ఆ గ్రంథంలో వివరించబడినట్లు ప్రచారం జరుగుతున్న విధంగా, విమానాలను ఆ విధంగా నడిపి వుండడం సాధ్యం కాదని వారు నిర్ధారించారు.

## భారతీయ వైద్యం

అధర్వణ వేదంలో పేర్కొన్నట్లు, కర్మకాండలు, వ్యావహారిక వైద్యంతో భారతీయ వైద్యం నిర్ణయాత్మకంగా తెగతెంపులు చేసుకుని, చరక సంహిత, శుశ్రుత సంహితల్లో పేర్కొన్న విధంగా పరిశోధనల ఆధారంగా నిర్ధారించిన పద్ధతుల్లో నిర్ణయం చేసే వైద్య విధానానికి మరలింది. గతంలో అందుబాటులో వున్న వైద్య విధానానికి పూర్తిగా భిన్నమైన విధంగా ఒక స్పష్టమైన భౌతికవాద దృక్పథంతో కూడిన శాస్త్రీయ ప్రాతిపదిక మీద ఆధారపడిన ఈ వైద్య గ్రంథాలను గురించి దేవీప్రసాద్ చటోపాధ్యాయ (పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత, ఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలసాఫికల్ రీసెర్చ్ వ్యవస్థాపక అధ్యక్షులు, సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సివిలిజేషన్స్ మాజీ ఛైర్మన్, హిస్టరీ ఆఫ్ ఇండియన్ సైన్స్, ఫిలాసఫీ అండ్ కల్చర్ ప్రోజెక్ట్ జనరల్ ఎడిటర్‌గా పనిచేశారు) వివరించారు. బౌద్ధారామాల్లో బౌద్ధ వైద్య విధానం ప్రభావం, తర్వాత చరకుని వైద్య విధానంగా అభివృద్ధి చెందిన విధానంతో వున్న సంబంధాన్ని ఇటీవలి పరిశోధనలు వెల్లడించాయి.

## విజ్ఞాన శాస్త్రం అధ్యయనంతో కూడని పద్ధతులు :

కేవలం ప్రాచీన గ్రంథాలను అధ్యయనం చేయడం ద్వారానే విజ్ఞానాన్ని సృష్టించవచ్చు. నేడు హిందూత్వవాదులు చేస్తున్న వాదనలను మధ్యయుగాల్లో **(మిగతా 20వ పేజీలో)**

# సైన్స్ పేరుతో మనువాదుల అభూత కల్పనలు



- దేవరాజు మహారాజు



పురాణాలలో ఉంది అంటే జనం లోగడ ప్రతిదీ నమ్మేవారు. ఈ ఆధునిక కాలంలో ట్రెండ్ మారింది. సైన్స్ అని చెపితేనే నమ్ముతున్నారు. అందువల్ల ప్రతి విషయంలో లేని సైన్స్‌ను మనువాదులు బయటికి తీస్తున్నారు. దాన్ని చూపుతూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. అసలైతే సైన్స్ అని చెప్పినప్పుడు రుజువులు, నిరూపణలూ కావాలి! పిట్టకథలు చెప్పినట్లు చెపితే కుదరదు.

**1. మనువాదులు ప్రచారం చేస్తున్న కొన్ని సూడోసైన్స్ విషయాలు చూద్దాం.. దేవాలయాల్లో భక్తులు గంట కొట్టిన తరువాత ఆ గంట కింద మూడు నిముషాలు నిలబడితే శరీరంలోకి పాజిటివ్ ఎనర్జీ వస్తుందని, మనసు ప్రశాంతంగా ఉంటుందని, అందులో ఎంతో సైన్స్ ఉందని బ్రాహ్మణిజం ప్రచారం చేస్తోంది.**

గంటలు మామూలు ఇత్తడితో కాకుండా, ఇతర లోహాలు కూడా కలిపి, ఒక లోహ మిశ్రమంతో వాటిని తయారుచేస్తారు. ఈ గంటలు తయారుచేసే వారిని 'ఘంటాసాజ్' అని పిలుస్తారు. గంట కొట్టిన తర్వాత అది రెండు నిముషాల యాభై అయిదు సెకన్లపాటు ప్రకంపనల్ని విడుదల చేయాలంటే – అలా చేసే విధంగా ఈ గంటల కార్మికులు లోహాల నిష్పత్తిని ఏర్పాటు చేసుకుంటారని, అందుకు కొంత సాంకేతిక పరిజ్ఞానం అవసరమనీ చెబుతారు. ఇవన్నీ నిజమే కానీ.. ఆ ప్రకంపనలు ఆగిపోయే వరకు ఆ గంట కిందే నిలబడితే వెలువడే ఎనర్జీకి కొలమానం లేదు. వెలువడుతుందన్న దానికి రుజువు లేదు. ఆ పాజిటివ్ ఎనర్జీ శరీరానికి ఏ విధంగా ఉపయోగపడుతుందీ అన్న దానికీ నిరూపణ లేదు. గుడులకు భక్తులు తగ్గిపోతున్నారనీ, ఆ వచ్చిన కొందరు గుళ్ళలోంచి త్వరత్వరగా వెళ్ళిపోతున్నారని బ్రాహ్మణవాదులకు భయం పట్టుకున్నట్టుగా ఉంది. అంతే! అలాంటి ప్రకంపనాల ప్రభావం శరీరం మీద ఎలా ఉంది? మానసికంగా కానీ, ఆరోగ్యపరంగా కానీ ఎలాంటి మేలు జరుగుతుంది–అనేది ప్రాయోగికంగా చూపాలి. చూపలేకపోతే అది ఉట్టి గ్యాసే.

**2. అలాంటిదే ఆరా గురించి ఓ కథ అల్లి ప్రచారం చేస్తున్నారు. 'ఆరా' అంటే మనిషి తల చుట్టూ ఉంటుందని భావించే కాంతి పుంజం – తేజస్సు. చిత్రాలలో హిందూ దేవతల తలల చుట్టూ గుండ్రంగా కాంతి పుంజం – వెలుగు ఉన్నట్టు చిత్రకారులు చిత్రిస్తారు. అదే ఆరా.**

అలాంటి ఆరా మనుషులకు కూడా ఉంటుందని మైసూరు దత్తపీఠం దత్త విజయానంద తీర్థ స్వామీజీ ఒక వీడియోలో సందేశం ఇచ్చారు. విదేశీయులతో కలిసి ఓ ఇరవై మందిని తీసుకుని ఆయన గోశాల దగ్గరికి వెళ్ళారట. వీరితోపాటు ఒక డాక్టర్‌ను, ఒక సైంటిస్టును తీసుకువెళ్ళారట. వీళ్ళు ఆరాను కొలిచే పరికరాలు తీసుకుని వెళ్ళారట. విషయమేమంటే మొదట పరీక్షించినప్పుడు ఆరా లేని వాళ్ళకు, గోప్రదక్షిణ చేసి రాగానే ఆరా పెరిగిందట. దేశీయ గోవుల ప్రదక్షిణ హిందూ ధర్మానికి అవసరమని ఆయన చెప్పారు. గోపూజ, గో సన్నిధి, గో ప్రదక్షిణ, గో సంరక్షణను ప్రమోట్ చేయడం కోసం ఆ స్వాములు అల్లిన కట్టుకథ అని తెలుస్తూనే ఉంది.

ఆధ్యాత్మికత, అనుష్టానం వంటి బ్రాహ్మణిజానికి సంబంధించిన గాలి కబుర్లు చెప్పి జనాన్ని మోసం చేయడం తప్ప, వీరు,

వీరి ఆరా, గో[ప్రదిక్షణ వాస్తవంగా దేనికి ఉపయోగమో రుజువు చేయాలి. ఇందులో డాక్టరు, సైంటిస్టుల ప్రసక్తి తెచ్చారు. ఎందుకంటే సైన్సు - సాంకేతిక పరికరాలూ అంటేనే జనం నమ్ముతారు గనక! ఊరికే చెప్పడం వల్ల లాభం లేదు. ఆ వీడియోలోనే ఆరాను ఎలా కొలిచారో కూడా చూపించాల్సింది. ఆ ఆరా ఎవరికి ఏ విధంగా ఉపయోగపడిందో కూడా ప్రత్యక్షంగా జనానికి చూపించాల్సింది కదా ? ఇలా సైన్సు పేరును తమ అంధ విశ్వాసాల వ్యాప్తికి వాడుకోవడం దుర్మార్గమైన పని. వివేకమున్న అధికారులు, ప్రభుత్వాధినేతలు ఉంటే.. ఇలాంటి వారిని సత్వరమే అరెస్ట్ చేసి జైల్లో పెట్టేవారు. కానీ, ఈ దేశంలో అలాంటి పని జరగదు. ఎందుకంటే ప్రభుత్వాలే గుడ్డి నమ్మకాల్లో కళ్ళు మూసుకుని ఉన్నాయి కాబట్టి! గుళ్ళు గోపురాల కట్టడాలకు ప్రజాధనం వృథా చేస్తుంటాయి కాబట్టి! కనిపించే ప్రజల అవసరాలకంటే, వీరికి కనపడని దేవుడికి కట్టడాలు కట్టడం కావాలి కాబట్టి! శతాబ్దాలుగా యజ్ఞ యాగాల పేరుతో గోవుల్ని బలి ఇచ్చిన విషయం చెప్పుకోరెందుకూ ? తమ పూర్వీకులు చేసిన తప్పి దాల గూర్చి విచారించరెందుకూ ? మనోభావాలు దెబ్బ తిన్నాయని గగ్గోలు పెట్టే మూర్ఖులంతా తమ మనోభావాలు తక్షణం మార్చుకోవాలి. ఎందుకంటే వాస్తవాలు, నిజాలు ఎప్పుడూ అలాగే ఉంటాయి.

**3. ఒక పరిశోధన సంస్థ బయట కొందరు బ్రాహ్మణార్యులు తచ్చాడుతూ కనిపించారు. గేటు దగ్గర సెక్యూరిటీ వాళ్ళకు మాయమాటలు చెప్పి - లోపలికి వెళ్ళి వరండాలో కూర్చు న్నారు. వాళ్ళను గమనించిన ఓ పరిశోధకుడు 'పాపం! ఏమిటో వీరి బాధ' అనుకుని మాట్లాడించాడు. 'ఏమిటండీ! మీరు ఎవరిని కలవాలి?' అని అడిగాడు. 'అబ్బే ఏం లేదండి. లోపల మనవాళ్ళు పరిశోధనలు చేస్తున్నారు కదండీ! వారేదైనా విషయం కనిపెట్టి ప్రకటించగానే-మేం వెళ్ళి మన పురాణాల్ని తిరగేస్తామండీ అంతే!" అన్నాడు.**

'అంతేనా? అంతకన్నా మీరు ఎక్కువే చేస్తారు! ఎన్నిసార్లు చూడలేదూ? ఇప్పుడిక్కడ మేం కనిపెట్టింది చెపితే - అది తీసుకుని మీరు బయటికి వెళతారు. ఫలానా అంశం మా పూర్వీకులు మా పురాణాలలో ఎప్పుడో రాసిపెట్టారు అని టముకు వేస్తారు.' ఔన్నత్యం పూర్వకాలం నుండి ఎలా ఉందో - అది చెపుతామన్నమాట!" 'చెపుతారు. బాగానే ఉంది గానీ, మేం వైజ్ఞానికంగా కనుగొని చెప్పిన దానికీ, మీరు ఉత్తుత్తిగా పుట్టించి చెప్పిన దానికి పొంతన ఉండదు. మీరు చెప్పేదానికి సరైన వివరణలు, రుజువులూ ఉండవు. ఇంకా ఎందుకు వృథా ప్రయాస ? 'వృథా ప్రయాస ఎలా అవుతుందండీ? మమ్మల్ని నమ్మేవాళ్ళు కూడా దేశవ్యాప్తంగా ఉన్నారు. మీరు చెప్పేది అర్థం చేసుకోవాలంటే ఆ విషయంలో కొంత పరిజ్ఞానం ఉండాలి. మేం చెప్పేది నమ్మాలంటే ఏదీ అవసరం లేదు. చెప్పింది చెప్పినట్టు గుడ్డిగా నమ్మితే చాలు. అయినా బాగోగులు ఆలోచించి చెప్పడానికి మేం ఉన్నాం గదండీ? సామాన్యులు ఎందుకండీ ఆలోచించడం?'

'చాలు.. చాలు.. దేశానికి మీరు చేసిన నష్టం చాలా ఉంది. మీరేం చెప్పినా ఏ పురాణం ప్రసక్తి తెచ్చినా జనం ఎవరూ నమ్మరు. రుజువులు, సాక్ష్యాలు చూపితేనే నమ్ముతారు. మా పరిశోధనకు అన్ని ఆధారాలు, రుజువులూ ఉన్నాయి కాబట్టి, ప్రజలు నమ్ముతున్నారు. వారికి మా మీద విశ్వాసం ఉంది. మూఢ విశ్వాసాలు వ్యాప్తి చేసేదేమీ లేదు. మేం ఏం కనిపెడ తామో కనుక్కుని, దాన్ని మీ ఖాతాలో అక్రమంగా వేసుకోవాలని 'గోతికాడి నక్కల్లాగ' మీరు ఎదురు చూస్తున్నారు. వెళ్ళండి బయటికి - పొరపాటున కూడా మిమ్మల్ని లోపలకి రానివ్వొద్దని మా సెక్యూరిటీ డిపార్టుమెంటు వారికి గట్టిగా చెపుతాను.

అయ్యా! అంత పని చేయకండయ్యా ...

'స్వంత బుర్రలేదు. స్వంత ఆలోచన లేదు. అన్నీ ఇతరుల నుండి కాపీ కొట్టి గొప్పలు చెప్పుకోవడమే కదా మీరు చేసే పనీ? జనం ఆలోచిస్తున్నారు. ఇప్పుడు మీ సొళ్ళు కబుర్లు, పిచ్చి వాగుడూ ఎవరు వింటారూ ? వినిపిస్తోందా ? పదండి ! మళ్ళీ రాకండి ! చెపుతున్నది మీకే - మీ అబద్ధాల ఫ్యాక్టరీ ఇక బంద్!'

4. సైన్స్ చుట్టూ, సైన్స్ పరిశోధన సంస్థల చుట్టూ తిరిగిన ఒక విష ప్రచారం ఇలా ఉంది. శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన చంద్రయాన్-3 2023 జులై 14వ తేదీన సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుండి దిగ్విజయంగా ప్రయోగించబడింది. అది 23 ఆగస్టు 2023న అంటే 40 రోజుల తర్వాత చంద్రుడి మీదికి చేరుతుందని అంచనా. ఇది వాస్తవం! కానీ, దీని ఆధారంగా వారం రోజులకే అంటే 20 జులై నాటికే చంద్రయాన్‌పై మనువాద బ్రాహ్మణిజ కాషాయ మూకలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు. అదేమిటంటే... అంతరిక్ష నౌక చంద్రుడి మీదికి చేరినట్టూ, అక్కడి నుండి అది కొన్ని ఫొటోలు పంపినట్టు (మార్ఫింగ్ చేసిన) ఆ ఫొటోలో కొద్ది దూరంలో ఒక హిందూ దేవాలయం కనిపించినట్టూ పోస్ట్‌లు సృష్టించారు. 'చంద్రుడిపై హిందువుల గుడి-చంద్రయాన్-3 నుండి విడుదలైన ఫొటో' అని దానికి హెడ్డింగ్ కూడా! ఆ పోస్ట్ కింద జైశ్రీరామ్ అనీ, ఇది హిందువుల పవర్ అని కొందరు కామెంట్లు కూడా రాశారు.

హిందువులే కాదు, దేశమే తలదించుకునేంత ఫేక్ ఫొటోల ప్రదర్శన అవసరమా? వీళ్ళు ఈ సమాజాన్ని ఎటు తీసుకుపోతు న్నారోనని భయంగా ఉంది. ముఖ్యంగా యువతీ యువకులు ఇలాంటి అసత్యాల్ని గుర్తుపట్టి జాగ్రత్తగా ఉండటంతోపాటు, ఎండగడుతూ ఉండటం అవసరం! ❑

**(ప్రజాశక్తి సౌజన్యంతో)**



# వివిధ సంస్థలను స్వాధీనం చేసుకుంటున్న ఆర్.ఎస్.ఎస్


- ప్రొఫెసర్ పి.గోపీనాథ్

బీజేపీ కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టిన తరువాత సాంస్కృతిక బహుళత్వం, సమానత్వం, విజ్ఞాన శాస్త్ర పరిశోధనలకు సంబంధించిన ఆలోచనలను, ఆచరణను పెంపొందించేందుకు స్థాపించబడిన వివిధ సంస్థలను, ఒక పద్ధతి ప్రకారం, లక్ష్యం చేసుకుని నిర్వీర్యం చేసేందుకు పూనుకుంది. జాతి రాజ్యం ప్రకటించుకున్న లక్ష్యాలను సాధించడంలో ఈ జాతీయ సంస్థలు ప్రధానపాత్ర నిర్వహిస్తాయి. ప్రస్తుత బి.జె.పి ప్రభుత్వం ఈ సంస్థలను ఆర్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో సంఘ్ పరివార్ దురభిమాన పూరిత లక్ష్యాల సాధనకు, తోడ్పాటు చేసుకోవాలని చూస్తున్నది.

ముస్లింలు, ఇతర మైనార్టీలను దిగువస్థాయి పౌరులగా దిగజార్చి హిందూ ఇండియాని నిర్మించాలని, హిందూ జాతీయవాదంతోపాటు, హిందూ మహాసభ, ఆర్.ఎస్.ఎస్ వంటి దాని రాజకీయ సంస్థలు నిరంతరం వాదిస్తూనే వున్నాయి. ఈ విషయాన్ని సావర్కర్, హెగ్డేవార్, గోల్వాల్కర్లు తమ రచనల్లో పదే పదే పేర్కొంటూనే వున్నారు. హిందూ మతపరమైన గుర్తింపు ఆధిపత్యం ప్రాతిపదికన, ఒక భిన్నమైన భారతదేశానికి సంబంధించిన ఆలోచనలను వీరు ముందుకు తెచ్చారు. స్థూలంగా భారతదేశ బహుళత్వానికి ప్రాతినిధ్యం వహించే రాజకీయ శక్తులు ఎదురుదెబ్బలు తిన్న ప్రతి సందర్భంలోనూ, హిందూ ఇండియా డిమాండు మరింత బలం పుంజుకుంటూనే వుంది. 1998లో మొట్ట మొదటిసారి కొన్ని ప్రాంతీయ పార్టీల మద్దతుతో ఆర్.ఎస్.ఎస్కు సంబంధించిన బి.జె.పి. నాయకత్వంలోని జాతీయ ప్రజాతంత్ర కూటమి కేంద్రంలో అధికారం చేపట్టినప్పుడు, తన హిందూత్వ లక్ష్యాలను మరింత ముందుకు తీసుకుపోయే ధ్యేయంతో, ఉన్నత పరిశోధనలు, పాఠశాల విద్యకు సంబంధించిన సంస్థల లక్ష్యాలను వక్రీకరించడం మీద తన శక్తినంతటిని కేంద్రీకరించింది. ఈ ప్రణాళికలో భాగంగానే భారత చరిత్ర పరిశోధన మండలి (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారిక్ రీసెర్చి – ICHR యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (NCERT)తో సహా అనేక సంస్థలకు గణనీయమైన నష్టం కలుగజేసింది.

NDA-1 ప్రభుత్వం అన్ని జాతీయ సంస్థలను RSS, BJP వారితోనూ, హిందూత్వ లక్ష్యాలతో సంబంధం లేకపోయినప్పటికీ ప్రభుత్వంతో సహకరించి తోడ్పడే వారితో నింపివేసింది. లోక్సభలో బి.జె.పి మెజారిటీతో ఏర్పడిన ప్రస్తుత NDA-2 ప్రభుత్వం హిందూత్వశక్తులు తమ ఎత్తుగడలను మార్చివేశాయి. ఇప్పుడు తమతో పయనించే ఇతర పార్టీలను వదలివేసి, దానికి బదులుగా విద్యా సంబంధమైన లేదా వృత్తిపరమైన నైపుణ్యంతో నిమిత్తం లేకుండా, సంఘ్ పరివార్కు చెందిన వివిధ సంస్థల్లో చురుకైన వారిని, ఆర్.ఎస్.ఎస్ దృక్పథం, లక్ష్యాలతో ఏకీభవించే వారిని ప్రధానమైన సంస్థల్లో నియమించడం జరిగింది) ICHRకు యల్లాప్రగడ సుదర్శనరావు, ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (FTII)కు గజేంద్ర చౌహాన్‌ల నియామకాలు ఇందుకు ప్రబల నిదర్శనాలు. నిజానికి, కేవలం ఆర్.ఎస్.ఎస్ సభ్యులు, మోడీకి బహిరంగంగా మద్దతు ప్రకటించిన వారిని మాత్రమే ఈ సంస్థల్లో నియమించడం జరుగుతోంది.

విచ్ఛిన్నానికి గురైన మొదటి చారిత్రాత్మక సంస్థ ప్రణాళికా సంఘం స్వేచ్ఛా మార్కెట్ ప్రలోభాలకు లొంగిపోయి ప్రణాళికా బద్ధమైన ఆర్థికాభివృద్ధిని నిర్వీర్యం చేసే ఆ క్రమానికి ప్రణాళిక సంఘం మృతిని లాంఛనం చేసేందుకు భూమికను ఏర్పాటు చేసింది.



NDA-1 లక్ష్యాలను సాధించే కృషి కొనసాగించే క్రమంలో నూతన ప్రభుత్వం చరిత్ర, సంస్కృతి, విద్యకు సంబంధించిన సంస్థలను తిరిగి తన లక్ష్యంగా పెట్టుకుంది.

సంస్థాగత విచ్ఛిన్నం ICHRలో ప్రారంభమైంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ICSSR), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్డ్ స్టడీస్ (IIAS), ది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలసాఫికల్ రీసెర్చ్ (ICPR), నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఇనిస్టిట్యూట్స్ (NCRI)లు స్వయం ప్రతిపత్తి గల్గిన ఇండిపెండెంట్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ (ICR)లో భాగం. ఈ సంస్థలకు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నుండి నిధులందుతున్నాయి. ఈ ఐదు సంస్థల్లో ICHR, కొద్దిగా తక్కువ మేరకు ICSSR సంఘ్ పరివార్ జోక్యానికి గురయ్యాయి.

తన స్వంత పాత్రను, భారతదేశాన్ని ఒక హిందూ రాజ్యంగా మార్చాలన్న తన ఎజెండాకు చట్టబద్ధత కల్పించేందుకు ఆర్.ఎస్.ఎస్‌కు చరిత్ర కీలకమైనది. చరిత్రకు సంబంధించి వారు చేసిన వాదనలు చారిత్రక పరిశోధనకు, తనిఖీకి నిలవకపోవడంతో అవి పదే పదే విఫలమయ్యాయి. NDA-1 హయాంలో ప్రముఖ చరిత్రకారులు ప్రొఫెసర్ కె.ఆర్ ఫణిక్కర్, ప్రొఫెసర్ సుమీత్ సర్కార్లు సంపాదకులుగా, ముద్రణలో వున్న Towards freedom(స్వాతంత్ర్యం దిశలో) గ్రంథ సంపుటాలను, భారత చరిత్రలో 'వక్రీకరణల"ను 'సరిదిద్దడం' పేరిట వెనక్కు తెప్పించి, ఆ ప్రాజెక్టును మొత్తంగానే నిలిపివేయడం జరిగింది. వారు సరస్వతీ నదికి సంబంధించిన ఒక ప్రాజెక్టును ప్రారంభించారు. అయితే ఇది ఆ తర్వాత కాలంలో ఈ రంగంలో ప్రవీణులైన వారి ఆమోదం పొందలేకపోయింది. NDA-1 పాలన ముగియడంతో, నూతన కౌన్సిల్ ఈ నిర్ణయాలను రద్దు చేసింది.

NDA-2 ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోగానే కౌన్సిల్ పునర్నిర్మించింది. మరో పర్యాయం ఆ పదవిలో కొనసాగేందుకు అర్హత వున్న ఎనిమిది మందిలో ఒక్కరికి కూడా కౌన్సిల్ స్థానం ఇవ్వలేదు. కౌన్సిల్లోని 18 మంది చరిత్రకారుల్లో ముగ్గురు లేదా నలుగురు తప్ప మిగిలిన వారందరూ, అఖిల భారతీయ ఇతిహాస యోజన, కేరళ కేంద్రంగా పనిచేస్తున్న ఆర్.ఎస్.ఎస్ అనుబంధ భారతీయ విచార కేంద్రాలకు చెందిన వారు ఆర్.ఎస్.ఎస్ లేదా బి.జె.పి కి మద్దతుగా వుండేవారి సలహాదారులే.

తమతోటి చరిత్రకారులు సహితం గుర్తించలేని చరిత్రకారులను ఈ సంస్థ చైర్‌పర్సన్‌లుగాను, సభ్యులుగానూ నియమించడంపై భారత చరిత్రకారులు ప్రభుత్వాన్ని విమర్శించారు. భారతీయ విధానం అనుసరించడంతోపాటు, ప్రాచీన భారత చరిత్ర గురించి నొక్కి వక్కాణించే విధంగా "భారత చరిత్ర రచనలో వక్రీకరణలను" తొలగించటం ప్రప్రథమ కర్తవ్యమని కొత్తగా పునర్నిర్మించబడిన ICHR స్పష్టంగా పునరుద్ఘాటించింది. చరిత్రను శాస్త్రీయంగా రచించే సందర్భంగా అంధ విశ్వాసాలకు తావియ్యరాదని, భారతదేశ బహుళత్వ స్వభావాన్ని, లౌకికతత్వాన్ని ప్రోత్సహించే విధంగా శాస్త్రీయంగా చరిత్ర రచనను ప్రోత్సహించాలని ప్రకటించే ICHR రాజ్యాంగంలో మార్పులు చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు.

ఏ ప్రమాణాలతో చూచినప్పటికీ నిపుణులైన చరిత్రకారులుగా పరిగణించడానికి వీలు లేని విద్యావంతులు, గురువులు (మత గురువులు)ను ఆహ్వానించటం ద్వారా ఈ కర్తవ్యాల సాధన కృషి ప్రారంభించటం జరిగింది. భారత చరిత్రకారులను పనికిమాలిన వారిగా నిందించిన బెల్జియం ప్రొఫెసర్ ఒకరు కాగా, మనం తిరిగి వేదాల వైపుకు మరలాలని, "భారత చరిత్ర నుండి ఎరుపును (వామపక్షా భావాలు కల్గిన వారిని) తొలగించాలని", గట్టిగా అభిప్రాయపడిన అమెరికన్ యోగా గురువు మరొకరు. విద్యా విషయకమైన విషయాల మీద ఎవరైనా తమ అసమ్మతి వ్యక్తం చేస్తే, దిగుమతి చేసుకున్న ఆర్.ఎస్.ఎస్. గుండాల అవహేళనను ఎదుర్కొనవల్సి వచ్చింది.

అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధిగాంచిన ICHR (సమాచార పత్రిక ది ఇండియన్ హిస్టారికల్ రివ్యూ సంపాదకుడు ప్రఖ్యాత చరిత్రకారుడు సవ్యసాచి భట్టాచార్యను ఎడిటర్ బాధ్యతల నుండి తొలగించడం రెండవ చర్య. ప్రపంచంలో అత్యుత్తమ చరిత్రకారులు కొందరు సభ్యులుగా వున్న పత్రిక సలహా సంఘాన్ని మొత్తంగా రద్దు చేయడం జరిగింది. ఇది మూడవ చర్య. అయితే ఈ సలహా సంఘాన్ని ఏ విధంగా పరిశీలించినా వారిలో అందరూ మార్క్సిస్టులు కారు. పత్రిక సలహా సంఘాన్ని రద్దు చేయడం పట్ల తన అసమ్మతిని వ్యక్తం చేసేందుకు అనుమతించకపోవడంతో ICHR మెంబర్ సెక్రటరీ జూన్ నెలలో రాజీనామా చేశారు.

ప్రస్తుత పరిశోధనలను రద్దుచేసి, భారతదేశానికి సంబంధించిన గతాన్ని గురించి "వక్రీకరణకు గురికాని" చరిత్రను అందిస్తామని ICHR కౌన్సిల్ చైర్మన్, రావ్ ఇతర సభ్యులు వాగ్దానం చేశారు. భారతదేశం యొక్క గతాన్ని గురించిన ఈ "ఖచ్చితమైన" దృక్పథంలో చారిత్రక రికార్డులు, వివరణలకు వేదాలు ప్రాతిపదికగా వుండాలి. అందువలన ప్రాచీన భారతానికి సంబంధించిన అధ్యయనానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. కులం, మతం వంటి అంశాలు అనేక సంవత్సరాలుగా చర్చనీయాంశాలుగా వుండడంతో పాటు, ప్రసిద్ధిపొందిన విద్యా విషయిక రచనలు అసంఖ్యాకంగా ప్రచురితమయ్యాయి. ఇప్పుడు ఆర్.ఎస్.ఎస్ అవగాహనను

గమనంలో వుంచుకుని, ఈ అంశాలను స్పాన్సర్ చేయడం జరుగుతుంది.

ప్రాచీన భారత చరిత్ర రాసేందుకు సంస్కృత గ్రంథాలను ఆధారంగా చేసుకుని ఒక పరిశోధన ప్రాజెక్టును మంజూరు చేయడం తదుపరి కర్తవ్యం. మొదట ఈ ప్రాజెక్టును అనధికారికంగా, సుబ్రహ్మణ్యస్వామి సమక్షంలో ఢిల్లీ విశ్వ విద్యాలయంలోని సంస్కృత విభాగానికి మంజూరు చేయడం జరిగింది. ఈ సమావేశంలోనే ఆయన రొమిల్లా థాపర్, బిపిన్ చంద్రల గ్రంథాలను తగులబెట్టాలని డిమాండు చేశాడు. సంస్కృతంలో వున్న మూల రచనలను ఉపయోగించుకున్నారు. భారత చరిత్రను ప్రాచీన భారతం అనే ప్రిజమ్ (త్రిభుజాకార పట్టకం గుండా చూడాలని వాదిస్తున్న ICHR కౌన్సిల్ సభ్యులకు సంస్కృతం భాష రాకపోవడం గమనించవల్సిన విషయం.

ప్రస్తుతం ICHRకి మెంబర్ సెక్రటరీ లేదు. మెంబర్ సెక్రటరీ నిర్వర్తించవల్సిన విధులు చైర్మన్ తానే నిర్వహిస్తున్నాడు. కౌన్సిల్‌కు సంబంధించిన చట్టబద్ధమైన కమిటీల సమావేశాల మినిట్సు కౌన్సిల్ వెబ్‌సైట్‌లో ఇక ఏమాత్రం కానరావు. అంటే భారత చరిత్ర రచనలోని వక్రీకరణను రహస్యంగా సరిదిద్దు తారన్నమాట!

1969లో స్థాపించబడిన ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చి (ICSSR) సంస్థ తన రాజ్యాగంలో మార్పులు చేపట్టడం ద్వారా ప్రభుత్వం ఎత్తులను చిత్తుచేసింది. ఈ సంస్థ రాజ్యాంగానికి సవరణ చేయడం ద్వారా ICHRలో వలె పాలనా పరమైన ఆదేశాల ద్వారా టోకు (పెద్ద ఎత్తుగా మార్పులు చేసేందుకు వీలు లేకుండా చేయడం జరిగింది. సవరించబడిన నిబంధనల ప్రకారం ప్రస్తుతమున్న కౌన్సిల్ సభ్యులు, ప్రస్తుతం ICSSR జాతీయ ప్రొఫెసర్లుగా వున్నవారు, గతంలో జాతీయ ప్రొఫెసర్లుగా పనిచేసినవారు, కొత్త కౌన్సిల్ సభ్యత్వానికి ప్రతిపాదనలు (నామినేట్ చేయవల్సి వుంటుంది. ఇంత పెద్ద సంఖ్యలో వున్న విద్యావంతుల బృందం నుండి BJP తన ఇష్టప్రకారం నామినేషన్లు వేయించడం సాధ్యమయ్యేపనిగాదు. అందువల్ల, ICSSR సంస్థ, రెగ్యులర్ మెంబర్ సెక్రటరీ లేక పోవడమే విషయం మినహాయిస్తే, పెద్దగా మార్పులు లేకుండానే కొనసాగుతోంది. ప్రస్తుత చైర్మన్ BJP చేత నియమించబడిన వాడు కాదు. ICHRలో వున్న పరిస్థితికి భిన్నంగా, వాణిజ్య శాస్త్రం (కామర్సు) నుండి భౌగోళిక శాస్త్రం, అర్థశాస్త్రం వరకు అనేక విభాగాలకు సంబంధించిన పరిశోధనలను సమన్వయం చేసే ICSSRలో BJP, RSS ప్రత్యక్ష అధికారం చెలాయించే అవకాశాలు తక్కువగా వున్నాయి. చరిత్రకు సంబంధించిన పరిశోధనవలె కాక ఇతర విభాగాలకు (విషయాలకు సంబంధించిన పరిశోధనలు, మితవాద హిందూత్వం అభివృద్ధి నిరోధక, రాజకీయాల మీద తక్షణ, ప్రత్యక్ష ప్రభావం చూపవు.

1961లో నెలకొల్పబడిన నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (NCERT), BJP, RSSల దృష్టిని ఆకర్షించిన మరొక సంస్థ. BJP తన మతపరమైన విశ్వాసాలను బలవంతంగా రుద్దేందుకు పాఠశాల విద్యకు సంబంధించి జాతీయ పాఠ్యప్రణాళికను రూపొందించే బాధ్యతలు నిర్వహించడంతోపాటు, ఉపాధ్యాయులకు శిక్షణ కూడ ఇస్తున్న (NCERT), ఒక బలమైన సాధనంగా కన్పడింది. BJP తన గత పాలనాకాలంలో (NCERT), నిర్ణయించిన పాఠ్య పుస్తకాలను మార్చివేసింది. అయితే BJP పాలన ముగిసిన తర్వాత యీ మార్పులను రద్దు చేయడం జరిగింది. తమ ఆదేశాలను అమలు చేయించేందుకు, RSS, BJP చాలా తొందరపడుతున్నాయి. NCERT డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రవీణ్ సింక్లెయిర్ మీద (HRD) మంత్రిత్వ శాఖ ఆర్థికపరమైన అవకతవకలకు సంబంధించిన ఆరోపణలు చేయడం వల్ల తన పదవికి రాజీనామా చేసే పరిస్థితి కల్పించడం జరిగింది. జాతీయ పాఠ్యప్రణాళిక స్వరూపాన్ని గురించి సమీక్షించే లక్ష్యంతో ఏర్పాటు చేయబడిన 21 కమిటీల నివేదికల మీద సమీక్ష మధ్యలో వుండగా ఆమెకు ఉద్వాసన చెప్పడం మిక్కిలి ఆసక్తికరమైన విషయం. ప్రభుత్వంతో సంప్రదించకుండా NCERT తొందరపడి సమీక్ష చేపట్టడాన్ని RSSకు చెందిన దీనానాథ్ బత్రా అంతకుముందే విమర్శించాడు. NCERT డైరెక్టర్ స్థానాన్ని సంవత్సర కాలానికి పైగా ఖాళీగా వుంచి 2015 సెప్టెంబరునెలలో హృషీకేష్ సేనాపతిని కేంద్ర ప్రభుత్వం డైరెక్టర్ గా నియమించింది. ఇదిలా వుండగా, అంబాచరణ్ వశిష్ఠను NCERT పబ్లికేషన్ల విభాగానికి సలహాదారుగా నియమించడం జరిగింది. అయనే పౌరసంబంధాల నిర్వహణకూడ చూస్తాడు. ఆయన గతంలో BJPకి చెందిన కమల్ సందేశ్ పత్రిక సంపాదక వర్గ సభ్యుడు. తీస్తాసెతల్వాద్ మీద దాడి చేయడానికి ఉద్దేశించిన ఒక పుస్తకానికి ఆయన సంపాదకుడు.

ది నేషనల్ బుక్ ట్రస్ట్ (NBT) HRD మంత్రిత్వశాఖ నిధులతో నడిచే మరొక సంస్థ. వివిధ భారతీయ భాషల్లో ఉన్నతస్థాయి సాహిత్యాన్ని సరసమైనధరలను ప్రజల కందుబాటులో ధ్యేయంతో 1957లో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ NBTని స్థాపించారు. సక్రమమైన పద్ధతిలో NBT ఛైర్మన్‌గా నియమితులైన సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత, ప్రముఖ మళయాళ రచయిత సేతు మాధవన్‌ను ఆయన పదవీ కాలం ముగియక ముందే, ఆ పదవిని వదలి వెళ్ళవల్సిందిగా మృదువుగానే హెచ్చరించారు. ఊహించిన విధంగానే ఆయన స్థానంలో RSS పత్రిక పాంచజన్య మాజీ ఎడిటర్ బల్దేవ్ శర్మ NBT ఛైర్మన్‌గా నియమితుడయ్యాడు. దీనితో సంతృప్తి చెందని BJP ప్రభుత్వం, ఇటీవలనే BJP తీర్థం పుచ్చుకున్న అసోం గణ

పరిషత్.. నాయకుని సతీమణి రీతిచౌదురిని డైరెక్టర్‌గా నియమించింది. గతంలో ఈ పదవికి ఇతరులతోపాటు ఇంటర్వ్యూకు హాజరైన ఆమె ఆ పదవికి తగిన వ్యక్తి కాదని తేలిన తర్వాత ఈ నియామకం జరిగింది.

మోడిని భగవంతుని అవతారంగా అభివర్ణించిన 87 సంవత్సరాల లోకేశ్‌చంద్ర, రివేషన్స్ భారత సాంస్కృతిక సంబంధాల – మండలి (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ ICCR) అధిపతిగా నియమితుడయ్యాడు. ఆయన రామాయణ, మహా భారతాలను ఆధారం చేసుకుని, రూపొందించిన కార్యక్రమాల ద్వారా భారతదేశానికి, ఆగ్నేయాసియా దేశాల మధ్య సంబంధాలను అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నాడు. 2015 అక్టోబర్ చివరలో ICCR ఆధ్వర్యంలో "భారత్, రష్యా ఇతర పొరుగు దేశాల్లో భారత ఉపఖండానికి చెందిన చరిత్ర, సంస్కృతులు, భాషలు, సాహిత్యం గురించిన అధ్యయనం – గతం, వర్తమానం, భవిష్యత్తు" అనే అంశం మీద మాస్కోలో సమావేశం జరిపారు. రష్యా తదితర పొరుగు దేశాల్లోని విద్యా రంగంలోని ప్రాచీన భారతీయ విజ్ఞానాన్ని క్రోడీకరించి, దానిని ఉపయోగించుకునే మార్గాలను అన్వేషించడం ఈ సమావేశ లక్ష్యాల్లో ఒకటి. సంస్కృతంలో వున్న గ్రంధాలను ఆధారం చేసుకుని, ప్రాచీన భారత చరిత్రను సవరించి రాయడంలో ICHR సహకారం అందిస్తున్న ఢిల్లీ విశ్వవిద్యాలయం, సంస్కృత విభాగం అధిపతి ఈ సమావేశానికి భారతదేశంతర పునఃసమన్వయకర్తగా వ్యవహరించాడు.

"తమకనుకూలమైన చరిత్రను కనుక్కునే" BJP RSS రాజకీయాల్లో భారత పురావస్తు పరిశోధన శాఖ (ASI) కీలకపాత్ర పోషించింది. పురావస్తు శాఖ పరిశోధనకు సంబంధించి తవ్వకాలు నిర్వహించాల్సిన పద్ధతులకు భిన్నంగా అయోధ్యలో తవ్వకాలు నిర్వహించి, అసలు ఏనాడూ ఉనికిలో లేని దేవాలయాన్ని బాబ్రీ మసీదు క్రింద" కనుక్కొన్నందుకు ASI తీవ్ర విమర్శలకు గురయ్యింది. BJP అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధర్వర్యంలోకి వచ్చే ASI సరస్వతీనదిని కనుక్కొనేందుకు పూనుకుంటుంది. NDA-1 ప్రభుత్వం అధికారం నుండి తొలగించబడిన తర్వాత ఏనాడో కనుమరుగైన సరస్వతీ నది కోసం అన్వేషణ నిలిపివేయబడింది. ప్రస్తుత ప్రభుత్వం సరస్వతీ నది కోసం చేసే అన్వేషణను తిరిగి ప్రారంభించవల్సిందిగా ASIని ఆదేశించడం జరిగింది. నదిని కనుగొనేందుకు BJP RSSలు ఎంత అత్యుత్సాహం ప్రదర్శించాయంటే, వాయవ్య ప్రాంతంలో హాకా, ఘగ్గర్ నదీ పరీవాహక ప్రాంతం (బేసిన్) ASI త్రవ్వకాలు సాగిస్తుండగానే, నీటివనరులు, నదుల అభివృద్ధి, గంగానది పునర్నవీకరణ కేంద్ర మంత్రి కనుమరుగైన సరస్వతీ నదీ మూలాన్ని, నదీ ప్రవాహ మార్గాన్ని గుర్తించేందుకు అలహాబాదు కోటలోని బావిలోని నీటిని పరీక్షించవల్సిందిగా కేంద్ర భూగర్భజల బోర్డును ఆదేశించారు.

నేషనల్ ఆర్చీవ్స్ (ప్రాచీన పత్ర భాండాగారం) ఆఫ్ ఇండియా, నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీలకు సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ నేషనల్ ఆర్చీవ్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించడం జరిగింది. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రాజీనామా చేయవలసి వచ్చింది. లలిత కళా అకాడమీ అధిపతిని కూడా నిర్ధాక్షిణ్యంగా తొలగించారు. దీనికి కేంద్రంలో చైర్‌పర్సన్ లేరు.

కేవలం ఒక పౌరాణిక TV సీరియల్ నటించిన B గ్రేడ్ నటుని ఫిల్మ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ అధిపతిగా చేయడానికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం సాగిన ఆందోళనను ప్రభుత్వం అణచివేసింది. ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖతో జరిపిన చర్చలు విఫలం కావడంతో గజేంద్ర చౌహాన్ నియామకానికి వ్యతిరేకంగా విద్యార్థులు నాలుగు నెలలుగా చేస్తున్న సమ్మెను తాత్కాలికంగా విరమించారు.

భారతదేశాన్ని హిందూమత రాజ్యంగా మార్చే తమ కుట్ర పూరిత లక్ష్యాల సాధనకు, మన భారతదేశానికి విశిష్ట లక్షణమైన బహుళత్వంతో కూడిన జాతీయ సంస్కృతి శాస్త్ర పరిశోధనల ద్వారా మరింత పెంచి, పోషించే ధ్యేయంతో స్థాపించబడిన ఈ సంస్థలను తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రభుత్వం బాహాటంగానే ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నాలు, ఈ సంస్థలు పూర్తిగా నాశనం చేయబడుతున్నాయి. లేదా మూగబోయేట్టు చేయబడుతున్నయి. 'ఎవరో కొద్దిమంది మేధావులు, కళాకారుల అంగీకారం కోసం కాక' కేవలం ప్రజల మనోభావాలను సంతృప్తి పరిచే మేరకు మాత్రమే విజ్ఞాన, శాస్త్రీయ భావాల ప్రచారాన్ని పరిమితం జేయాలన్న హిట్లర్ భావాల పట్ల నమ్మకం కల్గిన ప్రభుత్వం, భారతదేశంలోని సాంస్కృతిక, మేధోపరమైన విద్యాసంస్థలను పరిమితస్థాయిలో శాస్త్ర విజ్ఞానాన్ని అందించే ఏజెన్సీల స్థాయికి దిగజార్చడం జరుగుతోంది.

మొత్తంగా చూచినప్పుడు ఈ సంస్థలన్నింటి కోసం వినియోగించే నిధులు భారీ స్థాయిలోనే వుంటాయి. పాఠశాల, ఉన్నత విద్య, మానవీయ శాస్త్రాలు (హ్యూమానిటీస్), సామాజిక శాస్త్రాలు (సోషల్ సైన్సెస్), విజ్ఞానశాస్త్రంల మీద పరిశోధన ప్రచురణలు, సాంకేతిక కార్యకలాపాలు, వారసత్వ సంపద ప్రముఖ పురాతన కట్టడాల పరిరక్షణ, వాటి నిర్వహణకు నిధుల మంజూరు, గ్రంథాలయాలు, మ్యూజియంలు, ప్రాచీన పత్ర, గ్రంథ భాండాగారాల నిర్వహణ, విస్తరణ, విద్యార్థులకు స్టయిఫండ్స్ (విద్యార్థి వేతనాలు), విశిష్ట పరిశోధనలకు వేతనం (ఫెలోషిప్ నిర్దిష్ట ప్రచురణలకు, ప్రచురణకర్తలకు, సబ్సిడీలు, భారతదేశంలోని ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రంథాలయాలు, విదేశీ

రాయభార కార్యాలయాల్లో పెద్ద సంఖ్యలో పుస్తకాల కొనుగోలు, యువజన కార్యకలాపాలు, క్రీడలు స్త్రీ, శిశు సంక్షేమం తదితర కార్యకలాపాలతోపాటు విస్తృత పరిధిలో కార్యకలాపాల నిధులు మంజూరు చేయడం జరుగుతోంది.

ప్రాధాన్యతలు, విధానాల్లో మార్పులు, ఇంత విస్తృత స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థను స్వాధీనం చేసుకోవడంతో అనేక అంశాల్లో సంఘ్ పరివార్ లక్ష్యాలకు అనుగుణంగానూ, మైనారిటీలకు, ఆవేదనకు గురవుతున్న వారికి, పేదరికంలోకి నెట్టబడిన వారికి రక్షణ కల్పించాలని రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాల నుండి దూరంగా జరిగే విధంగానూ, జ్ఞాన సముపార్జనలో నిర్ణయాత్మకమైన మార్పులకు దారితీస్తుంది. దీనితో వేలాది మంది బి.జె.పిని ఆశ్రయించిన వృత్తి నిపుణులు (ప్రొఫెషనల్స్), విద్యావంతులకు, సాంస్కృతికరంగంలో పనిచేసే వారికి, మేధావులకు ప్రభుత్వంలో అవకాశాలు కల్పిస్తున్నారు.

## వివిధ సంస్థల స్వాధీనం ఆర్ఎస్ఎస్ మార్గం

సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సెన్సార్ బోర్డు): 2014 లోక్‌సభ ఎన్నికల ముందు "హార్ హార్ మోడి, ఘర్ ఘర్ మోడి" నినాదం సృష్టించిన ప్రముఖ సినీ నిర్మాత పహ్లాజ్ నిహలానీ 2015 జనవరిలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సెన్సార్ బోర్డు) ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన మోడి మీద ప్రశంసలు కురిపిస్తూ తీసిన వీడియో "మేరా దేశ్ హై మహాన్" వివాదాస్పదమైంది. ఆయన వ్యవహార శైలి అనేక మంది సినీ నిర్మాతలు, దర్శకుల ఖండనలకు గురైంది. అది ఆయనకు ఆ పదవి నుండి తొలగించాలనే డిమాండు వరకు వెళ్ళింది.

ప్రసార్‌భారతి BJP అనుకూల పత్రిక "పయొనీర్" కన్సల్టింగ్ ఎడిటర్, ఢిల్లీలో ఆర్ఎస్ఎస్ అనుకూల ఆలోచనాపరులతో కూడిన వివేకానంద ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో సభ్యుడు, ఎ.సూర్యప్రకాష్, దూరదర్శన్, ఆకాశవాణిలను నిర్వహించే స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన ప్రసారభారతికి అధిపతిగా నియమితులయ్యారు.

NCERT : పాఠశాల విద్యకు సంబంధించిన జాతీయ పాఠ్య ప్రణాళికను రూపొందించి, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే NCERT డైరెక్టర్, ప్రొఫెసర్ సర్వీస్ సింక్లెయిర్, ఆమె పదవీ కాలం ముగియడానికి రెండేళ్ల ముందే, 2014 అక్టోబర్‌లో తన పదవికి రాజీనామా చేశారు. ఆమె మీద అవినీతి ఆరోపణలు వచ్చాయి. జాతీయ పాఠ్య ప్రణాళిక సమీక్ష కుద్దేశించిన 21 కమిటీల నివేదికల మీద సమీక్షలు చివరి దశలో వుండగా ఆమెకు ఉద్వాసన పల్కడం జరిగింది. ఆమె స్థానంలో హృషికేశ్ సేనాపతి డైరెక్టర్‌గా నియమించారు. గతంలో BJPకి చెందిన కమల్ సందేశ్ పత్రిక సంపాదకవర్గం సభ్యుడుగా పనిచేసిన అంబాచరణ్ వశిష్ఠను NCERT పబ్లికేషన్ల విభాగానికి సలహాదారుగానూ, పౌర సంబంధాల బాధ్యునిగానూ నియమించడం జరిగింది. తీస్తా సెతల్వాడ్ మీద దాడి చేయడానికుద్దేశించిన ఒక పుస్తకానికి ఆయన సంపాదకుడు.

## విశ్వ విద్యాలయాలు

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నలందా అంతర్జాతీయ విశ్వవిద్యాలయం (బీహార్) చాన్స్‌లర్‌గా వున్న ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్, BJP ప్రభుత్వ వైఖరి వల్ల చాన్సలర్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆయన ఒక బహిరంగ లేఖలో, యూనివర్శిటీ గవర్నింగ్ బోర్డు తనను చాన్స్‌లర్‌గా కొనసాగాల్సిందిగా ఏకగ్రీవంగా నిర్ణయించిందని, ఆ నిర్ణయానికి ప్రభుత్వం నుండి చాలా కాలంపాటు ఆమోదం లభించకపోవడంతో, తాను ఆ బాధ్యతలో మరో విడత కొనసాగడం సమంజసం కాదని భావించి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

రాజస్థాన్‌లో సంఘ్ పరివార్ బహిరంగంగా సన్నిహితంగా వుండలేని వైస్ చాన్సలర్లు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. యూనివర్శిటీ నిర్వహణలో ఆర్ఎస్ఎస్ అతిగా జోక్యం చేసుకుంటోందని రాజస్థాన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా. దేవ్‌రీప్ బహిరంగంగానే ఫిర్యాదు చేశాడు. ఆయన వారసుని ఎంపిక చేయాల్సిన సెర్చ్ కమిటీకి ఆర్ఎస్ఎస్ మద్దతు కల్గిన వైస్ చాన్సలర్ కైలాస్‌సోథ్ నాని నాయకత్వం వహిస్తున్నారు. రాజస్థాన్ యూనివర్శిటీ సిండికేట్లోని ఇద్దరు సభ్యులు ఆర్ఎస్ఎస్ మద్దతు కల్గిన అఖిల భారతీయ రాష్ట్రీయ శిక్షక్ మహాసంఘుకు చెందినవారే. బెనారస్ హిందూ యూనివర్శిటీకి ఆర్ఎస్ఎస్ కార్యకర్త గిరీష్ చంద్ర త్రిపాఠి 2014 నవంబరు 14న వైస్ చాన్సలర్ గా నియమితుడయ్యాడు. ఆయన పేరున మదనమోహన్ మాలవ్యా మనమడు, విశ్రాంత న్యాయమూర్తి గిరిధర్ మాలవ్య సెర్చ్ – కమ్ సెలక్షన్ కమిటీకి సిఫార్సు చేయబడ్డారు. వారణాశి నుండి లోక్సభకు పోటీచేసిన నరేంద్రమోడి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన గిరిధర్ మాలవ్యా, గిరీష్ చంద్ర త్రిపాఠి పాతమిత్రులని పత్రికలు పేర్కొన్నాయి.

హర్యానాలో BJP ప్రభుత్వం అధికారంలోకి రాగానే, గత ప్రభుత్వం వివిధ సాహిత్య అకాడమీలకు చేసిన నియామకాలను రద్దు చేసింది.

NIT నాగపూర్ : నాగపూర్‌లోని విశ్వేశ్వరయ్య నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి అధిపతిగా పేరొందిన ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్ విశ్రాం రామచంద్ర జల్దార్ నియమించబడ్డారు. ఈ పదవికి ఎంపిక చేసిన వారి జాబితాలో ఆయన పేరు లేకపోయినప్పటికీ ఈ ఉన్నత పదవికి నియమించబడ్డారు.

**టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చి** (TIFR) :

సైద్ధాంతిక భౌతిక శాస్త్రజ్ఞుని (Theoritical physicist)గా పనిచేస్తున్న డాక్టర్ సందీప్ త్రివేది డైరెక్టర్ నియామకాన్ని ప్రధాన మంత్రి కార్యాలయం (PMO) తిరస్కరించింది. ఒక డైరెక్టర్ నియామకాన్ని సాంకేతికపరమైన కారణాలతో పిఎంఓ తిరస్కరించడం ఇదే ప్రప్రథమం. త్రివేది ప్రథమ స్థానంలో వున్న సైద్ధాంతిక భౌతిక శాస్త్రజ్ఞుడు. ఆయన ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియోరిటికల్ సైన్సెస్ (ITS) అడ్వైజరీ బోర్డు సభ్యుడు. 2005లోనే భౌతిక శాస్త్ర విభాగంలో ప్రతిష్టాత్మకమైన శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డును, 2010లో భౌతిక శాస్త్రాల విభాగంలో ఇన్ఫోసిస్ అవార్డును అందుకున్నారు. ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న అవార్డు డా. CNR రావ్ ఈ విషయంలో జోక్యం చేసుకోవల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడిని కోరినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. బెంగుళూరులోని జవహర్లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ సైంటిఫిక్ రీసెర్చి అధిపతి నియామకం విషయంలోనూ ఇదే విధంగా జరిగిందని డా. రావ్ ఆరోపించారు. ఆయన నియామకం విషయం పునః పరిశీలించవల్సిందిగా ఆ సంస్థ మేనేజ్మెంట్ కౌన్సిల్ ప్రభుత్వాన్ని కోరింది. చిట్టచివరకు ప్రధానమంత్రి అధ్యక్షుడుగా వున్న నియామకాల క్యాబినెట్ కమిటీ (అపాయింట్మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ – ACC) ఆయన నియామకాన్ని ఆమోదించింది. ఈ విషయంలో వ్యథచెందిన శ్రీ త్రివేదీ తన సహచరుల ఒత్తిడి మేరకు చివరకు అంగీకరించారు.

**ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ** (IIT) :

రోపార్, భువనేశ్వర్, పాట్నా IITల డైరెక్టర్ల ఎంపిక విషయంలో HRD మంత్రితో ఏర్పడిన తీవ్ర విబేధాల కారణంగా ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త అనిల్ కాకోద్కర్, IIT బొంబాయి గవర్నింగ్ బాడీకి రాజీనామా చేశాడు. గతంలో జరిగిన ఎంపిక విధానాన్ని తుంగలో తొక్కి అప్పటికే ఇంటర్వ్యూ చేసిన 37 మంది అభ్యర్థులనుమరల ఇంటర్వ్యూకు పిలవాలని HRD మంత్రిత్వ శాఖ చేసిన నిర్ణయాన్ని, మంత్రిత్వ శాఖ తమ కనుకూలురను ఎంపిక చేసేందుకే జోక్యం చేసుకున్నదని, సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీలోని ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. మంత్రిత్వ శాఖ తమకు నచ్చిన వారిని నియమించేందుకే ఈ నిర్ణయం తీసుకుంది అని భావించడం జరిగింది.

**ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్డ్ స్టడీస్, సిమ్లా** (IIAS):

2014 మే నెలలో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బిజెపీ విజయం పొందిన తర్వాత IIAS ఛైర్మన్గా వున్న గోపాలకృష్ణ గాంధీ, ఆ పదవికి రాజీనామా చేశారు. HRD మంత్రి స్మృతి ఇరానీ, ఈ పదవికి రాజస్థాన్లోని బికనీర్లో వున్న మహారాజా గంగాసింగ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ చంద్రకళా పాడియాను నియమించినట్లు పత్రికలు పేర్కొన్నాయి. ఈ పదవికి అర్హులైన వారితో అంతకుముందే తయారుచేసిన ప్యానెల్లో ఆమె పేరు లేదు. పాలక పార్టీలో సనాతన భావాలు కల్గిన వారికి ఆమె భావాలు బాగా నచ్చుతాయని టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక పేర్కొంది. ❑

# ప్రాచీన విజ్ఞాన శాస్త్రం - హిందుత్వ

**(12వ పేజీ తరువాయి)**

భారత్, యూరపుల్లో విస్తృతంగా అమలు చేయడం జరిగింది. అంటే, అన్నిరకాల ప్రయోగాలను (పరిశోధనలను), ప్రకృతికి సంబంధించిన అధ్యయనాలు చేయడం నిమ్నవర్గాలు, భారతదేశంలో అయితే నిమ్నకులాల వారి కర్తవ్యమనే స్థాయికి దిగజార్చి, కేవలం మూలగ్రంథాలను వల్లె వేయడం ద్వారా మాత్రమే విజ్ఞాన సముపార్జన చేయాలన్న మాట! వివిధ సమాజాల్లో అభివృద్ధి చెందిన సజీవ సాంప్రదాయాలు, అలవాట్ల మీద యూరపులో మతపరమైన సాంప్రదాయాలను పాటించే మొనాస్టరీలలోని ప్రాచీన విజ్ఞానం ఆధిపత్యం చెలాయించింది. సారనాథోని అశోకుని స్తంభం గురించి వారణాసిలోని గురుకులాలలోని వారికి తెలియదు. అశోకుని రాజ శాసనాలతో కూడిన స్తంభాలు దేశవ్యాప్తంగా నెలకొల్పబడినప్పటికీ, 'విజ్ఞాన ఖనులుగా పేర్కొనబడుతున్న' ఈ గ్రంథాల్లో అశోకుని గురించిన సమాచారమే లేదు. భారతదేశంలో బౌద్ధానికి సంబంధించిన విజ్ఞానాన్నంతటిని (సమాచారాన్ని) బ్రాహ్మణ కులానికి చెందిన గ్రంథాలు నాశనం చేశాయి. అందువలన వారి గ్రంథాల్లో అశోకుని పాలన గురించి పేర్కొనబడలేదు. భారతీయ విజ్ఞాన శాస్త్ర చరిత్రలో జైన, బౌద్ధ మత సాంప్రదాయాలు, ఆచరణల ప్రభావానికి సంబంధించిన ఆనవాళ్ళు ఆసక్తి కల్గిస్తాయి. అవి రెండూ బ్రాహ్మణ మతానికి ఆధిపత్యానికి వ్యతిరేకం కావడంతో వేదాల ఆధిపత్యాన్ని తిరస్కరించాయి. కేవలం ప్రాచీనమైనది, వేదాల నుండి మాత్రమే గ్రహించిన విజ్ఞానంలో మాత్రమే విశ్వాసం గల్గిన వైదిక ఆలోచనా విధానం మీద ఆధారపడడం గాక, ఈ ఆలోచనా స్రవంతులు భారతీయ విజ్ఞానశాస్త్రాన్ని, గణిత శాస్త్రాన్ని తర్కం (Reasoning), సాక్ష్యాధారాల పునాదుల మీద నిలబెట్టేందుకు దోహదం చేశాయి. దేశంలో విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం ప్రగతిని కుంటుపరచి, తిరోగమన మార్గం పట్టించే విధంగా భారతీయశాస్త్ర విజ్ఞానానికి సంబంధించిన ఒక మోసపూరితమైన చరిత్రను సృష్టించాలని హిందుత్వ లాబీ ప్రయత్నిస్తోంది. ❑

**(ఆంధ్రప్రదేశ్ సీపీఎం ప్రచురించిన**
**'చరిత్ర విజ్ఞాన శాస్త్రాలపై బీజేపీ దాడి' పుస్తకం నుంచి)**

# సార్వత్రిక ప్రాథమిక ఆదాయం



- ప్రభాత్ పట్నాయక్

**చాలా మంది ఆర్థికవేత్తలు భారతదేశంలో సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని అమలుచేయాలని వాదిస్తున్నారు. 2016-17 ఆర్థిక సర్వేలో సైతం ఈ విషయాన్ని అధికారికంగానే సూచించారు. అయితే దానిని ఏ విధంగా అమల్లోకి తేవాలన్న ఆచరణాత్మక విషయం మీద ప్రతిపాదనలు రకరకాలుగా వస్తున్నాయి.**

ఒకస్థాయి కన్నా తక్కు వగా ఆదాయం పొందుతున్న వారందరినీ గుర్తించి వారందరికీ ఒకే విధంగా నగదు బదిలీ చేయాలన్నది ఒకటి. ఎవరెంత తక్కువ స్థాయిలో ఆదాయం పొందుతున్నారన్నది పరిశీలించి దానికి తగ్గట్టు నగదు బదిలీ వివిధ రకాలుగా చేయాలన్నది రెండోది. ఈ తేడాలను పక్కన పెడితే సార్వత్రిక పాథమిక ఆదాయం (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం) అనే భావన సారాంశం ఒక్కటే. సమాజంలో ప్రతీ ఒక్కరూ ఒక కనీస ప్రాథమిక స్థాయికి తగ్గకుండా ఆదాయాన్ని పొందగలగాలి. అందుకు వీలుగా ప్రభుత్వం నగదు బదిలీ చేయాలి. అప్పుడు ప్రతీ ఒక్కరూ ఒక కనీస స్థాయిలో సరుకులను పొందగలిగే పరిస్థితిలో ఉంటారు. ఆ విధంగా కనీస జీవన ప్రమాణాలను అందుకోగలుగుతారు. ఈ సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అనే భావన పట్ల కొన్ని అభ్యంత రాలు వచ్చాయి. ఆర్థిక సర్వే వాటిని వివరంగా పేర్కొని తన నివేదికలో వాటిపై చర్చించింది. ప్రధానమైన అభ్యంతరాలు మితవాద శక్తుల నుండి వచ్చాయి. వాళ్ళ ప్రధానమైన అభ్యంతరం ఒక్కటే. ఈ విధంగా ప్రభుత్వం నేరుగా నగదు అందిస్తే ఇక దానిని అందుకున్నవాళ్లు తమ వంతు కష్టపడి పని చేయడం మానేస్తారు. పనిచేసినా, చెయ్యకపోయినా ఎటూ ఆదాయం రావడం ఖాయం గనుక ఆ కాడికి మనం పని చేయడం దేనికి? అన్న ధోరణి పెరుగుతుంది.

మనం ప్రస్తుతం ఉంటున్న సమాజంలో ఒక వ్యక్తి ఆదాయం అతడు చేసే కష్టం మీద ఆధారపడి వుంటుంది అన్న ప్రాతి పదికన ఈ వాదన నడుస్తుంది. ఒక వ్యక్తి కష్టపడక పోయినా అతనికి లేదా ఆమెకు కనీస స్థాయిలో ఆదాయం గ్యారంటీగా వచ్చే పద్ధతి ప్రవేశ పెడితే, అప్పుడు మన సమాజం నడక మారిపోతుంది అని మితవాదులు అంటారు. కాని ఈ వాదన బొత్తిగా అర్థరహితం. ఎందుకంటే, ప్రస్తుత సమాజంలో ధనవంతులు ఏ కష్టమూ పడకుండానే విపరీతంగా తమ సంపదను పెంచుకో గలుగుతున్నారు. ఇంకో పక్క పేదలు చాలా కొద్దిపాటి కూలి డబ్బుల కోసం రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. ఒకానొక కార్మికుడు ఎంత ఎక్కువ కష్టంతో కూడిన పని చేస్తే, ఎంత ఎక్కువ ప్రమాదంతో కూడిన పని చేస్తే అంత ఎక్కువ జీతం అతడికి వస్తుంది అని ఆడమ్ స్మిత్ చెప్పాడు. ఐతే ఆచరణలో ఆ విధంగా లేదని జాన్ స్టువార్ట్ మిల్ అనే మరో ఆర్థికవేత్త గమనించాడు. నిజానికి అటువంటి కష్టతరమైన, ప్రమాదాలతో కూడిన పనులు చేసేవారికి అతి తక్కువ వేతనాలు లభిస్తున్నాయని అతడు ఎత్తిచూపాడు. అందుచేత ఇక్కడ సార్వత్రిక ప్రాథమిక వేతనం అమలు చేయడం అంటే ఏ పనీ చేయనందుకు ఇచ్చే ఆదాయం కాదు. అతడు చేసే పనికి ఎక్కువ రేటు వేతనాన్ని చెల్లించడం ఔతుంది. (ఒకానొక వ్యక్తి నిరుద్యోగిగా ఉన్నాడంటే అది అతడి వ్యక్తిగతమైన తప్పు కాదు, అది ఈ సామాజిక వ్యవస్థ లోపం. ఈ విషయానికి, ప్రస్తుత చర్చతో సంబంధం లేదు). సార్వత్రిక ప్రాథమిక ఆదాయం గ్యారంటీ చేస్తే దాని వలన జనాలు పని చేయడం మానేస్తారు అన్న వాదన ఎలాంటిదంటే, జీతాలు ఎంత పెంచితే కార్మికులు అంతగా పని ఎగ్గొడతారు అన్న వాదన లాంటిది. కార్మికుల జీతాలకు డిమాండ్-సప్లయ్ సూత్రాన్ని వర్తింపజేసే మితవాద ఆర్థికవేత్తల వాదన ఇది. ఈ వాదన నైతికంగా సహించకూడనిది, విశ్లేషణాత్మకంగా చూస్తే నిరాధారమైనది. అందుకే 'ధనవంతులు ఎంత ఎక్కువగా సంపాదిస్తే అంత బాగా పని చేస్తారు, పేదలు ఎంత తక్కువ జీతం ఇస్తే అంత బాగా పని చేస్తారు' అన్నట్టుగా వీళ్ళ వాదన ఉందని జె.కె.గాల్ బ్రెయిత్ అనే అమెరికన్ ఆర్థికవేత్త మితవాదులని అవహేళన చేశాడు. మితవాదులు సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని వ్యతిరేకిస్తే, అభ్యుదయ కాముకులైన ఉదారవాదులు(లిబరల్స్) ఈ ప్రతిపాదనను బలంగా ముందుకు తెస్తున్నారు. ఈ ఉదారవాదుల ప్రతిపాదన ఎలాంటిదంటే కోడి గుడ్డును పగలగొట్టకుండానే ఆమ్లెట్‌ను తయారు చెయ్యాలన్నటువంటిది. మామూలుగా ఈ ఉదారవాదుల ప్రతిపాదనలన్నీ ఈ విధంగానే ఉంటాయి. వీళ్లు ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ లోపలనే సమాజం కొనసాగాలను కుంటారు. అదే సమయంలో ఈ సమాజం కార్మికవర్గం పట్ల మరింత మానవత్వంతో మెలగాలని అంటారు. మరైతే అందుకోసం పెట్టుబడిదారులను మరీ ఎక్కువగా ఇబ్బంది పెట్టకూడదని అంటారు. అందుకనే సార్వత్రిక ప్రాథమిక ఆదాయం పేర చెల్లించవలసిన మొత్తం

చాలా స్వల్పంగా ప్రతిపాదించారు. ఉదాహరణకి 2016–17 ఆర్థిక సర్వే ఒక సంవత్సరానికి ఒక వ్యక్తికి రు.7620 చొప్పున బదిలీ చేయాలని ప్రతిపాదించింది. మెరుగైన జీతాలు పొందే 25 శాతం కార్మికులను మినహాయించి తక్కిన వారందరికీ తలా రూ.7620 చొప్పున ఏడాదికి చెల్లించాలంటే అందుకు మన జిడిపిలో 4.9 శాతం కేటాయించాలి. దానితో సరిసమానమైన మొత్తాన్ని గనుక అత్యల్ప ఆదాయాలు పొందుతున్న 75 శాతం ప్రజలకు కేటాయిస్తే (2011–12 నాటి ధరల ప్రాతిపదికన) దాని వలన దేశంలో పేదరికం ఆ ఏడాదిలో (2011–12 లో) కేవలం 0.5 శాతం మాత్రమే ఉండి వుండేది.అంటే పేదరికం దాదాపు లేకుండా పోయేదని ఆర్థిక సర్వే పేర్కొంది.

అయితే, తలా రూ.7620 చెల్లించడం కోసం అవసరమయ్యే ఆర్థిక వనరులను సేకరించడానికి ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రకరకాల సబ్సిడీలన్నింటికీ కోత పెట్ట వచ్చునని ఆర్థిక సర్వే సూచన ప్రాయంగా చెప్పింది. ఆర్థిక సర్వే చెప్పిన లెక్కలతో రెండు సమస్యలు ఉన్నాయి. మొదటిది: సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అమలు జరగడం వలన పేదలు తినే ఆహారపు కేలరీల విలువ దాదాపు 50 శాతం పెరుగుతుందని ఆ సర్వే చెప్పింది. ఆ మేరకు వారికి బదిలీ చేసే నగదు మొత్తంలో పెరుగుదల ఉండాలంటే జిడిపిలో 4.9 శాతం చాలదు,7.5 శాతం కావాలి. ఆర్థిక సర్వే సూచించినట్టు సార్వత్రిక ప్రాథమిక వేతనాన్ని అమలు చేసేటప్పుడు ఇతర సబ్సిడీలకు కోత పెట్టడం జరిగితే అప్పుడు సాలుకి రూ.7620 సరిపోదు. సార్వత్రిక ప్రాథమిక వేతనాన్ని అమలు చేయడానికి వచ్చిన ఇతర సూచనలు చాలా పరిమిత లక్ష్యాలతో ఉన్నాయి. ఒకవేళ ఈ సార్వత్రిక ప్రాథమిక ఆదాయం విధానాన్ని అమలు చేయడానికి పార్లమెంటులో ఒక చట్టాన్ని తీసుకు వచ్చి, అందులో పెరిగే ధరలకు అనుగుణంగా చెల్లింపులు పెంచాలన్న నిబంధనను విధిస్తే (ఇప్పుడు ఉపాధి హామీ చట్టంలో ఉన్నట్టు) అప్పుడు ప్రభుత్వం విద్య, వైద్యం తదితర పద్దుల్లో కోత పెట్టి ఈ విధానాన్ని అమలు చేస్తుంది.

అప్పుడు పేదల దగ్గర ప్రభుత్వం ఇచ్చిన సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అయితే ఉంటుంది కాని, వాళ్ళ బిడ్డల్ని ఉచితంగా చదివించే స్కూళ్లుగాని, వాళ్ళ రోగాలకు ఉచితంగా వైద్యం చేసే ఆస్పత్రులు గాని ఉండవు. ఒకవేళ ప్రైవేటు స్కూళ్ళకు, ప్రైవేటు ఆస్పత్రులకుపోతే ప్రభుత్వం సార్వత్రిక ప్రాథమిక ఆదాయం కింద ఇచ్చిన సొమ్ము కాస్తా వాటికేపోతుంది. అప్పుడు వారి వినిమయ శక్తి తగ్గిపోతుంది. సార్వత్రిక ప్రాథమిక ఆదాయం విధానాన్ని ప్రవేశపెట్టిన లక్ష్యం నెరవేరదు.


అందరికీ ప్రాథమిక వేతనాన్ని పొందే హక్కు కల్పించే చట్టాన్ని తెచ్చినా,అందుకోసం ప్రభుత్వం అందించే నగదు బదిలీల నిమిత్తం ఇతర సబ్సిడీలలో విధించే కోతల కారణంగా ఆ చట్టం నిరుపయోగం అవుతుంది. అందుచేత సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని పొందే హక్కును ఒక చట్టంగా చేయడం కన్నా,ప్రజలకు కొన్ని కనీస హక్కులను గ్యారంటీ చేసే చట్టాలను తీసుకు రావడం ఎక్కువ ఉపయోగం.

నాణ్యతకల విద్యను ఉచితంగా పొందే హక్కు, నాణ్యత కలిగిన వైద్యసేవలను ఉచితంగా పొందే హక్కు,ఉపాధి పొందే హక్కు,ఉచితంగా వృద్ధాప్య పెన్షన్ పొందే హక్కు,అంగవైకల్యానికి పరిహారం పొందే హక్కు వగైరా హక్కులను కల్పిస్తూ చట్టాలు తీసుకు రావడం అవసరం. నిజానికి సార్వత్రిక ప్రాథమిక వేతనం ఇవ్వాలన్న ప్రతిపాదన దేనికి? ఆ పేదలు విద్య,వైద్యం, వగైరాలను పొందడానికే కదా? అటువంటప్పుడు ఆయా హక్కులను కల్పించే చట్టాలను చేయడం ప్రయోజనకరం ఔతుంది కాని,సార్వత్రిక ప్రాథమిక ఆదాయాన్ని ఇస్తూ అందుకోసం విద్య,వైద్యం తదితర హక్కులలో కోతలు పెట్టడం వలన ఏమిటి ఉపయోగం? అందుచేత సార్వత్రిక ప్రాథమిక ఆదాయం అనే భావన చాలా సదుద్దేశ్యంతో కూడిన దైనప్పటికీ,అది బొత్తిగా అర్థం లేనిది. నిజంగా దేశంలో ప్రజల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలనుకుంటే, అప్పుడు వైద్యం, విద్య,ఉపాధి తదితర హక్కులను కల్పించే చట్టాలను చేయడమే గాక, సంక్షేమానికి కేటాయింపులను బాగా పెంచాల్సి వుంటుంది.ఆర్థిక సర్వే సూచించిన మొత్తం ఏ మూలకూ చాలదు.


ఆహార హక్కు,ఉపాధి హక్కు ( లేదా ఉపాధి దొరికే దాకా కనీస వేతనం) నాణ్యత కల వైద్యం పొందే హక్కు, నాణ్యత కల విద్య పొందే హక్కు, వృద్ధాప్య, వికలాంగ పెన్షన్ పొందే హక్కు– ఈ అయిదింటినీ కల్పించాలంటే అందుకు మన జిడిపిలో కనీసం 10 శాతం కేటాయించడం అవసరం. అందుకోసం ప్రభుత్వం పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని కనీసం 7శాతం మేరకు పెంచాలి (తక్కిన 3 శాతం ప్రజలు చేసే ఖర్చు పెరిగినందు వలన లభిస్తుంది.). అదనంగా 7 శాతం పన్నులు పెంచడం ప్రభుత్వానికి పెద్ద కష్టమేమీ కాదు. సంపన్నుల మీద అదనపు పన్నులు వేయ గలగాలి. అంతే.

అత్యంత సంపన్నులైన ఒక్క శాతం జనాభా మీద సంపద పన్ను 2 శాతం చొప్పున అదనంగా విధించాలి. వారసత్వంగా ఆస్థి సంక్రమించినప్పుడు (ఈ ఒక్క శాతం జనాభాలోనే) అందులో 33.33 శాతం వారసత్వ పన్నుగా విధించాలి.ఈ రెండు పన్నులూ చాలు.దేశం మొత్తంమీద పైన చెప్పిన 5 హక్కులనూ అమలు చేయడానికి సరిపడా ధనం సమకూరుతుంది. ఐతే అప్పుడు మన దేశం సంక్షేమ రాజ్యం ఔతుంది. ఆ విధంగా మార్చడం ఈ బూర్జువా వ్యవస్థ శక్తికి మించిన పని. బూర్జువా వ్యవస్థ పరిధిని దాటని ఉదారవాద ఆర్థికవేత్తల అవగాహనకు అందని వ్యవహారం ఇది. ❑

# గద్దర్ పాటే ముద్దు.. వివాదం వద్దు



- ప్రసాదమూర్తి



మిత్రుల మధ్య భిన్నమైన అభిప్రాయాలు ఉంటాయి. అది తప్పు కాదు. వాటిని షేర్ చేసుకొని ఒకరిని ఒకరు సరి చేసుకోవడం స్నేహానికి ఎంతో మంచిది. గద్దర్ గురించి నా అభిప్రాయాలను ఇంతకుముందే వీడియో రూపంలో అందించాను. పూర్తి వ్యాసాన్ని ఇక్కడ ఉంచుతున్నాను చదవగలరు. మనం కాసేపు ఆగి మాట్లాడుదాం. కొంచెం ఊపిరి పీల్చుకుని మాట్లాడుదాం. మనకు తెలుసు. ఆ కట్టె పూర్తిగా మట్టిలో కలిసి పోయేదాకైనా ఓపిక పట్టి అప్పుడు మాట్లాడుదాం. నాయకులు విగ్రహాల్లోనో పుస్తకాల్లోనో మిగిలిపోతారు. కేవలం కవి మాత్రమే ప్రజల హృదయాల్లో నిలిచిపోతాడు. ప్రజల నాలుకల మీద నర్తిస్తాడు. ప్రజల కళ్ళలో కాంతి కెరటమై పైపైకి లేస్తూనే వుంటాడు. ప్రజల పిడికిళ్ళలో పొద్దుపొడుపై మిలమిల మంటాడు. ప్రజల కాళ్ళలో గజ్జెలై ఘలుఘల్లుమంటాడు. ఎక్కడరా విప్లవం అని కొందరు గద్దించి అడుగుతారు. ఇదిగో ఇక్కడుందిరా అని మనం గుండెలు చీల్చి చూపించవచ్చు. విప్లవం కేవలం భౌతికం కాదు. అది గాలిలో వుంటుంది. గాలి గొంతులో వుంటుంది. అది నీటిలో వుంటుంది. నీటి శబ్దంలో వుంటుంది. అది చెట్టులో వుంటుంది. చెట్టు నీడలో వుంటుంది. పక్షిలో వుంటుంది. పక్షి పాటలో వుంటుంది. ఎక్కడున్నాడు మీ దేవుడు చూపించరా అని హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని అడిగినప్పుడు కంటికి కనిపించిన స్తంభాన్ని చూపించాడు. అలా మనం చూపించలేమా..? చూపించగలం.

విప్లవ వాగ్గేయకారుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ వెళ్ళిపోయాడు. ఇక ఆయన పాట మిగిలింది. ఆ పాట రేపే తుఫాను మిగిలింది. ఆ పాట ఊపే ఊయల మిగిలింది. ఆ పాట తుడిచే కన్నీరు మిగిలింది. ఆ పాట ధారగా మెరిసే కత్తి మిగిలింది. ఆ పాట కురిసే వాన మిగిలింది. ఆ పాట నడిపే తోవ మిగిలింది. ఎవరన్నారు ఒక వంగపండు లేదని, ఒక శ్రీశ్రీ లేదని, ఒక చెరబండరాజు లేదని, ఒక శివసాగర్ లేదని, ఒక సఫ్దర్ హష్మీ లేదని, ఒక గద్దర్ లేదని, ఇదిగో ఇక్కడున్నాడురా అని చూపే దమ్ముండాలి. వాళ్ళంతా నిశ్శబ్దంగా మన నెత్తురులో తిష్ఠ వేసి మనతో చూడాల్సింది చూపిస్తుంటారు. చేయాల్సింది చేపిస్తుంటారు. పాడాల్సింది పాడిస్తుంటారు. గెంతాల్సింది గెంతిస్తుంటారు. రాయాల్సింది రాయిస్తుంటారు.

మణిపూర్ మంటల్ని చూసినప్పుడు మనలో మంట పెట్టిందెవరు? ఎక్కడో ఆ ఈశాన్య కొండల్లో ఆడకూతుళ్ళను వివస్త్రలను చేస్తే మన ఒంటి మీద వస్త్రాలు పగిలిపోయినట్టు గుండెలు పగిలేలా మనల్ని ఏడ్పించిందెవరు? వాడు ఎన్నార్సీ అంటే.. సీఏఏ అంటే ఖబడ్దార్ బిడ్డా అని మన గొంతుల్లో కూర్చుని ఆకాశం అదిరిపడేలా అరిచిందెవరు? రైతులు నడిరోడ్లను నాగళ్ళతో దున్నినప్పుడు హక్కుల మొక్కలై అక్కడ మనల్ని మొలిపించిన కనిపించని శక్తులెవరు? మహిళా మల్లయోధుల పిడికిళ్ళలో మనల్ని సూర్య కణాలుగా పేర్చిందెవరు? దేశం అంతరాంతారాళాల్ని జంతర్ మంతర్లుగా చేసి ప్రజాస్వామ్య, మతసామరస్య, మానవీయ విలువల కోసం, హక్కుల కోసం మనల్ని కదం తొక్కించే ఆ కదన కుతూహల రాగాలెవరు? మనిషికీ మనిషికీ మధ్య హద్దులు, సరిహద్దులు, గోడలూ, ఆంక్షలూ సమస్తాన్నీ ధ్వంసం చేసి మానవ కలల మహా సరస్సుల్లో హంసల్లా కలయ తిరిగే ప్రజా కళాకారులకు మరణం లేదు. ఈ భూమ్మీద మనిషి కోసం పరితపించే ప్రతి స్వాప్నికుడి కనురెప్పల మీదా వారు పొద్దు పొద్దూ కొత్త పొద్దులై పొడుస్తూనే వుంటారు.

నిజమే. చాలాసార్లు చాలా మందిని వారి అంతిమకాల రూప విరూపాల్ని చూసినప్పుడు వీరులు యుద్ధంలోనే మరణించాలి అని గట్టిగా చెప్పాలనిపిస్తుంది. ఏ రాజ్యం మీద, రాజ్య హింస మీద అతను పాటల తూటాలు పేల్చాడో ఆ రాజ్యమే ఆయన దేహంలోకీ తూటాలు దింపింది. ఆయన అంత్య క్రియలకూ తూటాలు పేల్చి సలాం కొట్టింది. ఎంత విడ్డూరం? ఎవరెవరో నటులు..రాజకీయ నాయకులు ఆయన పార్థివ దేహానికి భుజం కాశారు. ఎంత విచిత్రం? నిజమే. చాలా రోతగా అనిపిస్తుంది.

ఈ నటనలన్నీ అతను వదిలి వెళ్ళిన దేహానికి తెలియదు. ఆ దేహాన్ని వదిలి వెళ్ళిన వాడికి అన్నీ తెలుసు. కానీ మనం ఎవ్వరం ? తీర్పులివ్వమని మనల్ని న్యాయమూర్తులుగా ఎవరు నియమించారు ? నేను ఇవే పాటలు పాడతాను అని ఆయన హండ్రెడ్ రుపీస్ బాండ్ పేపర్ మీద మనకేమైనా రాసిచ్చాడా? నేను గద్దర్ మరణించిన రోజున ఒక చిన్నపోస్టు పెట్టాను ఎఫ్బీలో. కొందరు తమ యవ్వన కాలాన్ని ఎంత కాంతిమంతంగా వెలిగిస్తారంటే ఆ వెలుగులో నక్షత్ర కాంతి మండలాలు కూడా వెలవెలబోతాయి. చివరికాలంలో వారు ఏ చీకటి వైపు అడుగులు వేసినా కాలం చిరునవ్వుతో ఆ అడుగుల్ని చెరిపేస్తుంది. వెనకటికి శ్రీశ్రీ గురించి మాట్లాడుతూ ఆయన రాసి విసిరేసిన కవితలు గుబాళిస్తుంటే ఆయన తాగి పారేసిన సీసాల గొడవ మనకెందుకు అన్నాడు కాళోజీ. అయినా గొడవ గొడవే. గొడవ పెట్టిన వారు, గగ్గోలు పెట్టిన వారు పెట్టారు. ఆయన ఆత్మకథలో శ్రీశ్రీ అరాచకత్వం అంతా బయటపడింది. చదవి శ్రీశ్రీ అభిమానులే ఛీఛీ అన్నారు. ఆయన ఎమర్జెన్సీని సమర్థిస్తూ ఇందిరమ్మను కీర్తిస్తూ రాశాడు. ఇవన్నీ మిగిలాయా? లేదు. ఆయన గీతాల మహాప్రస్థానమే మిగిలింది. శ్రీశ్రీ మహాకవి స్థానం ఎటూ పోలేదు. మహాకవి కాదని చెప్పడానికి ఎవరికీ ఏ సాసహసమూ కలగలేదు. చలం విషయమూ అంతే. అతని స్త్రీ చాపల్యాన్ని భరించినా, అతను స్త్రీ వాదం వదిలి చివరికి ఈశ్వర వాదాన్ని ప్రతిష్టిస్తే ఎంత మాత్రం సహించలేకపోయాం. అయితే ఏమైంది? చలాన్ని తరిమి తరిమి కొట్టిన తెలుగు సమాజం చలం రచల్ని మాత్రం తగలబెట్టలేకపోయింది. మానవ పురోగమనాన్ని కాంక్షించేవారు, అలాంటి మహా వ్యక్తులలోని పురోగామి అంశాలనే తీసుకుంటారు. వాటినే నిత్యం స్మరించుకుంటారు. ఆ స్మరణ మానవజాతి ప్రగతి గీతంలో విడదీయరాని చరణంగా అమరిపోయినంతకాలం ఆ మహా వ్యక్తుల కాంట్రిబ్యూషన్ కాంతి ఖడ్గంలా మెరుస్తూనే వుంటుంది. గద్దర్ విషయమూ అంతే. పొద్దు తిరుగుడు పువ్వు పొద్దును ముద్దాడినట్టు ఆయన పాటల్ని కాలం నిత్యం ముద్దాడుతూనే వుంటుంది. మనం నిద్దట్లోనో మెలకువలోనో కలంతోనో కలల్లోనో మనిషి కోసం మథన పడే క్షణాలల్లో ఆ పాటలు మనకు తెలీయకుండానే మనలో మూల మూలలా వొదిగి మనల్ని ముందుకు నెడుతూ వుంటాయి. అంతే అంతవరకే మనకి కావాలి. పక్షుల్లారా మీరు మా కొమ్మ మీదే వాలి పాడండి పాటలు అంటే, అవి వింటాయా? మా పాటలే పాడండీ అంటే ససేమి వింటాయా? కళాకారులు కూడా అంతే. మన కాళ్ళకి గజ్జెల్లా చుట్టుకుని మనల్ని కాల వేదిక మీద గంతులేయించే గద్దర్ వేలాది పాటలుండగా మనకేం లోటు చెప్పండి. కోపం వస్తుంది నిజమే. ప్రజాయుద్ధ నౌక భక్తి సముద్రంలో మునిగిపోయిందేమబ్బా అని ఆవేదన పడతాం కాని, ఆగ్రహం కాదు. ఆ కట్టె ఇంకా మట్టిలో పూర్తిగా కలవక ముందే మనం కట్టుగట్టి విరుచుకుపడినా విశ్వ గోళాల్లో విహరించే ఆ పాటకు ఏమీ వినిపించదు. అందుకే కొంత సంయమనం పాటిద్దాం. కాలం అన్ని లెక్కలూ తేల్చుతుంది. గద్దర్ ని మనం ఎక్కడ కూర్చోబెట్టినా ఆయన పాటని మాత్రం నెత్తి మీద దీపంలా పెట్టుకుంటాం. లోపలో బయటో ఎక్కడో ఏ చీకటి కమ్మినప్పుడో ఆ వెలుగులో సత్యాసత్యాల్ని పోల్చుకుని ముందుకు సాగుతాం. గద్దర్ ఎప్పుడు మరణించాడో సరిగ్గా చెప్పలేం కాని, అతని పాట ఎప్పటికీ మరణించదని ఖచ్చితంగా చెప్తాం. కవీ.. నీ పాటకు లాల్ సలాం.. లాల్ సలాం.. లాల్ సలాం సలాం. ❑

# నువ్వు లేవు నీపాట ఉంది

మట్టి మనిషి మెడలో
పాటలదండ వేశావు
కష్టజీవి కళ్ళల్లో
గజ్జెకాంతిని నింపావు
చెమట బతుకుల బంతిలో
సమతాన్నం వడ్డించావు
కన్నీళ్ళున్న చోట
గొంతువిచ్చి మ్రోశావు
దోపిడున్నచోట
పాటల ఉప్పెనైనావు
ఏలినోళ్ళ కళ్ళల్లో
నలుసువై సలిపావు
శత్రువు కుట్రలో
తూటాల స్నానం చేశావు
వాక్కును, గేయాన్ని
నోటబట్టి పాడావు
ఎర్రజెండా ఎగరేసి
రాజ్యం నరంలో వణుకు పుట్టించావు
తెలుగు పాటల సముద్రంలో
ఎర్ర నౌకగా మెరిశావు
నువ్వు లేవు
నీపాట ఉంది.



**- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**

# ఉద్యమ కళగా మారుతున్న జానపద కళ



- కె.శాంతారావు

**పనీపాటల్లో అలసిపోయిన పల్లె ప్రజానీకానికి రసవత్తరంగా సాగే కొందరి ప్రదర్శనలు అమితంగా ఆకర్షించేవి. ప్రకృతిని, విశ్వాన్ని అధ్యయనం చేయ డం, తమదైన ప్రజానుభవంతో పోల్చిచూసుకోవడం, రాబోయే పరిణామాలు తెలియజెప్పడం, రకరకాల ప్రాంతాలు సందర్శించి అక్కడి విషయాలు ఇక్కడ, ఇక్కడి విషయాలు అక్కడ తెలపడంతో ఈ జానపద కళాకారులు తమకు తెలియకుండానే ప్రజలకు బోధకులయ్యారు. క్రాంతి దర్శకులయ్యారు. ప్రజలు మేలుకోరుతూ పద్యాలు, పదాలు, పాటలు కథలు అల్లుతూ పాడడం, తిరగడం, ఆడడం వారికి నిత్యకృత్యమై అదే జీవనోపాధిగా, జానపద కళగా, వృత్తిగా మారింది.**

'జాతి జీవనాళిక జానపద గీతిక'

'జానపదమే మా ప్రాణ పదము'

పల్లెలోన వున్నదే పాడినాము నిజము' పాట

జనపథం నుండే జానపదం పుట్టింది. జనపథం అంటే పల్లె. పల్లెలు వున్నాయి కానీ పల్లె జీవనం అంతరిస్తున్నది. ఆ ఆప్యాయతలు, పలకరింపులు, మమతానురాగాలు, అనుబంధాలు, ప్రేమలు, సహకారాలు, ముచ్చట్లు మురిపాలు అన్నీ కనుమరుగై పోతున్నాయి. మనిషిలో మనిషితనం లోపిస్తున్నది. మనిషి పరాయీకరణైపోతున్నాడు(ఎలియనేట్). దేశం నుండి, సమాజం నుండి, కుటుంబం నుండి చివరకు తన నుండి తాను వేరై పోతున్నాడు. 'మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు. మచ్చుకైనా కానరాడు' – అందెశ్రీ పాట వింటున్నాం.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఎ.ఐ) కృత్రిమ మేదస్సు విస్ఫోటనంతో ముప్పెరగొంటున్న డిజిటల్ యుగంలో ఆధునిక ప్రపంచం పరుగెడుతున్నది. ఈ నేపథ్యంలో జానపద కళల అస్థిత్వం మాటేమిటి? వాటికి పునాదిగా నిలిచే పల్లెసీమల ఉనికి మాటేమిటి? ఇవన్నీ మనముందుకు తోసుకువస్తున్న చర్చనీయాంశాలు. జానపద కళలు అంతరించిపోకుండా, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం ప్రతి ఏడాది ఆగస్టు 22ను 'ప్రపంచ జానపద కళల దినోత్సవం'గా జరుపుకుంటున్నాం. జానపద కళలు మానవ జీవన స్వభావం నుండే పుట్టాయన్న విషయాన్ని మనం మరువరాదు. 'మానవ పరిణామ క్రమంలో పశువు నుండి మనిషిని వేరు చేసిందే కళ' అని ఏగెంల్స్ మహనీయుడు ఏనాడో చెప్పాడు.

ఆదిమ మానవ సమాజం నుండి పరిశీలించినపుడు (లక్షల సంవత్సరాల క్రితం) మూడు గుణాలు అంతర్లీనంగా ప్రతి మనిషి జీవితంతో పెనవేసుకు పోయినట్లు అర్థమవుతున్నది.

**1. కేరింగ్ :** మనిషిని మనిషి పట్టించుకోవడం. ఆహారం కోసం జంతువుల్ని వేటాడే క్రమంలో తోటివారు ఎవరు గాయపడినా సానుభూతి చూపడం, ఉపశమన సపర్యలు చేయడం, రక్షించడం ఓ మానవ లక్షణంగా పరిణమించింది. పశుపక్ష్యాదుల్లో కూడా ఈ లక్షణం ఉన్నట్లు మనం గమనించవచ్చు.

**2. షేరింగ్ :** మనిషి తనకు కలిగిన కష్టసుఖాలను ఇతరులతో పంచుకోవడం. తన అనుభవాలను, అనుభూతులను రసాత్మకంగా వ్యక్తీకరించడం. భాషలేని ఆ రోజుల్లో తాను ఏ జంతువును చూసింది, వర్ణించడం, దానితో ఎలా పోరాడిందీ అరుపులతో, భంగిమలతో అభినయిస్తూ తెలిపేవాడు. చిత్రాలుగా బొమ్మలు గీసేవాడు. ఆఫ్రికా గుహల్లో ఆ కుడ్య చిత్రాలు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి.

**3. రేరింగ్ :** పెంపకం, పిల్లల్ని సాకడం. ఈ లక్షణమూ మనకు జంతువుల నుండి సంక్రమించినా, ఆ తర్వాత మనిషికి లభించిన తెలివితేటలతో అన్నీ అభివృద్ధి చేసుకున్నాడు. ఉదాహరణకు మర్కట కిశోర న్యాయం అంటే తల్లి కోతి ఏ చెట్టు నుండి ఏ చెట్టుకు దూకినా పిల్ల కోతి తల్లి కడుపును గట్టిగా పట్టుకునే వుంటుంది. ఆ పట్టుకోవడంలో తల్లికి మించిన బాధ్యత పిల్లకే ఎక్కువగా వుంటుంది. అలా పెంపకంలో పిల్లలు కుటుంబంతో, పెద్దలతో పెనవేసుకుపోతారు.

భాష పుట్టుక, సంగీతం రాగాలాపనతో వృద్ధి అయ్యాక, పనీపాటలతో జీవితం కలిసిపోయింది. పనీ – పాట, పనితో పాట, పని లేకున్నా పాట, కష్టజీవుల ఆటా మాటా పాటా అన్నీ జీవితంలో మమేకం అయిపోయాయి. దేనినీ వేరు చేయలేం. విడిగా చూడలేం. పుట్టుక – పెళ్లి – చావు అన్నీ ఘటనల్లో, వేడుకల్లో, క్రతువుల్లో ఆనందాలు, సంతోషాలు, సుఖదు:ఖాలు అనివార్యంగా కళారూపాలుగా వ్యక్తీకరణ అయ్యేవి. లిపి లేదు. అంతా మౌఖిక సాహిత్యమే. వినడం, అనడం (పాడడం, చెప్పడం)తోనే భాష వృద్ధి అయింది. ఈ వినడం, అనడం

మధ్యలో మనిషికి తెలియకుండానే తన సృజనశీల (తనదైన ప్రత్యేకత) ఆసువుగా వృద్ధి అయింది. ఈ సృజనశీల ప్రాంతం ప్రాంతానికీ, వ్యక్తి వ్యక్తికీ వేర్వేరుగా వుంటుంది. ఇదే కళలో మార్మికత, ఆకర్షణ. అందుకే జానపద కళలు, చెట్లు, పూలు, అరణ్యాలు విరబూసినట్టు ఎక్కడబడితే అక్కడ జనపదులు ఉన్న చోట్లల్లా విరబూశాయి. యుగయుగాలుగా, తరతరాలుగా మానవజాతితోపాటు పరిఢవిల్లాయి. వర్ధిల్లాయి, వృద్ధి అయ్యాయి. వేట, అటవీ ఫల సేకరణ, పశుపోషణ, వ్యవసాయం, స్థిరనివాసం, మిగులు ఉత్పత్తి, ఈ పరిణామం అంతటిలోనూ ఓ పక్కన జీవన పోరాటం సమిష్టిగా సాగిస్తూనే, మరో పక్క మిగులు సమయాన్ని రాత్రివేళల్లో సమిష్టిగా ఆనందించడం కూడా మనిషి నేర్చుకున్నాడు. పల్లె జీవనం సమిష్టి ఉత్పత్తి సంబంధాలతో మిళితమైపోయింది.

పనీపాటల్లో అలసిపోయిన పల్లె ప్రజానీకానికి రసవత్తరంగా సాగే కొందరి ప్రదర్శనలు అమితంగా ఆకర్షించేవి. ప్రకృతిని, విశ్వాన్ని అధ్యయనం చేయడం, తమదైన ప్రజానుభవంతో పోల్చిచూసుకోవడం, రాబోయే పరిణామాలు తెలియజెప్పడం, రకరకాల ప్రాంతాలు సందర్శించి అక్కడి విషయాలు ఇక్కడ, ఇక్కడి విషయాలు అక్కడ తెలపడంతో ఈ జానపద కళాకారులు తమకు తెలియకుండానే ప్రజలకు బోధకులయ్యారు. క్రాంతి దర్శకులయ్యారు. ప్రజలు మేలుకోరుతూ పద్యాలు, పదాలు, పాటలు కథలు అల్లుతూ పాడడం, తిరగడం, ఆడడం వారికి నిత్యకృత్యమై అదే జీవనోపాధిగా, జానపద కళగా, వృత్తిగా మారింది. రాజరిక, ఫ్యూడల్, భూస్వామ్య వ్యవస్థలో సంగీత, సాహిత్యాలతో కొన్ని కళలు మాత్రమే అంత:పుర ఆశ్రయాలకు నోచుకుంటేబీ ఈ జానపద కళలు అసంఖ్యాకంగా ప్రజానీకాన్ని అలరించేవి. ఆలోచింపజేసేవి. ఒక విధంగా విజ్ఞాన సంపదను రంగరించి ప్రజానీకానికి ధారపోసేవి. ప్రజల మేలు కోరాలనే సత్యనిష్ట వీరిలో, వీరి కళారూపాల్లో నిబిడీకృతమై, అణువణువు తొణికిసలాడేవి.

మన గ్రామాలను పరిశీలించుకుటే దాదాపు వందేళ్ల క్రితం పాఠశాలలే లేవు. అప్పుడు ప్రజలకు మరి విద్యాబోధన ఎలా జరిగేది? ఈ జానపద కళాకారుల వలనే లోక విజ్ఞానం లభించేది. జీవితంలో అల్లుకుపోయిన రామాయణ, మహాభారత ఇతిహాస కావ్యాలను రూపుకట్టి చూపించేవారు. ఆడించేవారు, పాడించేవారు. తోలుబొమ్మలాటలో ఆవిధంగా చూడబట్టే రాముడు ఇలా, రావణుడు అలా(పది తలలతో), హనుమంతుడు ఇలా అని దర్శనమిచ్చేవారు. అందుకే 'తొంబై మైళ్లు నడిచి వెళ్లైనా తోలు బొమ్మలాట చూడాలి' అనే సామెత పుట్టుకొచ్చింది. అప్పటికింకా సినిమాలు పుట్టలేదు. నాటకాలే వుండేవి. అవీ పౌరాణికం, జానపదం. ఇలా ఎన్నో, ఎన్నెన్నో జానపద కళా రూపాలు ఉద్భవించాయి. వికసించాయి.

పారిశ్రామిక విప్లవంతో పెట్టుబడి దారీ ప్రపంచం అవతరించాక మనిషి స్వార్థజీవిగా మారడం, త్వరితగతిన పరిణమించింది. పైకి స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం అని నినదించినా, లోపల దోపిడి, లాభం పాతుకుపోయింది. డబ్బే దానికి ప్రధానమైంది. డబ్బు వలన, డబ్బు కొరకు, డబ్బు చేత నడిచే ధనస్వామ్య ప్రభుత్వంగా మారింది. ప్రజాస్వామ్యం గల్లంతయింది. మనిషి కన్నా మనిషి సృష్టించిన డబ్బుకే ప్రాధాన్యత సమకూరింది. కారల్ మార్క్స్ చెప్పినట్టు మనిషి కూడా మార్కెట్‌లో సరుకైపోయాడు. అందుకే ఇప్పుడు మనిషిని మనిషిగా మేల్కొలపాలి. జానపద కళల మౌలిక సత్యం – కర్తవ్యం ఇది. చాలామంది ఇది గమనించకుండా పైపైన పాటలు పాడుతూ, చిందులేస్తూ అవే జానపద కళలు అని భ్రమిస్తున్నారు. జానపద కళల మౌలిక కర్తవ్యం మనిషిని మనిషిగా మేల్కొలపడం. వ్యక్తివాదాన్ని కాకుండా సమిష్టి తత్వాన్ని ప్రోత్సహించడం, తోటి మనిషిని ద్వేషించకుండా మనిషిగా ప్రేమించడం, గౌరవించడం. అనుబంధం, ఆత్మీయ తలను, నిష్కల్మషంగా, స్వచ్ఛంగా కళారూపాల్లో కురిపించడం, అంతిమంగా మానవ హక్కుల రక్షణకు పాటుపడడం అని గుర్తెరగాలి. జానపద కళలు గతంలో ఇవన్నీ ఘనంగా చేశాయి. ప్రజల ఆదరణతో ఆ కళాకారులు అపర బ్రహ్మలుగా రాజ్యమే లారు. రామాయణం, మహాభారత ఇతిహాసాలతోపాటు ఎప్పటి కప్పుడు, ఎక్కడికక్కడ దోపిడీ, దౌర్జన్యాలను దునుమాడుతూ చారిత్రక జానపద వీర గాథలను సృష్టించారు, ఆలపించారు. అయితే ప్రస్తుతం వున్న పెట్టుబడిదారీ వ్యవస్థ మన దేశంలో పాసిస్టు భావజాలంతో జతగట్టింది. మత విద్వేషంతో తోటి మానవులను హింసించడం, వధించడంబీ పద్ధతి ప్రకారం రాజ్యాంగస్ఫూర్తిని, విలువలను కాలరాయడం గమనిస్తూనే వున్నాం. ప్రజల పక్షం వహించే జానపద కళల పట్ల ఈ పాలకులకు గౌరవం లేదు. యాచకుల స్థాయికి జానపద కళాకారులను దిగజార్చడం బాధాకరం. అనాగరికం.

అందుకే అవి (జానపద కళలు) ఓ ధిక్కార స్వరంతో ప్రజాఉద్యమాల్లో మమేకం అవుతున్నాయి. ప్రజల మూగవేదనకు శ్రవ్య, దృశ్య రూపాలుగా మారుతున్నాయి. ఎక్కడ నిరసన పెల్లుబికుతుందో అక్కడ పాట అల్లుకుపోతున్నది. కాలి గజ్జెలు ఘుల్లుమంటు న్నాయి. ఢిలీ కిసాన్ ఉద్యమాల్లో ఎందరో జానపద కళాకారులు తమ గళాలకు, కలాలకు పదునుపెడుతూ ఆ ప్రజా ఉద్యమా లను కూడా ఉగ్రూతలూగించారు. ఈ విధంగా సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ ప్రపంచంలో జానపద కళ అనివార్యంగా ఉద్యమకళగా, ప్రజాకళగా పురుడుపోసుకుంటున్నది. ❑

# సమాజాన్ని మార్చే ప్రయోగం



- ప్రకాష్‌రాజ్

**సమాజాన్ని మార్చే ప్రయోగమే నిర్‌దిగంత "దేహానికి అయిన గాయాలు కాలంతోపాటు మానిపోతాయి. కానీ దేశానికి అయ్యే గాయాలను వది లేస్తే అవి రాచపుండ్లవుతాయి. 'కౌర్యం, హింసలకు ధర్మం లేదు.. అందుకే వాటికి కరుణ లేదు' 'నిర్‌దిగంత' వేదికగా రూపొందించిన 'పూండ్స్' నాటకంలో డైలాగులు ఇవి. థియేటర్ రంగంలో కర్ణాటకలో సంచలనం రేకెత్తిస్తున్న ఈ నాటకానికి కర్త, కర్మ, క్రియ - ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్. తను చేస్తున్న ప్రయోగం గురించి ఆయన మాటల్లోనే..**

"రెండేళ్ల నుంచి నాలో ఒక అంతర్మథనం ప్రారంభమయింది. నేను థియేటర్‌ను మిస్ అవుతున్నానని పించింది. ముంబయిలో షూటింగ్‌కి వెళ్లినప్పుడు.. పృధ్వీ థియేటర్‌ను చూసేందుకు వెళ్లాను. ఆ వాతావరణం నాకు ఎంతో నచ్చింది. అక్కడ ఉన్న ఒక కాఫీ షాప్‌లో కూర్చున్నా. కొందరు యువతీ, యువకులు వచ్చి నన్ను పలకరించారు. ఆటోగ్రాఫ్‌లు, సెల్ఫీలు తీసుకున్నారు. "మరాఠీ థియేటర్‌లో నాటకం వేస్తున్నారు. సాయంత్రం షోకు వస్తారా?" అని అడిగారు. ఆ షోకి వెళ్లా. అందరిలో విపరీతమైన ఎనర్జీ. నన్ను చూడగానే అందరూ గుమిగూడారు. ఇదంతా నాలో కొత్త ఆలోచనలు రేకెత్తించింది. 'నా నటనా జీవితానికి పునాది వేసిన థియేటర్‌కు నేను ఏం చేశాను?' అనే ఆలోచన కలచివేయటం మొదలుపెట్టింది. గిరీష్ కర్నాడ్ రాసిన, నాకు చాలా నచ్చిన నాటకాన్ని మళ్లీ వేద్దామా? అనుకున్నా. అప్పుడు ఒక ఫ్రెండ్– "మళ్లీ థియేటర్‌కు వచ్చి నటించి, మంచి నటుడు అనిపించుకోవాలను కుంటున్నావా?" అని అడిగాడు. 'అది నిజమే కదా' అనిపించింది. ఒక నాటకం వేసేననుకోండి. అప్పుడు రకరకాల రివ్యూలు రావచ్చు. కొందరు 'బాగా చేశాడు' అనవచ్చు. మరికొందరు 'గతంలో చేసినట్టు చేయలేక పోయాడు' అనవచ్చు..' నేను కోరుకుంటున్నది ఇదేనా?' అని ఆలోచించాను. అప్పుడు నాకు ఏం కావాలో అర్థమయింది. "వర్తమానంలో నా రిలవెన్స్ ఏమిటి?" అనే విషయాన్ని ఆలోచించడం మొదలు పెట్టాను. అది తొలి అడుగు. అదే నా జీవన విధానం... కర్ణాటకలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా శాఖ ఉంది. బి.వి.కారంత్ ప్రారంభించిన 'రంగాయణం' అనే సంస్థ ఉంది. నా చిన్నప్పుడు నన్ను దాన్లో చేరమంటే చేరలేదు. సాన్నిహెళ్లి స్వామిజీ ఒక సంస్థ నడుపుతున్నారు. సుబ్బణ్ణ గారు



ప్రారంభించిన సంస్థ ఒకటి ఉంది. 'నటన' అనే వేరే సంస్థ ఉంది. అయితే ఈ సంస్థల్లో చదువుకున్న విద్యార్థులకు... చదువు పూర్తి అయిన తర్వాత ఏం చేయాలో తెలియని సందిగ్ధత ఉంది.వాళ్లకు ఉద్యోగాలు లేవు. స్కూళ్లలో, కాలేజీలలో, యూనివర్సిటీలలో థియేటర్ ఒక పాఠ్యాంశం కాదు. వీళ్లందరికీ సాధికారత కల్పిస్తే వాళ్లలో ఉన్న సృజనాత్మకత, స్వతంత్ర ఆలోచనలను ప్రోది చేసి ఉత్సాహపరిస్తే.. ఇలాంటి ఆలోచనలు నన్ను వెంటాడటం మొదలుపెట్టాయి. అంతేకాకుండా థియేటర్ నా జీవితాన్ని తీర్చిదిద్దింది. నాలో ఉన్న ఒక కళాకారుణ్ణి వెలికితీసింది. సాహిత్యాన్ని చదువుకొనేలా చేసింది. గొప్ప గొప్ప రచయితలతో మాట్లాడేలా చేసింది. ప్రస్తుతం థియేటర్ కళాకారులకు ఆ అవకాశం తక్కువగా ఉంది. వారికి ఆ అవకాశం కల్పించాలనే బలమైన కోరిక కలిగింది. అదే 'నిర్‌దిగంత'. అంటే 'దిగంతాలు లేనిది' అని అర్థం. సాధారణంగా మనం కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకొని జీవిస్తూ ఉంటాం.వాటి కోసం ఆరాటపడుతూ ఉంటాం. దాన్ని చేరుకున్న తర్వాత మరొకటి కనిపిస్తుంది. దాని కోసం ప్రయత్నాలు మొదలు పెడతాం. ఇలా జీవనప్రయాణం సాగుతూనే ఉంటుంది. కానీ నా జీవిత ఫిలాసఫీ అది కాదు. దిగంతాలను దాటే ప్రయాణమే నా జీవన విధానం. ఒక వేదికను రూపొందించాలని... దీనికి ఒక రూపు ఇవ్వటానికి సుమారు ఆరునెలలు పట్టింది. మైసూర్‌లో నాకు ఒక ఫామ్‌హౌస్ ఉంది. అది ప్రదర్శనశాల కాదు. అయితే మన దేశంలో పిల్లలు పోరాడి, ప్రయోగాలు చేసేందుకు,ఓడేందుకూ, గెలిచేందుకూ ఒక వేదిక లేదు. నా ఫామ్ హౌస్ ఆ అవకాశాన్ని కల్పిస్తుంది. వాళ్లు తాము అప్పటి వరకు నేర్చుకున్న విషయాలను వదిలేయవచ్చు. ఓడిపో వచ్చు. మళ్లీ పోరాడవచ్చు. గెలవవచ్చు. అలాంటి వేదికను రూపొందించాలనుకున్నాను. థియేటర్ ఆర్ట్స్ చదువుకొని, అదే జీవితంగా బతుకుతున్న

15 మంది యువతీ యువకులను ఎంపిక చేసుకున్నాం. వారికి నా ఫామ్‌హౌసే 'సన్నివాసం'. 45 రోజుల పాటు వారు దానిలో ఉన్నారు.. ఉదయం వ్యవసాయం చేసేవారు. మధ్యాహ్నం ఒక వంటవాడి సహాయంతో తమ వంట తామే వండుకొనేవారు.ఆ తర్వాత అంతా థియేటరే! అది తప్ప వారికి వేరే ప్రపంచమే లేదు. ఈ 45 రోజుల్లో వారు– 'వూండ్స్' అనే ఒక అద్భుతమైన నాటికను తయారుచేశారు.ఈ నాటిక రూపకల్పనకు కూడా ఒక నేపథ్యం ఉంది. అంతకన్నా గొప్ప కాంప్లిమెంట్ ఏముంటుంది? ఇప్పుడు మన చుట్టు ఎటు చూసినా ఒక విధమైన హింస కనిపిస్తోంది. అయితే ఈ హింస ఇప్పుడే జరుగుతోందా? చరిత్రలో జరగలేదా? దాని నుంచి మనం ఏం నేర్చుకున్నాం?... ఈ విషయాలన్నింటితో ఆ నాటిక రూపుదిద్దుకుంది.. రెండో ప్రపంచయుద్ధ సమయంలో ఫిరాండ్లో అనే అద్భుతమైన రచయిత ఉండేవాడు. ఆయన రాసిన రచనలు, శ్మశాన కురుక్షేత్రం' అనే నాటిక, దేశ విభజన సమయంలో జరిగిన సంఘర్షణల ఆధారంగా రాసిన మంటో రచనలు, కృష్ణమూర్తి రాసిన 'అజ్ఞాతవాసుడి ఆత్మచరిత్ర', అజ్మీ, అరోడా లాంటి కవుల రచనలను వారి ముందు ఉంచాం. వీటి ఆధారంగా ఒక స్క్రిప్ట్ తయారుచేయాలని చెప్పాం. శ్రీపాదభట్ అనే ప్రముఖ డైరక్టర్‌కు మైసూర్‌లో ఒక బ్యాండ్ ఉంటే దాని ద్వారా మ్యూజిక్ చేయించాం.ఇలా తయారయిందే 'వూండ్స్' (గాయాలు). అయితే ఈ నాటికను ఎలా ప్రదర్శించాలి? ఎక్కడ ప్రదర్శించాలనేది కూడా ఒక పెద్ద సవాలే అయింది. ఎందుకంటే కర్ణాటక థియేటర్ విషయానికి వచ్చే సరికి, ఒక నాటకం పట్టుమని పది ప్రదర్శనలు ఇవ్వడానికి కూడా వీలు ఉండదు.దీనికి భావ దారిద్ర్యంతో పాటు ఆర్థిక దారిద్ర్యం కూడా కారణమే! నా అనుభవంలో ఒక నటుడు తాను నటించే నాటకంతో పాటు ఎదుగుతాడు. అప్పుడే అతనికి ఒక అనుభవం వస్తుంది. 'వూండ్స్'ను వేసే టీమ్ కూడా ఎదగాలంటే వీలైనన్ని ప్రదర్శనలు జరగాలి. దీని కోసం వంద షోలతో ఒక టూర్‌ను రూపొందించాం.టీమ్ కోసం రెండు బస్సులను ఏర్పాటు చేశాం. ఈ బస్సుల్లో వారు ధార్వాడ్, శివమొగ్గ, భద్రావతి, మంగుళూర్, ఉడిపి, బెంగుళూరు... ఇలా అన్ని ప్రాంతాలు తిరుగుతున్నారు. ప్రదర్శనలు ఇస్తున్నారు. వీటికి విపరీతమైన ప్రజాదరణ లభిస్తోంది.అయితే ప్రజలకు ఈ నాటకం చూపించటంతో లక్ష్యం పూర్తయి పోదు.యువతీ యువకుల్లో కొత్త ఆలోచనలు రావాలి. దీని కోసం – 'వూండ్స్' నుంచి కొన్ని భాగాలను తీసి – 'కావ్యరంగం' అనే ఒక బాలే రూపొందించాం. ఒక వైపు ప్రజల కోసం 'వూండ్స్' ప్రదర్శన కొనసాగుతూ ఉంటుంది. మరో వైపు 'కావ్యరంగం' బాలేని కాలేజీల్లో ప్రదర్శిస్తూ ఉంటారు. దీనితో పాటుగా ఒక చర్చావేదిక కూడా ఉంటుంది. నేను ఈ మధ్య మూడు రోజులపాటు శివమొగ్గ తదితర ప్రాంతాల్లో తిరిగి వచ్చాను. ఐదారు వేల మంది విద్యార్థినీ, విద్యార్థులను కలిశాను. వారిలో ఉత్సాహం, ఏదో చేయాలనే తపన చూస్తుంటే ముచ్చటేసింది. కొత్త ఆశలు చిగురించాయి.

కర్ణాటకలోని అన్ని జిల్లాల్లో అద్భుతమైన స్పందన వస్తోంది. మీడియా దీని గురించి ప్రజల్లోకి తీసుకు వెళుతోంది.. గత వారం శివమొగ్గ వెళ్లినప్పుడు ఎనిమిదో క్లాసు చదువుతున్న ఒక పిల్ల లేచి– "ఇది కదా మనకు స్కూల్లో చెప్పాల్సింది" అంది. అంతకన్నా గొప్ప కాంప్లిమెంట్ ఏముంటుంది? మహిళల కోసం కొత్త నాటిక... అయితే 'నిర్దిగంత' ఒక నాటకంతోనే ఆగిపోదు. మరో నాటకాన్ని తయారుచేశాం. కొచ్చిన్, బెంగుళూరు, పాండిచ్చేరిల నుంచి ఎనిమిది మంది డ్యాన్సర్స్ వచ్చి ఒక వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. త్వరలోనే దేశవ్యాప్తంగా ఉన్న ఎనిమిదిమంది మహిళా రచయితలు ఒక వర్క్‌షాప్ ను నిర్వహించాలనుకుంటున్నారు. వీరు అక్కడ చేసే రచనల ఆధారంగా... మన సమాజంలో ఉన్న మహిళల పరిస్థితులపై ఒక కొత్త నాటికను రూపొందిస్తాం. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. 'నిర్దిగంత'లో ఒక నాటిక తయారు చేయటమంటే – డైరక్టర్, నటులు, సాంకేతిక నిపుణులతో మాత్రమే పూర్తయిపోదు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు వచ్చి వచ్చి అక్కడ ఉన్న పిల్లలతో మాట్లాడుతూ ఉంటారు. ఉదాహరణకు 'గ్రీన్ ఆస్కార్' అందుకున్న వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్ కృపాకర్ సేనాని మొన్నే వచ్చి పిల్లలతో మాట్లాడారు. అలాగే ఒక సైంటిస్ట్ వచ్చి వారిని కలుస్తారు. నాకు సమయం ఉన్నప్పుడు కలుస్తూ ఉంటాం. దీనివల్ల పిల్లల్లో కొత్త కొత్త ఆలోచనలు వస్తాయి." తెలంగాణలో కూడా.. "తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ తరహా ప్రయోగం చేయాలనేది నా ఉద్దేశం. నాకు హైదరాబాద్ సమీపంలో ఒక ఫామ్‌హౌస్ ఉంది. దీనిలో కొంత స్థలాన్ని కేటాయిస్తాను. అంతే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కళాకారులు.. మేధావులు.. థియేటర్ పై ఆసక్తి ఉన్నవారందరినీ కలిసి – ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా నాటకాలను రూపొందించి ప్రదర్శించాలనేదే ఉద్దేశం. తెలంగాణలో దీనికి ఇప్పుడిప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టాను. ప్రస్తుత పరిస్థితులపై స్పందించే వారు ముందుకు వస్తే వారితో కలిసి పనిచేయటానికి నేను సిద్ధంగా ఉన్నా.." "నాటకం నటీనటులలతోనే కాదు, అందరితోనూ ముడిపడి ఉంటుంది.ఒక్కరు నటనలో విఫలమైనా మొత్తం నాటకమంతా దెబ్బతింటుంది. అదే విధంగా రాసే సమయంలోను అందరి ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇలా చేయాలంటే వారిలో వారు ఆలోచనలను సమన్వయం చేసుకోవాలి. ఒకే భావోద్వేగ సమూహంలా పనిచేయాలి. అదే నాటకం గొప్పతనం.ఈ క్రమంలో వారి ఆలోచనల్లో పరిణతి వస్తుంది. ఒక నటుడికి సమకాలీన సమాజంపై అవగాహనతో పాటు గత చరిత్రకు సంబంధించిన జ్ఞానం కూడా ఉండాలి.

**(మిగతా 36వ పేజీలో)**

# పధ్నాలుగు తోడేళ్ల కథ




- విరించి విరివింటి

**అమెరికాలోని అతిపెద్ద మొట్ట మొదటి వైల్డ్ లైఫ్ పార్క్ అయిన Yellow stone National park కథ ఇది. దీని విస్తీర్ణం 3500 చదరపు కిలోమీటర్లు. అడవిని నేషనల్ పార్క్ చేయడం వలన అడవి జంతువుల ప్రిజర్వేషన్ జరుగుతుంది అని 1872లో దీనిని నేషనల్ పార్కుగా డిక్లేర్ చేశారు. అడవులు మనకు ఎందుకు అవసరం, జీవావరణంలో ప్రతీ జీవి పోషించే పాత్ర ఏంటో అర్థమవడానికి సాధారణంగా ఈ పార్కు కథను ఉదహరిస్తుంటారు.**

ఇక కథలోకి వెళితే..

1920లో ఈ పార్క్‌లో తోడేళ్ళన్నీ పూర్తిగా కనుమరుగైపోయాయి. తోడేళ్ళు అక్కడున్న ఇతర జంతువులను ముఖ్యంగా పెద్ద జింకల్లాగా ఉండే Elk కణుజులను తినేస్తున్నాయని వీటిని చంపకపోతే కణుజులు అంతరించిపోతాయని చంపడం మొదలెట్టారు. రానురాను ఈ జీవులు అంతరించాక కణుజులను చంపే జంతువేదీ లేకపోవడంతో వాటి సంఖ్య పెరిగింది. అక్కడున్న యెల్లో స్టోన్ నది తీరం వెంబడి పెరిగే విల్లో చెట్లు, వక వృక్షాలు, కాటన్వుడ్ వృక్షాలను అవి తినడం మొదలెట్టాయి. వాటిని వేటలో తరిమే జంతువే లేకపోవడంతో అవి ఈ తీరాల వెంబడి పుట్టలు పుట్టలుగా పెరిగి పోయాయి. బీవర్ అనే ఉభయ చర జీవులు (ఇవి ఎలుకల వంటివి) ఈ తీరాల వెంబడే ఉంటూ విల్లో, కాటన్వుడ్ వంటి వృక్షాలపై ఆధారపడతాయి. ఐతే బీవర్లు ఆసక్తికరమైన జంతు వులు. ఇవి చెరువుల చుట్టూ ఉంటాయి. అవి చెరువు అడుగు భాగంలో ఉన్న చెత్తను, చెరువు చుట్టు పక్కల ఉన్న చెత్తను, రాళ్ళను తీసుకుని వచ్చి చెరువు వొడ్డుమీద పేరుస్తుంటాయి. అంటే, చెరువు కట్టను ఇవే నిర్మిస్తాయి. అవి నిర్మించిన చెరువు కట్టల మీదే వాటి అందమైన గృహాలను నిర్మించుకుంటాయి. శత్రు జంతువులు తమపై దాడి చేసినప్పుడు తప్పించుకోవడానికి గృహం కింద రెండు రహస్య ద్వారాలను చెరువు నీటిలోకి తప్పించుకోవడానికని నిర్మించుకుంటాయి.

ఐతే ఎప్పుడైతే కణుజులు అన్ని చెట్లనూ తినడం మొదలైందో ఆ చెట్ల ఆకులపై ఆధారపడే బీవర్లకు ఆహారం లేక అవి అడవి నుండి ఖాళీ చేసి వెళ్ళిపోవడం మొదలెట్టాయి. బీవర్లు లేకపోవడంతో అవి కట్టిన చెరువు కట్టలు పోవడంతో నీరు నిలువ వున్న మడుగులు పూడుకపోవడం ఎండిపోవడం మొదలైంది. కణజుల దెబ్బకు చెట్లు తగ్గి బీవర్లు తగ్గడంతో నదీ తీరం కోతకు గురైనది. తీరం వెంబడి ఉండే జంతువులు వెళ్ళిపోయాయి. కలపనిచ్చే చెట్లు తరిగిపోవడంతో కలపను అమ్మే పారిశ్రామికవేత్తలు కలప లేక నష్టాలు చవిచూశారు. ఇళ్ళు కట్టుకునేందుకు ఉపయోగపడే కలప ధర పెరగడం మొదలైంది.




1920లో తోడేళ్ళు పోవడంతో మొదలై 70 ఏళ్లలో పైన చెప్పిన మార్పులన్నీ వచ్చాయి. ఆ పార్క్ జీవావరణం మొత్తం దెబ్బతిన్నది. దానిపై స్టడీ చేసిన ఇకాలజిస్టులు తోడేళ్ళను చంపి మొత్తం నాశనం చేయడంతోటే ఈ మార్పులు వచ్చాయని గమనించారు. 1995లో 14 తోడేళ్ళను కెనెడా నుండి తెప్పించి ఈ పార్క్‌లో వదిలారు. మళ్ళీ అన్నీ రివర్స్‌గా జరగడం మొదలైంది. కణజుల జనాభా తగ్గింది. దానితో వక, విల్లో వంటి వృక్షాలు ఎదిగాయి. తీరం వెంబడి చెట్లు పెరిగాయి. బీవర్లు మళ్ళీ వచ్చాయి. చెరువుల లోతు పెరిగి అండర్ గ్రౌండ్ వాటర్ పెరిగింది. కలప దొరకడం మొదలైంది. పరిశ్రమలు ఇళ్ళు కట్టుకునే వారికి కలప లభించింది. ఇలా జీవావరణంగా ఏర్పడటానికి మళ్ళీ ఇరవై సంవత్సరాలు పట్టింది.

మన దగ్గర ఉండే అటవీ ప్రాంతాల్లోంచి జంతువులు మాయమౌతున్నా లేక ఉండాల్సిన జంతువులు మరోచోటకు తరలిపోతున్నా మనుషుల మీదకు దాడులు చేస్తున్నా ఆ మొత్తం అడవిలో ఏదో ఒకచోట కనిపించని విధ్వంసం ఏదో జరుగుతుందని మనం గుర్తించాలి. The hidden life of trees అనే పుస్తకం చదివితే మనకు అడవి అంటే వేరు వేరు చెట్ల సముదాయం అని కాకుండా అడవి అంటే మొత్తం ఒకే జీవిలా అర్థమవడం మొదలవుతుంది. పైకి కనబడటానికి తోడేళ్ళు సాధు జంతువుల మీద పడి చంపేస్తున్నాయి **(మిగతా 35లో)**

### మత దుర్మార్గాన్ని కళ్ళకు కట్టిన నవల

# ఏది నిత్యం ?



- డాక్టర్ కందాళ శోభారాణి

**స్త్రీ వాదం మహిళా జీవన అధ్యయనాలకు దారి తీసింది. మహిళా జన జీవనం ప్రతి విద్యా విషయక అంశంలో చేర్చవలసిన అంశంగా మారింది. 1980వ దశకంలో ఈ రకమైన అధ్యయనాలు పరిశోధనలు విస్తరించిన కాలం. అంతర్జాతీయ మహిళా సంవత్సరాన్ని ప్రకటించడానికి దారితీసిన పరిస్థితులు, మహిళా దశాబ్ది కాలం మొత్తం మీద ఒక పదిహేను సంవత్సరాలు స్త్రీల జీవితాలలో విప్లవాత్మకమైన మార్పులను ఆశించి ఒక ఉద్యమ వాతావరణాన్ని సృష్టించాయి. అన్ని రకాల హింసల నుండి, పీడన నుండి స్త్రీలను విముక్తి చేయటం ఆశయంగా సమిష్టి ఉద్యమాలు రూపొందించిన కాలం. అలాంటి కాలంలో అంటే 1980లో లత రాసిన 'ఏది నిత్యం' నవల వచ్చింది.**




మతం మత్తు వంటిది అన్నాడు మార్క్స్. మత్తులాంటి మతాన్ని వస్తువుగా చేసుకొని రాసిన నవల ఏది నిత్యం. ఇందులో ప్రధాన పాత్రలు రాజమ్మ, రాధమ్మ, బాలస్వామి, వెంకట్రామయ్య, సెంటినా సరోజనమ్మ, ఏసుపాదం, జానయ్య, దాసయ్య. ఇతరత్ర పాత్రలు ఆశీర్వాదం, జ్ఞానసుందరం, రాధా కృష్ణ, వెంకట్రావు, మనోహరమ్మ, కాశింసాయబు, జాన్‌కోటయ్య, పీటర్, విక్టోరియా, మస్తాను, కిల్లీకొట్టు లింగం సుబ్బారావు, కోటయ్య, ఆర్ముగం, రత్నం, అబ్రహాం, పంతులు, కల్లప్ప, ఆనందరావు, ప్లీడరు మొదలగువారు.

రాధమ్మ, రాజమ్మ సంభాషణతో నవల మొదలవుతుంది. రాధమ్మ ఇంట్లో రాజమ్మ పనిమనిషి. రాధమ్మ భర్త వెంకట్రామయ్య పరమనీచుడు. భార్య లేనప్పుడు రాజమ్మకి డబ్బులు ఆశ చూపి లొంగదీసుకోవటం, ఇంట్లో వస్తువులు, ట్రాన్సిస్టరు, కిరసనాయిలు, బియ్యం కాన్నుండి రాజమ్మ చేతికిచ్చి అమ్మించటం ఆ డబ్బులతో అతని ఇష్టానుసారంగా ప్రవర్తించటం. ఏ పని పాట లేని సోమరిపోతు, అవిటివాడు, మొండివాడు కూడా. ఇంట్లో వస్తువులు పోయిన విషయం గమనించి రాధమ్మ రాజమ్మను గట్టిగా నిలదీస్తుంది. పని మానెయ్యమని కోపగిస్తుంది. దాంతో ఏడుస్తూ రాజమ్మ నేను బాగానే బ్రతికాను పరిస్థితులు ఇలా దాపురించాయని తన గత జీవితాన్ని రాధమ్మకి చెప్పటం గతంలోకి వెళ్తుంది రాజమ్మ.

రాజమ్మ తల్లి సెంటినా సరోజనమ్మ, తండ్రి ఏసుపాదం, బాబాయి జానయ్య. రాజమ్మ అమ్మమ్మను ఆంగ్లో ఇండియన్ డ్రైవర్ ఉంచుకోవటం వల్ల పుట్టినామె సెంటినా సరోజనమ్మ. ఆమెకు డ్రైవర్ ఇల్లు కట్టిస్తాడు. ఆ ఇంట్లోనే సరోజనమ్మ ఒక్కతే కూతురు కావటం వల్ల ఇల్లు సొంతం అవుతుంది సరోజనమ్మకి. సెంటినా సరోజనమ్మ రామవరప్పాడు ఊరికి కూలికి వెళ్ళేది. రైల్వే ఉద్యోగం(కరెంట్ పని)లో పనిచేసే ఏసుపాదం భార్యను కూలి మాన్పించి, చర్చికి వెళ్తూ ఉండమని చెప్తాడు. చర్చిలో ఉన్న పాస్టర్‌ని పిల్లలు అవడానికి ప్రార్థన చేయమని అడుగుతుంది. దాంతో ఆశీర్వాదం అనే పాస్టర్ ప్రభువు కథలు చెబుతూనే ఆమెను లొంగదీసుకుంటాడు.

సెంటినా సరోజనమ్మకి, ఆశీర్వాదంకి కలిగిన సంతానమే రాజమ్మ. పాస్టర్లు స్త్రీలను మోసం చేసే స్థితిని గమనించవచ్చు. ఇలాంటి ఘటనలు అనేకచోట్ల జరుగుతుంటాయి. దినపత్రికలలో ఎన్నో వచ్చాయి కూడా.

ఏసుపాదం స్నేహితుడు కాశింసాయబు తరచుగా ఇంటికి రావటం సరోజనమ్మతో అక్రమ సంబంధం ఏర్పర్చుకుంటాడు. యాభై సంవత్సరాల వయస్సు వచ్చినా గుడివాడలో చిన్నప్పుడు ప్రేమించిన వ్యక్తి దగ్గరికి ప్రతి నెల 5వ తేదీన కలిసి వస్తుం

టుంది (సాయబు రైల్వే ఉద్యోగి రిటైర్డ్). సెంటినా సరోజనమ్మ ఇలాంటి సంబంధాల వల్ల రాజమ్మను నిర్లక్ష్యం చేస్తుంది. దాంతో బాబాయి జానయ్య రాజమ్మను పెంచుతాడు. సెంటినా సరోజనమ్మ దంపతులకు క్రిస్టియన్ మతం పుచ్చుకున్న వాళ్ళు. ఆ మతం పట్ల వీరాభిమానం కలగినవాళ్ళు, జానయ్యకు అది ఇష్టం ఉండదు.

రాజమ్మకు అంటే జానయ్యకు దాసయ్య స్నేహితుడు, ఇతనికి హిందూ మతం పట్ల అభిమానం, దాసయ్య కొడుకు బాల స్వామి, అతను జానయ్య ఇంటికి తండ్రి గురించి అప్పుడప్పుడు రావటం వల్ల రాజమ్మ చూసి అతన్ని ఇష్టపడుతుంది. సరోజ నమ్మ రాజమ్మ కోసం సినిమా హాలుతో పనిచేసే ఒక రౌడీని పెళ్ళి కోసం మాట్లాడుతుంది. రాజమ్మ ఆ సంబంధాన్ని తిరస్కరి స్తుంది. రాజమ్మ బాలస్వామి కోసం ఊరు గుణదల వెళ్తుంది. బాలస్వామిని పెళ్ళి చేసుకుంటావా ? అని నిలదీసి అడుగు తుంది. ఓ మగాన్ని. నిన్ను ప్రేమించాను. నన్ను చేసుకుంటావా? చేసుకోవా? నిలేసి అడగటంలో తెలివి, ధైర్యం కనిపిస్తుంది.

బాలస్వామి వాళ్ళు హరిజనులు, రాజమ్మ వాళ్ళు క్రిస్టియన్లు, దీని మీద దాసయ్యకు, జానయ్యకు మధ్య చర్చ. ఇంతకు ముందు అంతా ఒకటే. ఈ మతం తెల్లవాళ్ళు కొత్తగా తెచ్చిపెట్టింది అంటాడు దాసయ్య. పై కులాల వాళ్ళు అన్యాయంగా చూడటం వల్ల మతం మార్చుకున్నాం. కాని బుద్దులు మారలేదంటాడు జానయ్య. మొత్తం మీద సరోజనమ్మకి తెలిస్తే అడ్డు చెబుతుందని జానయ్య, దాసయ్య కల్సి బాలస్వామికి, రాజయ్యకి భద్రాచలంలో శ్రీరామనవమి సందర్భంగా రాముల వారి సన్నిధిలో హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్ళి జరిపిస్తారు. హైదరాబాద్ – డోర్నకల్ – కొత్తగూడెం – భద్రాచలం ప్రయాణం.

ఈ పెళ్ళి గురించి తెలిసి పాస్టర్ వీళ్ళు చేసిన పనికి ప్రభువు క్షమించదని, క్రైస్తవ పిల్ల హిందువును చేసుకోవటం అన్యాయమని, చేసిన వారికి కూడా పాపమని అంటాడు. ఆడది ఒక మగాడి మీద మనసు పడిందంటే అది ఎంతకైనా తెగిస్తుందని మతం, కులం ఆగదని ఒకరంటారు. హిందువులు మనుషులు కారా? కష్టపడి పని చేసుకొని బతికే వాళ్ళకి మతం, కులం పట్టింపు ఎందుకని, మంచి, చెడు చూచుకోవాలని జానయ్య వాదన. మరొకరు హిందువులు మూర్ఖులని విగ్రహాన్ని పూజ చేస్తారు. వాళ్ళకు కులాలున్నాయి. క్రైస్తవులందరం ఒకటే. అందరం సోదరులం అంటారు. క్రిస్టియన్‌లో కేథలిక్కులూ, ప్రొటస్టెంట్‌లు పెళ్లి చేసుకోరని మంచి అన్ని చోట్లా ఉంటుంది, చెడు అన్ని చోట్లా ఉంటుంది అని జానయ్య మొండికేస్తాడు.

దాసయ్య కొడుకా అని ఆశ్చర్యం పడుతూ క్రైస్తవులని మళ్ళీ హిందువులలో కలుపుతున్నారని కేసు పెడదామని చాలా వాదోపవాదాలు జరుపుతారు. దాసయ్య మనలాంటి మనిషి కాదని, గొప్ప జ్ఞాని, మనిషిని మనిషిగా చూడాలి గాని మత మెందుకన్నాడని జానయ్య ప్రశంసిస్తాడు.

దాసయ్య కొడుకు పెళ్ళికి బోలెడు ఖర్చు పెట్టి చేస్తాడు. వాళ్ళ ఊరి పంతులు(బ్రాహ్మణులు) గారి అబ్బాయి ఇంట్లో (బొంబాయి) కాపురం పెడ్తారు.

బ్రాహ్మణులు వీళ్ళను ఇంట్లో పెట్టుకోవటం ఏంటని సరోజనమ్మకి ఆశ్చర్యం. చదువుకున్న బ్రాహ్మణులకు అలాంటి పట్టింపులు ఉండవని, సరిగా చదువుకోని వాళ్ళకే మూర్ఖత్వం అంటాడు జానయ్య. సరోజనమ్మ మాత్రం ఏది నిత్యం ధనం తప్ప అనే ధోరణితో మాట్లాడుతుంది. బాలస్వామి, రాజమ్మ నెల రోజులు వాళ్ళింట్లోనే రాధాకృష్ణ, తండ్రి వెంకట్రావు, మనోహరమ్మ) ఉండి, తర్వాత వాళ్ళకు నచ్చజెప్పి వేరే వంట ఏర్పాటు. బియ్యం బదులు రొట్టెలు, శాకాహారం తిండిలో మార్పు చోటు చేసుకున్నాయి. బాలస్వామికి ఓడల కంపెనీలో ఉద్యోగం. రాధమ్మ అభిప్రాయం ఎవరైనా శ్రద్ధగా కృషి చేస్తే పైకి వస్తారు. ఈ కులం ఆ కులం అని లేదు. హరిజనుడు రామస్వామి బొంబాయిలో ఉద్యోగం సంపాదించాడని, బోయి భీమన్న మంచి స్నేహితుడని వాళ్ళలో చాలామందికంటే మెరుగైన వాడని అంటుంది. బ్రాహ్మణులలో కూడా వెదవలున్నారని, (డి.నిగమశర్మ అక్క), చదువుకీ, కులానికి ఏమీ సంబంధం లేదు. చాలా కాలం వృత్తి పనుల వల్ల చదువులోకి రాలేదు. చదువురాని మా సన్నాసులు చెప్పులు కుట్టడం నేర్పచ్చు. చదువు మాకొక్కళ్ళకే హక్కు కాదంటుంది.

శ్రీకృష్ణ దేవరాయలు ఆముక్త మాల్యద మాలదాసరి ప్రస్తావన – విశ్వనాథ సత్యనారాయణ నవల బద్దన్న ఎంతటి గొప్పవాడు. అలా ఎందరో ఉన్నారని అనటమే కాకుండా రిజర్వేషన్‌తో చదువుకోకుండా కష్టపడకుండా పైకెక్కి కూర్చోవాలనుకోవటం బాగుండదంటుంది. విజయవాడ దుర్గా కళామందిర్, మాయాబజార్, సావిత్రి, మిస్సమ్మ, రాజమ్మ ఇష్టాలు. కపిళేశ్వరపురంలో బాలస్వామి చిన్నమ్మ దగ్గర తమ్ముడు ఉంటాడు. తల్లి పోవటం వల్ల ఆమె పెంచుతుంది ఉయ్యూరు రామస్వామి ప్రస్తావన పెద్దాసుపత్రి ఉంది.

క్రైస్తవులకు బట్టల పిచ్చి. హిందువులకి నగల పిచ్చి. గాంధీ గారు ఆ ఊరు సందర్శించింది. ఆడపిల్లలు గుంటూర్‌లో చదివింది. చిగురుపాటి రంగయ్య గారి మనవరాలి పెళ్ళికి కవి సమ్మేనం. సీతా అనసూయల పాట కచేరీ ప్రస్తావన. చిన్నత్త చెప్పిన విషయాలు. పాస్టర్ సుందరం క్రైస్తవ మతం నుండి వెలేశాము అంటే రాజమ్మ నేను అక్కరలేదని వెళితే మీరు వెలేశేదేమిటి అంటుంది. కృష్ణా జిల్లా కపిలేశ్వరపురం పెద్ద జమీందారీ గ్రామం, జమిందారీ రద్దయి రైత్వారీ పద్ధతి కిందికి వచ్చింది. కపిలేశ్వర గజపతి శ్రీకాకుళం వెడుతూ విడిది చేయటం వల్ల గ్రామం వెలిసింది. పేరు మీద కపిలేశ్వరపురం

వూరికి వచ్చింది. తూర్పు గోదావరి జిల్లా మరో కపిలేశ్వరపురం ఉంది. గాంధీ దర్శించటం ప్రతి ఇంట రాట్నాలు, ఖద్దరు ధారణ, కొల్లిపర సూరయ్య జైలుకెళ్ళటం. తాతినేని తాతయ్య చౌదరి (అల్లావుద్దీన్ వేషం వేసిన వ్యక్తి) ఇద్దరు సినిమా డైరక్టర్స్, ఒకరు సంగీత దర్శకులు తాతినేని చలపతిరావు, తాతినేని ప్రకాశరావు, రామారావు అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య కాంగ్రెస్ పవర్ తగ్గుతుందని బాధ కమ్యూనిస్టు ఉద్యమం ముమ్మరం యువత చేరటం, బుర్రకథలు చెప్పటం, మా భూమి, ముందడుగు నాటకాలు ఎన్నోసార్లు ప్రదర్శన.

ఉయ్యూరు పంచదార మిల్లు పారిశ్రామికంగా పెరగటం, ఉయ్యూరు ప్రాధాన్యత పెరిగి, కపిలేశ్వరం పేరు మరుగున. రేగుపల్లు అమ్మిన నాగమ్మ, పాలు పెరుగు అమ్మిన గొల్ల భాస్కరి మొదలగు కనుమరుగై చవకబారు రాజకీయాలూ స్వార్థం పెరిగాయి. దసరా పండుగ విశేషాల ప్రస్తావన – మతం, కులం పట్టింపు ఎక్కువగా ఉన్న ఆర్యుల గురించి సంకరాన్ని అంగీకరించరు. చాతుర్వర్ణ వ్యవస్థ ఆత్రవణులు అగ్నిని కాపాడుతారు, రదీష్టరులు క్షత్రములు, వక్దయులు (వ్యవసాయము) వర్తకం, హొయిటీలు (శూద్రులు), పై కులాలకు కావల్సినవి తయారు చేయటం అర్చకులకు, పురోహితులకు ఐదు తరాల వరకు వారసత్వపు హక్కు.

ఉయ్యూరులో రాజమ్మ ప్రసవం పాప తులసి (4వ తరం), మతం నుండి వెలేస్తారని రాజమ్మను ప్రసవానికి పుట్టింటికి తీసుకెళ్ళరు. బాలస్వామికి ప్రమోషన్, అప్పులు తీరటం బాగుందనుకునే సమయంలో స్వామి మతి స్థిమితం కోల్పోయి ఆస్పత్రిలో చేరి చివరికి మరణం. రాజమ్మ జీవితం పూర్తిగా అస్తవ్యస్తంగా మారుతుంది. తల్లి తండ్రి పట్టించుకోరు, జానయ్య అనారోగ్యానికి గురవుతాడు. హిందువుని పెళ్ళి చేసుకోవటం వల్లనే ఇలా జరిగిందని సూటిపోటి మాటలు, కూలికి పిలవక పోవటం తల్లి ఒక దుర్బుద్ధితోనే ఓ ఫ్యాక్టరీలో పని కుదర్చటం. మేస్త్రీ జానుకోటయ్య రాజమ్మ మీద అత్యాచారం, తల్లి అతనికి రూ.200/– బాకీ వున్నానని అతన్నే పెళ్ళి చేసుకొమ్మని అంట గడ్తుంది. తల్లి జాన్ కోటయ్య నుంచి ఋణ విముక్తురాలు కావటం. జాన్ కోటయ్య రాజమ్మను తాగొచ్చి విపరీతంగా కొట్టటం, అతని వల్ల ఒక అమ్మాయి, ఇద్దరబ్బాయిలు, విగ్రహాల దొంగతనం, వడ్డీ వ్యాపారం, రౌడీ డబ్బున్న వాటిని మతం ఏం చెయ్యదు. అమాయకులను మతం పేరిట కూలి డబ్బులు దోచుకోవటం, మతం పేరుతో మతాధికారుల దోపిడీ. ఎంత మందిని మతంలో చేర్చామా ? అనే ఆలోచనే తప్ప ఎంత మందిని ఉద్ధరించామనే ఆలోచనే లేదు. ఏ మతం లేదు, కులం లేదు, ఎవరింటికి రానివ్వరు. బాధ చెప్పడానికి గుడి, చర్చ వెళ్ళలేని స్థితి.

ధర్మాన్ని నల్గురికి చెబుతూ బతికే నీతి తప్పిన ధర్మాధికారి తండ్రి, ఎంతసేపూ మొగుడు కావాలని వెంపర్లాడే ఆడదానికి పుట్టినదాన్ని రాజమ్మ అనుకోవటం. తులసి 5 సంవత్సరాల హిందూ సంప్రదాయం అబ్బింది. జోసిఫిన్ రెండు సంవత్సరాల కొడుకు జీవా మరో అబ్బాయి. జాన్ కోటయ్య వేషం మార్చి సినిమా డిస్ట్రిబ్యూషన్ ఆఫీస్ పెట్టి ఏసుపాదంని మేనేజర్‌గా ప్రకటించాడు. డేనియల్, రత్నం, అబ్రహం విజయవాడ గాంధీనగర్‌ల సినిమా వ్యాపారానికి కేంద్రం. అక్కడ ఇల్లు అద్దెకు సంపాదించి రంగులు వేయించి పెద్ద దందా నడపటం. విగ్రహాల దొంగతనం, ఈ వ్యాపారం బయటపడి పోలీసులు వెతకటం జాన్‌కోటయ్య తప్పించుకొని పత్తా లేకుండా పోవటం. ఆ దందా నడిచినన్ని రోజులు రాజమ్మ గురించి పట్టించుకోరు తల్లి తండ్రి, వాళ్ళు మాత్రం జల్సా చేస్తారు. రాజమ్మ నల్గురు పిల్లలు జాన్ కోటయ్య పత్తాలేకుండా పోవడంతో సాయబు వెంటపడి తిండీ, గుడ్డ పెడ్తానని నమ్మించి లొంగదీసుకుని రాజమ్మ మస్తానుతో మరొక పేటలో ఉండాలని వెళ్ళింది ఇరుగు (బందరు దగ్గర గూడురు) పొరుగు రాజమ్మనే తిడ్తారు.

బాలస్వామితో ఉన్నప్పుడు కలిగిన సుఖం ఇక రాదని స్వానుభవం రాజమ్మకు వయస్సుతో పాటు ధైర్యం మొండితనం కూడా హెచ్చాయి. మస్తాన్‌కి కలిగిన ఆర్థిక బాధల వల్ల తాగి పెళ్ళాం మీది కోపం రాజమ్మ మీద తీర్చుకుంటుంటాడు. తర్వాత బతిమిలాడటం రాజమ్మ సరిపెట్టుకోవటం. ఆడది తనకు మగవాడు రక్షణ ఇస్తున్నాడనే భావంతో ఎన్ని అఘాయిత్యాలనైనా భరిస్తుందని తానే ఆశ్చర్యపడేది. కేవలం యితరుల భారినుండి తన శరీరాన్ని రక్షించుకోవడానికి ఎంత బానిసత్వానికి ఒడిగడుతోంది ఆడది బాలస్వామి మాటలు గుర్తుకు తెచ్చుకుంటుంది. ఆడదాని విషయంలో క్వీన్ విక్టోరియా దగ్గర్నుండి మాచాలు రాజమ్మ వరకు ఒకడే. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యానికి రాణి. రాత్రిపూట గదిలో చావబాదేవాడు. సంపాదించే ఆడవాళ్ళు జీతం మొగుని చేతిలో పోసి దెబ్బలు తినటం ఎందుకు ?

ఏ మతమైనా దైవమొక్కటే రాజమ్మ సొసైటీ దృష్టిలో వ్యభిచారి కావటం, సంసారం చేసుకునే మధ్య తరగతి యువతి పాచిపని రాజమ్మగా మారటం కారణం మానవత్వం అయిన క్రూరత్వం అని సామాజిక స్పృహ గలవాళ్ళు అనుకోవచ్చును కానీ, పనికి మాలిన మతం, కుళ్ళిన కులం, స్వార్థం అని నిస్సంశయంగా చెప్పవచ్చు. మస్తాన్ తన్నులు తట్టుకోలేక పాచిపని చేసి తెచ్చిన డబ్బులు కూడా చేతిలో పెట్టాల్సిన పరిస్థితి. దాంతో పని కోసం ఇంకో ఇల్లు అదనంగా చేసుకుంటుంది. పీటర్ చూడటానికి పెద్ద మనిషిలాగా కనిపిస్తాడు. భార్య మీద అనుమానంతో విపరీతంగా హింసిస్తాడు. నర్సు విక్టోరియా పని చదువుకుంది సంపాదిస్తుంది హింస తప్పదు.

రాజమ్మ నర్సు ఇంట్లో ఎక్కువ సమయం ఉంటుందని

అనుమానం పెంచుకుంటాడు. పీటరు కూడా రాజమ్మ ఆర్థిక పరిస్థితి గమనించి డబ్బు ఆశచూపి లొంగదీసుకుంటాడు. ఆ డబ్బు కూడా మస్తాన్‌కే చెందుతుంది. చనిపోవాలనుకున్న నర్సుకి రాజమ్మ వేదాంతం బోధిస్తుంది. పిల్లల కోసం నీతిని కులాన్ని విడిచానని అంటుంది. నర్సు విక్టోరియా పెట్టిన ఆహార పదార్థాలు పిల్లలకని రాజమ్మ తెస్తే వాటిని కూడా మస్తాన్‌కే చెందుతాయి, లేకపోతే చితకబాదడం. పీటర్ రాజమ్మను లొంగదీసుకున్న విషయం తెలిసినా, రాజమ్మ చెప్పిన మాటలతో నర్సును కొట్టటం మానేస్తాడు. దాంతో పీటర్ ప్రవర్తనలో మార్పుకు సంతోషిస్తుంది. రాజమ్మను ఏమి అనదు, ఒకే మతం ఒక కారణం. రాజమ్మకి మతం అంటూ ఏదీ లేక పోయినా జీసస్ మీద నమ్మకం, భక్తి వుంది. దాంతో నర్సుకి పీటర్ విషయం చెబుతుంది. నర్సు అర్థం చేసుకుని రాజమ్మను ఏమీ అనదు. రాజమ్మ మూలంగా ధైర్యం తెచ్చుకొని భర్తకు ఎదురుగా నిలబడ గలిగింది. పీటర్ ప్రవర్తన మారటం, బదిలీ చేయించుకొని ఆ కుటుంబం వెళ్ళిపోతుంది.

రాజమ్మ మళ్ళీ ఇల్లు వెతకటం అలాంటి రోజుల్లో రాధమ్మ ఇల్లు దొరికింది, 1952 జనరల్ ఎన్నికలు రావటం, రాధమ్మ, రాజమ్మ కాంగ్రెస్ పక్షం. ఇందిర ఓడటం జనతా ప్రభుత్వం రావటం. హరిజనుల్ని, బీద బిక్కిని చంపేస్తారని రాజమ్మ ఏడ్వ టం, రాధమ్మ మొగుడు ఏ పని మనిషి లొంగ తీసుకోకుండా ఊరుకోలేదు. రాధమ్మ సంపాదనంతా నాశనం చేస్తుంటాడు. అలాగే రాజమ్మను వదలడు. మస్తాన్ నుంచి ఆదాయం లేకపో వటం పిల్లల ఆకలి తీరుతుందని ఒప్పుకుంటుంది రాజమ్మ, దాంతో వదలక జోసఫ్ వెంటపడ్డాడు మస్తాన్‌ని వదిలి రాధమ్మ మొగున్ని పట్టుకొని క్రమంగా ఇంట్లో ఆధిపత్యం సంపాదిం చింది. ఊరి నుండి వచ్చిన రాధమ్మకి మొగుడి రాసలీలలు తెలుస్తాయి, రాజమ్మను నిలదీసి అడగటం.

రాజమ్మ బతుకు ఇలా కావడానికి కారణం కించిత్తు ఆలోచించే వాళ్ళు లేరు. మతం లేదు, మొగుడు లేడు, ఎవడు నీడనిచ్చి అండగా వుంటే ఆ నాటికి మొగుడవుతున్నాడు. రాజమ్మ పూర్తిగా మారిపోవటం పాప పుణ్యాల భయం పోయి ఏదోలా సంపాదించి సరదాగా గడపాలనే వాంఛ. సినిమాలు చూడాలనే కోరిక, దాంతో అబద్ధాలు, అన్నం, కూర పెట్టించిన గిన్నెలు కూడా తాకట్టు పెట్టడం ప్రారంభించింది.

రాజమ్మ ఆకలి దరిద్రం మూలంగా మరీ విచ్చలవిడి అయ్యారని, ఈ దౌర్భాగ్యం రాజమ్మతో ఆగదు కూతురు, మనవరాలు ఆ వరస అలా అంతే. మతం పోయింది, సంఘర్షణ కావాలి, మగవాడి కోసం ఆశపడ్తుంది, సెక్స్ కోసం కాదు అని రాధమ్మ మదనపడ్తుంది. కానీ రాజమ్మ గురించి సీరియస్‌గా ఆలోచించలేదు. సినిమాలకు తెగపోతూనే ఉన్నారు. చిన్నాయన చనిపోయాడు, తల్లి గుడివాడ పోతూనే ఉంది, తండ్రికి పని లేదు. మేరీమాత తిరునాళ్ళకి వెళ్ళాలని రాధమ్మను డబ్బులు అడుగుతుంది, నిన్ను రానివ్వరంటే అమ్మా నాన్న ప్రొడెస్టెండులు నాకు పట్టింపు లేదని ప్రభువు, రామున్ని, అల్లాను పూజిస్తాను. ఏ దవుడైనా సరే ఇలాంటి ఎదవ జన్మ ఇవ్వకుండా ప్రార్థన చేస్తాను "కరుణామయుడు" సినిమా కెళ్తానని ఏది నిత్యం అంటుంది రాజమ్మ.

అవును దైవం నిత్యం కాదు, మతం, కులం, నీతి, అవినీతి, ప్రేమ ఏవీ నిత్యం కావు, కామం అసలే కాదు. నిన్న, నేడు, రేపు నిత్యం కాదు ఆశలొకటే నిత్యం అంటుంది రాధమ్మ. అవును అంది రాజమ్మ అయితే రాధమ్మ సినిమాలు తగ్గించమనగానే ఆనందం నిత్యం కాదా అంటుంది రాజమ్మ, కాదు అనగానే అయితే ఏది నిత్యం ? ఆడదాని అవ్యక్తత, ఆడదాని ఆకలి అని నవల ముగుస్తుంది. కులం, మతం ఏమిటి? సమాజంలో సభ్యతగా జీవించడానికి, ఆకలి తీర్చుకోవ డానికి అవి ఎంత వరకూ ఉపయోగపడుతున్నాయి. మగవాడు ఎన్ని బాధలు పెట్టినా? సంఘం రకరకాలుగా అవమానించినా కర్మ అని సరి పెట్టుకునే ఆడవాళ్ళకి ఎన్నడు సముచిత స్థానం లభిస్తుంది. కుల మతాల పేరుతో తరతరాలుగా జరుగుతున్న దుర్మార్గాన్ని కళ్ళకు కట్టి, సమాజంలో ప్రతి ఒక్కరిని నిలదీసే నవల "ఏది నిత్యం" ? ❑

# పధ్నాలుగు తోడేళ్ల కథ

**(31వ పేజీ తరువాయి)**

కాబట్టి వాటిని చంపేయడం న్యాయంగా కనిపిస్తున్నా.. ప్రకృతిలో దేనికది సక్రమంగా అమరి ఉంది. మనిషి తన అతి మానవత్వంతో తుపాకీలను చేత బట్టుకుని దుష్టశిక్షణ శిష్టరక్షణ అని ఓవరాక్షన్ చేయనవసరం లేదని ఈ కథ చెబుతోంది. ధనవంతులు సరదాగా చేసే వేట trophy hunting ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో తెలుపుతుంది. ఈ కథను మరింత సరళంగా చిన్నపిల్లలకు అందమైన బొమ్మల రూపంలో ఇంగ్లీషులో ఎన్నో పుస్తకాలు వచ్చాయి. తెలుగులో ఎవరైనా డ్రాయింగ్ వేసి కథలా రాస్తేట్టైతే మనం తలా ఒకింత వేసుకుని ప్రింటింగ్ చేయించవచ్చు. స్కూలు పిల్లలకు అడవి ecosystem ఎలా పనిచేస్తుందో అడవులను మనం ఎందుకు కాపాడు కోవాలో చెప్పవచ్చు. ఎవరైనా స్మగ్లర్లు కలప ఎత్తుకుపోతుంటేనో లేక అడవులలోని వనరులను మెక్కేస్తుంటేనో అరేయ్ వాళ్ళు మనుషులే కాదురా తోడేళ్ళురా గుంట నక్కలురా అని నంగి మాటలు చెబుతుంటాం. కానీ తోడేళ్ళు అడవిని కాపాడినంతగా మనుషులు కాపాడుతున్నట్టా. మనిషికి అడవుల మీద వాటి వనరుల మీద మాత్రమే చింత. మిగితా మానవత్వం మన్ను మశానం హంబక్ కదూ. ❑

# ఆయన జీవితమే ఒక సందేశం !


**గదర్ వీరుడు దరిశి చెంచయ్య !!.. (అమూల్య వ్యాస సంకలనం)**



– గౌరవ్

'స్వేచ్ఛాస్వాతంత్ర్య సమర శంఖారావం
బానిస బంధాలు త్రెంచు రణన్నినాదం
దరిశి చెంచయ మ్రోగించిన ఢంకానాదం
భరతఖండమంత వినిపించిన గదర్ నినాదం'
– నూకతోటి కోటయ్య

పాతకొత్తవి కలిపి మొత్తం ముప్పై ఐదు పైచిలుకు వ్యాసాలు. మూడు స్వీయానుభవ కథలు. నూరుకు పైబడ్డ ఫొటోలు. యాభై పుటలకు మించిన పరిశోధన వ్యాసం. వెరసి ఆరు విభాగాలతో 240 పేజీల 'ఆయన జీవితమే ఒక సందేశం' వ్యాస సంకలనం పుస్తకం ! ఏడాదికి పైగా పడ్డ శ్రమ. తెలుగు సమాజం చాలా కాలం తర్వాత దరిశి చెంచయ్యకు సగర్వంగా సమర్పించిన అపు రూపమైన అక్షర నీరాజనం. సమగ్రమని చెప్పను కానీ మహత్తర గదర్ మహోద్యమం గురించి యావత్ దక్షిణాదిలోనే విశిష్టమైన ప్రయత్నం !




అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములుకు అంకితం ఇచ్చిన ఈ గ్రంథం రూపొందడంలో కోల్‌కతా ముందడుగు ప్రకాశ్, బాలాజీ మొదలు కాకినాడ కల్చరల్ సొసైటీ కృష్ణారావు, భారతలక్ష్మి వరకూ, మండపేట సంగమం డా.రవికుమార్ నుంచి విశాఖపట్నం జేవీవీ నేత డా.రమేష్ దాకా.. మాతృక సంపాదకులు రమాసుందరి, అడుగుజాడ సంపాదకులు రవికాంత్, చెంచయ్య కోసం ప్రేమ గా ప్రత్యేక సంచిక వేసిన ప్రజాపత్రిక సుదర్శన్, వీక్షణం వేణుగోపాల్, దారిదీపం సోమసుందర్ ప్రత్యక్షంగా పరోక్షంగా సహకారం అందించిన ఆత్మీయులెందరో ! డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ(రామచంద్రాపురం), సెంటర్ ఫర్ సోషల్ డైలాగ్ (హైదరాబాద్), జన విజ్ఞాన వేదిక(కర్నూలు) చార్వాకాశ్రమం (గుంటూరు), అందరూ బావుండాలి (తెనాలి) సంస్థలు పుస్తక ఆవిష్కరణ, పరిచయానికి పూనుకు న్నాయ్ !

ఈ మొత్తం క్రమాన్ని నడిపించింది మాత్రం అసాధారణమైన చెంచయ్య జీవితంలోని అవిస్మ రణీయ సౌరభం. అసామాన్యమైన ఆయన వ్యక్తి త్వంలోని అజేయమైన గౌరవం. అది ఊరకనే తెచ్చి పెట్టుకుంటే వచ్చేది కాదు. వద్దని తప్పు కుంటే జారుకునేదీ కాదు ! అలా జనం కోసం పనిచేసే వారి బలమేంటో చెంచయ్య గారి మాటల్లోనే చెప్పాలంటే, 'ఒక మహత్తర ఆశయం కోసం చావుకైనా సిద్ధపడ్డవాళ్ళు, అలా సిద్ధప డని వాళ్ళకన్నా శత విధాల బలవంతులు.' (ఆసక్తి ఉన్న వారికి సాఫ్ట్ కాపీ పంపుతున్నాను. దీనికి ధరేమీ లేదు. అమూల్యం. అవకాశం ఉండీ ఉచితంగా తీసుకోవడానికి ఇష్టపడని వారు సౌలభ్యం కొద్దీ సహకారం అందించడానికి ముందుకు వస్తే సంతోషం. విమర్శలకు ఆహ్వానం ! ❑

# సమాజాన్ని మార్చే ప్రయోగం

**(మిగతా 30వ పేజీలో)**

అప్పుడే వారి దృష్టికోణంలో సంకుచిత్వం ఉండదు." మన దేశంలో కావచ్చు.. ప్రపంచంలో ఇతర దేశాల్లో కావచ్చు.. నియంతలందరూ... 'పూండ్స్'కు రూపాలే. మత విద్వేషాలు, ఘర్షణలు మన దగ్గర మాత్రమే జరుగుతున్నాయా? ఎన్ని చోట్ల జరగటం లేదు? ఈ 'పూండ్స్' అప్పుడైనా, ఇప్పుడైనా ఒకటే కదా! దాడులు జరుగుతున్నది మహిళలు, అణగారిన ప్రజల మీదే కదా! 'పూండ్స్' అనగానే కొందరు స్పందిస్తున్నారు. అంటే వారికి ఎక్కడో బాధ కలిగినట్లే కదా! మన దేశంలోని మణిపూర్‌లో ఒక మహిళపై అత్యాచారం జరిగితే... దాని గురించి మాట్లాడటానికి 100 రోజులు పడితే, వెళ్లి స్వాంతన చేకూర్చలేని పరిస్థితులు ఉంటే ఏం చేయాలి? దేశవిభజన సమయంలో కొందరు దేశం విడిచి వెళ్లిపోతుంటే – గాంధీజీ వాళ్ల దగ్గరకు వెళ్లి – 'నన్ను క్షమించండి. నేను ఈ దారుణాలను అరికట్టలేకపోయా. మీరు వెళ్లద్దు.. మీతోపాటు నేనూ ఉంటా' అన్నారట. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు కదా! ❑

**(ఆంధ్రజ్యోతి నవ్య పేజి నుండి సేకరణ)**


# చరిత్ర మరచిన చిత్తరువు

## పుస్తక పరిచయం



**మాజీ ఎంపీ, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి**

కామ్రేడ్ పడాల శ్యామ్‌సుందర్‌రావు జీవితచరిత్ర తప్పక చదవలసిన పుస్తకం. డాక్టర్ గుఱ్ఱం సీతారాములు, డాక్టర్ పడాల సమతా రోష్ని సంపాదకులుగా ఈ పుస్తకం ఈ మధ్యనే వెలువడింది. శ్యామ్ సుందరరావు బర్మా కాందిశీకుల కుటుంబం నుండి అనేక కష్టాలు, ప్రమాదాలు ఎదుర్కొని, నెలల తరబడి నడిచి దారిలో కొందరు అప్తులను కోల్పోయి, ఆఖరుకు పశ్చిమగోదావరి జిల్లాలో వారి పూర్వీకుల గ్రామం చేరుకున్నారు. వారి తాతగారు ఐచ్ఛికంగా తన స్వంత కులాన్ని వదిలేసి, దళిత మహిళను వివాహం చేసుకొని, దళితవాడలో నివసించి, దళితుడిగా మారిన సంస్కర్త. ఆయన పేరు వీరాస్వామి. ఆయన కుమారుడు రామస్వామి. రామస్వామి కుమారుడు శ్యామ్‌సుందరరావు. వీరాస్వామి బర్మాకు వలస వెళ్ళారు. తండ్రిని తిరిగి తీసుకు వచ్చేందుకు వెళ్లిన రామస్వామి కూడా బర్మాలోనే సెటిల్ అయ్యారు. భూములు, ఆస్తులు సంపాదించుకున్నాడు. ఆ కాలంలో చాలామంది తెలుగువాళ్లు, బర్మాకు వలస వెళ్లేవారు. ఒక అంచనాప్రకారం దాదాపు లక్షా యాభై వేల మంది తెలుగువారు బర్మాలో ఉండేవారు. 1947లో బర్మా వారు భారతీయులందరిని కట్టుబట్టలతో వెళ్లగొడితే, రామస్వామి, శ్యామ్ సుందరరావు మరొక పది మంది పనివారితో బర్మా నుండి బయలుదేరి అడవుల నుండి నడిచి, దారిలో పది మందిని కోల్పోయి, తండ్రి కొడుకు ఆరు నెలలకు నర్సాపురం చేరుకున్నారు. భయంకరమైన ప్రయాణం. 14 ఏళ్ల వయసున్న శ్యామ్‌సుందర్‌రావుకు బర్మీస్, ఇంగ్లీషు తప్ప వేరే భాషలు రావు. పాఠశాలలో తెలుగు భాష రానందున ప్రవేశం లేదు. పశువులు కాసి జీవనం కొనసాగించారు. తర్వాత ఆల్లు రామలింగయ్య ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలిలో చేరి, కమ్యూనిస్టు పార్టీలో చేరారు. పార్టీ నిషేధానికి గురైనప్పుడు రహస్య జీవితం గడిపారు. అనేక ప్రమాదాలు ఎదుర్కొన్నారు. పార్టీని విస్తృతం చేసాడు. అతి చిన్న వయసులో 24 సంవత్సరాల వయసులో పార్టీ తరపున ఎం.ఎల్.ఎ.గా ఎన్నికయ్యారు. రెండోసారి కూడా ఎన్నికయ్యారు. ఒక గుడిసెలో జీవితం ప్రారంభించి, ఎం.ఎల్.ఎ.గా ఐన తర్వాత ఆ తర్వాత కూడా ఆ గుడిసెలో ఉండి మరణించారు. శాసనసభలో శ్రమ జీవులవాణి సమర్థవంతంగా వినిపించారు. ఆదర్శ కమ్యూనిస్టుగా జీవితాంతం గడిపారు. ఆయన జీవితచరిత్ర వివరాలను సంపాదకులు చాలా కష్టపడి సేకరించారు. ఆదర్శ జీవనం ఆయనది. ఆఖరి రోజుల్లో కొన్ని అభిప్రాయ భేదాల వల్ల ఆయన పార్టీ నుండి దూరం కావటం విషాదకరం. ఐతే ఆయన ఏ ఇతర పార్టీలో చేరలేదు. తప్పక చదవలసిన పుస్తకం.




**పుస్తకం కావలసినవారు డాక్టర్ సమతారోష్నిని 83338 39439కు సంప్రదించవచ్చు.**

# నరసాపురంలో పుస్తకావిష్కరణ

నీతి నిజాయితీలతో, నిబద్ధతతో ప్రజా జీవితంలో కొనసాగిన అమరజీవి కామ్రేడ్ పడాల శ్యామసుందరరావు జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు ! నరసాపురం, ఆచంట అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి రెండుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికైన సీపీఐ నేత, శ్యామసుందరరావు జీవితచరిత్ర 'చరిత్ర మరిచిన చిత్తరువు' పుస్తకావిష్కరణ ఆగస్టు 19న ఘనంగా జరిగింది.

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వైఎన్ కళాశాల పీజీ సెంటర్‌లో జరిగిన సభకు సీపీఐ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. శ్యామసుందరరావు పెద్ద కుమార్తె డాక్టర్ సమతా రోష్ని స్వాగతం పలికారు. సమతా రోష్ని, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ గుర్రం సీతారాములు సంపాదకత్వంలో వెలువడిన పుస్తకాన్ని మార్క్సిస్టు మేధావి, ప్రముఖ సామాజికవేత్త 'దారిదీపం' మాసపత్రిక సంపాదకుడు డీవీవీఎస్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ నానాటికీ విలువలు కోల్పోతున్న నేటి సమాజంలో నిజాయితీ, నిబద్ధత కలిగిన పడాల శ్యామసుందర రావు వంటి మహనీయుల త్యాగాలను, ఆదర్శాలను వెలుగులోకి తీసుకు




రావాలన్నారు. వర్తమానం చీకటిలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో మంచి భవిష్యత్తు వైపు సమాజం పయనించాలంటే గత చరిత్ర తెలియాల్సిన అవసరం ఉందన్నారు. శ్యామసుందర రావు ఎంతో ఉత్తముడైన నాయకుడని, అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా చెప్పడం ఆయనకు అలవాటని అన్నారు. ఒక పరిశోధనకు పనికొచ్చే బహుముఖ వ్యక్తిత్వం ఆయనలో ఉందన్నారు. మన సమాజంలో చరిత్ర గురించిన తగిన స్పృహ లేకపోవడంతో కమ్యూనిస్టు ఉద్యమానికే కాక స్థానిక చరిత్రలకు ఆధారాలు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా స్థానిక చరిత్రలను, విలువలు కలిగిన నేతల జీవితాలను వెలుగులోకి తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. సమతా రోష్ని, గుర్రం సీతారాములు ప్రయత్నం అభినందనీయమని అన్నారు.

వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ తన బాల్యంలోనే పడాల శ్యామసుందరరావు కృషి గురించి విన్నానన్నారు. నాటి సబ్ కలెక్టర్ బంగ్లాను, స్థలాన్ని వైఎన్ కళాశాలకు అప్పగించాలని కోరుతూ శ్యామసుందరరావు గట్టి కృషి చేశారని, పర్యవసానంగా తమ కళాశాలకు విశాలమైన స్థలం సమకూరిందని, అందువల్లనే నేడు తమ కళాశాల అభివృద్ధిపథంలో నడుస్తున్నదని తెలిపారు.

మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ పడాల శ్యామసుందరరావు గారి కుటుంబంతో తనకు బాల్యం నుండి ఎంతో అనుబంధం ఉందని, వారి పిల్లలతో కలిసి విద్యాభ్యాసం చేశానన్నారు. శ్యామసుందరరావు సతీమణి శ్రీమతి కాంతమ్మ తన ఉపాధ్యాయురాలని, ఆమె ప్రోత్సాహంతో చిన్నతనంలోనే తాను వక్తగా, కార్యకర్తగా రూపొందానని గుర్తు చేసుకున్నారు. కాంతమ్మ ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడటం తనకు బాగా గుర్తుందని చెప్పారు. ఆమె ఉద్యమస్ఫూర్తి నుండి తాను ఎంతో ఉత్తేజం పొందానని అన్నారు. పడాల శ్యామసుందరరావు ఆదర్శప్రాయుడని, ఎంతో నిరాడంబర జీవనం సాగించారని కొనియాడారు. పడాల శాసనసభా కార్యకలాపాల వివరాలు చూస్తే వారికి శాసన వ్యవహారాలపై గల అవగాహన వెల్లడి అవుతుందని అన్నారు. ప్రస్తుతం సభా కార్యకలాపాలు సవ్యంగా జరగకపోవడం అందరూ చూస్తున్నదేనన్నారు. శ్యామసుందర రావును నేటి ప్రజా ప్రతినిధులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పుస్తకాన్ని ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ సమీక్షించారు. బర్మా కాందిశీకునిగా, పశువుల కాపరిగా, ప్రజా నాట్య మండలి కళాకారునిగా, కమ్యూనిస్టు అజ్ఞాతవాస కార్యకర్తగా, ఎమ్మెల్యేగా, కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా బహు ముఖ సేవలందించిన పడాల శ్యామసుందరరావు జీవిత చరిత్ర ఇంత కాలానికి వెలువడటం అభినందనీయం అన్నారు. 1953 నవంబర్ 26న గవర్నర్‌కు అభినందనలు చెప్పే తీర్మానానికి సవరణలు ప్రతిపాదించిన శ్యామసుందరరావు నరసాపురం ప్రాంతానికి అవసరమైన ఎనిమిది ప్రధాన సమస్యలను ప్రస్తావించారని, ఈ పట్టణ సమగ్రాభివృద్ధి గురించిన వారి దూరదృష్టి అమోఘమని, ఈ పుస్తకం అలాంటి ఎన్నో అంశాలను వెలుగులోకి తెచ్చిందని వివరించారు. రాజకీయ ద్వేషాలకు, భావోద్వేగాలకు అతీతంగా చరిత్రని రాసే అలవాటు మనకు లేకపోవడం వల్ల సమాజానికి చాలా నష్టం జరిగిందని అన్నారు. ఉద్దరాజు రామం, సంకు అప్పారావు, యాళ్ళబండి పోలిశెట్టి వంటి ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు నాయకుల జీవితమూ, కృషీ వెలుగులోకి రాకుండా పోయిందన్నారు! కమ్యూనిస్టు పార్టీ తొలి పాతికేళ్ళు రహస్యంగా పనిచేయడం, ఎక్కువ మంది నాయకులు కార్యకర్తలు అజ్ఞాతవాసంలో ఉండటం, తాము చేసిన కార్యాలను వెల్లడించకుండా ఉంచడం, తమ గురించి తాము చెప్పుకునే అలవాటు లేకపోవడం వంటి కారణాల వల్ల వారి చరిత్రలు మరుగున పడిపోయాయని సోమసుందర్ అభిప్రాయపడ్డారు. దానివల్ల చరిత్రకు అన్యాయం జరిగింద న్నారు. శ్యామ సుందరరావు చరిత్ర నమూనాలో మరిన్ని చరిత్రలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. సభలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు పి.ప్రేంపావని, చరిత్ర పరిశోధకులు డా. గుర్రం సీతారాములు, రచయిత, వ్యాఖ్యాత చక్రావధానుల రెడ్డప్ప ధవేజి, **(మిగతా 38వ పేజీలో)**


# విస్తరిస్తున్న లాల్ నీల్ మైత్రి



- డీవీవీఎస్ వర్మ

**భావాలు తమంత తాముగా విస్తరించవు. వాటి విస్తరణకు ప్రచారకులు కావాలి. వారికి ఒక వేదిక ఉండాలి. అలా రూపుదిద్దుకున్నదే లాల్ - నీల్ మైత్రీ వేదిక. కొందరు వ్యక్తులతో ప్రారంభమైంది. పదులు, వందల సంఖ్యకు విస్తరించింది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో అది ఒక శక్తిగా మారింది. భావజాల వ్యాప్తికి ప్రచారకులు, వేదిక ఉంటే సరిపోదు. ఆ భావజాలానికి ఒక స్పష్టత, నిర్దిష్టత వుండాలి. అది సమాజానికి తప్పనిసరి అవసరం కూడా అయివుండాలి. అప్పుడే అది దాని అవసరమున్న తరగతుల ప్రజలను ఆకర్షిస్తుంది. వారికి ప్రాతినిధ్యం వహించే వివిధ శక్తులకు విస్తరిస్తుంది.**

మన సమాజంలో దోపిడీ వుంది. దాని నుంచి ఉత్పన్నమైన అసమానతలు, అంతరాలు, పేదరికం వున్నాయి. దీనికితోడు కుల వివక్ష వుంది. లింగ వివక్ష వుంది. మైనారిటీల పట్ల మత వివక్ష వుంది. ఏ రూపంలో వున్నా వీరంతా పేదలు. దోపిడీకి వివక్షకీ గురవుతున్న పేదలు. ఈ పేదలంతా ఐక్యం కావాలి. తమను తాము వర్గ దోపిడీ నుంచి, వివక్ష నుంచి విముక్తం చేసుకోవాలి. ఈ పేదలంతా ఐక్యం అయినప్పుడే, చైతన్య వంతులైనప్పుడే వ్యవస్థ మారుతుంది. దోపిడీ లేని, వివక్ష లేని సమాజం రూపుదిద్దుకుంటుంది. కుల రహిత, వర్గ రహిత సమాజం సాధ్యమవుతుంది. ఇందులో ఏదో ఒకటి సాధిస్తే మరొకటి మాసిపోదు. వర్గ దోపిడీ అంతమైనా కుల వివక్ష, ఇతర వివక్షలు దానంతటదే రద్దు కాదు. అలాగే వివక్ష లేని కుల రహిత సమాజం వచ్చినా అది దోపిడీని రూపుమాపదు. అందుకే కుల, వర్గ రహిత సమాజానికి జమిలి పోరాటం అవసరం. ఈ స్పష్టతతోనే లాల్ - నీల్ మైత్రీ వేదిక ఏర్పడిరది.




లాల్-నీల్ మైత్రికి ప్రతీకలుగా మార్క్స్ - అంబేద్కర్‌లను ఎంచుకుంది. ఈ భావజాలాల మధ్యగల ఎన్నో సారూప్యతలు, కొన్ని విభేదాలను గుర్తించింది. ఈ వైరుధ్యాలను మిత్ర వైరుధ్యాలుగా నిర్వచించింది. ఈ భావజాలాల మధ్య ఐక్యత, సమన్వయం సాధ్యమేనని ప్రకటించింది. దీనిని వివరించే విధాన పత్రాన్ని, పలువురు ప్రముఖులు రాసిన వ్యాసాలతో ఒక పుస్తకాన్ని విడుదల చేసింది. ఇలా ఈ భావజాల వ్యాప్తికి తప్పని సరి అవసరమైన సభ్యుల బృందాన్ని, వేదికను, విధాన పత్రాన్ని, భావజాలాన్ని వివరించే పుస్తకాన్ని సమకూర్చుకుంది. నా దృష్టిలో ఇది జయప్రదంగా సాగిన తొలిదశ. లాల్ -నీల్ మైత్రీ భావజాల వ్యాప్తికి అవసరమైన సరంజామాను రూపొందించుకున్న తొలి దశ.

ఈ విధాన పత్రం, పుస్తకం ఆవిష్కరణల సభలతో మరో దశ ప్రారంభమైంది. ఈ ఆవిష్కరణ సభలను కేవలం వేదిక సభ్యులకే పరిమితం చెయ్యకుండా వివిధ వామపక్షాల నేతలు, అంబేద్కర్, పూలే భావజాల సంస్థలు, ఇతర ప్రజా సంఘాల ప్రతినిధుల ఉమ్మడి వేదికలుగా నిర్వహించడంతో మలి దశ ప్రారంభం అయింది. ఈ వేదిక వెలుపలగల వివిధ శక్తులన్నీ లాల్ - నీల్ మైత్రి ఆవశ్యకతను గుర్తించడమే కాకుండా దీనిని సమర్ధిస్తూ ఈ సభలలో ప్రసంగాలు చేశారు. తర్వాత ఈ పార్టీలలో, సంస్థలలో ఇది ఒక చర్చనీయాంశం అయింది.

కొన్ని పార్టీలు, సంస్థలు లాల్- నీల్ ఐక్యత అవసరమంటూ సందర్భం వచ్చినప్పుడల్లా ప్రకటనలు చేస్తున్నాయి. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు తమ కార్యకలాపాలలో ఈ ప్రచారాన్ని భాగం చేశాయి. ఇలా లాల్ - నీల్ మైత్రి భావజాలం ఈ వేదిక వెలుపల అనేక సంస్థలకు విస్తరించింది. ఇది మరో ముందడుగు. ఏ శక్తుల ఐక్యత అవసరమో ఆ శక్తులు తమ గళాలను విప్పడం ఈ వేదిక సాధించిన గొప్ప విజయం.

ఇది మాత్రమే సరిపోదు. ఈ వేదిక మరో ముందడుగు సాధించడానికి ప్రయత్నాలు ప్రారంభించాలి. లాల్ నీల్ మైత్రీ నినాదం ప్రజలకు చేరాలి. వారు దీనిని తమదిగా చేసుకుని మాట్లాడడం ప్రారంభిస్తే అది ప్రజా ఉద్యమం అవుతుంది. విజయాలను సాధించి తీరుతుంది. అయితే దోపిడీకి, వివక్షకు గురవుతున్న తరగతులలో అత్యధికులు పాలక పక్షాల

రాజకీయాల ప్రభావంలో ఉన్నారు. పాలక పక్షాలు ఈ తరగతులను తమ ఓటు బ్యాంకులుగానే భావిస్తున్నాయి. వివిధ రాయితీలు, పథకాలతో వీరిలో లబ్ధిదారుల చైతన్యాన్ని పెంచి పోషిస్తున్నాయి. పేదలను తమ చుట్టూ తిరిగేలా చేసుకుంటు న్నాయి. ఈ పరిస్థితిని మార్చి తీరాలి. లబ్ధిదారుల చైతన్యం పేద ప్రజల జీవితాలను మార్చదు. ఎదుగూ బొదుగూ లేని ఒక గానుగ ఎద్దు జీవితాన్ని మాత్రమే ఇస్తుంది. వారి జీవితాలు మారాలంటే వ్యవస్థ మారాల్సిందే. అత్యధిక సంఖ్యాకులుగా వున్న పేద తరగతులను రాజ్యాధికారం వైపు నడిపించాలి. ఇదొక రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పోరాటం. దీనికి అవసరమైన ప్రాథమిక సన్నాహాలను వేదిక ప్రారంభిం చాలి. ప్రజల జీవితాలను మార్చే ప్రత్యామ్నాయ రాజకీయ కార్యక్రమాన్ని ఈ వేదిక రూపొందించుకోవాలి. అది ప్రజలకు అర్థమయ్యే భాషలో వుండాలి. వారిని ఆలోచింపజేసే నినాదాలు గా వుండాలి. ఆ తర్వాత ఈ ప్రత్యామ్నాయ భావజాలాన్ని ప్రజల దగ్గరకు తీసుకుపోయే కార్యాచరణ గురించి ఆలోచించు కోవచ్చు. ప్రస్తుతం ఈ దిశగా ముందుకు సాగడం అవసరం. ❑

# నరసాపురంలో పుస్తకావిష్కరణ

(36వ పేజీ తరువాయి)

సీపీఐ జిల్లా కార్యదర్శి కె.భీమారావు, అడ్వకేట్ కామన బాల సత్యనారాయణ (బుజ్జి), విశ్రాంత ప్రిన్సిపాల్ సంకు మనోరమ, రచయిత యర్రంశెట్టి శ్రీనివాస్, రచయిత్రి కరుణ తాయమ్మ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ, సీపీఐ ఏరియా కార్యదర్శి నెక్కంటి క్రాంతికుమార్ తదితరులు మాట్లాడుతూ శ్యామసుందరరావు జీవితాన్ని, కృషిని, ఆయన పాటించిన విలువలను కీర్తిస్తూ, ఆయన చరిత్ర చిరస్మరణీ యమైనదని పేర్కొన్నారు. శ్యామసుందరరావు కుమార్తె, గాయని మమతా నళిని తన చిన్నతనంలో తండ్రి నేర్పిన దేశభక్తి గేయాలను పాడి వినిపిం చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి కళాకారులు దేశభక్తి గీతాలను ఆలాపించారు. మమతా నళిని వందన సమర్పణ చేశారు. ఉభయ గోదావరి జిల్లాల నుండి పలువురు ప్రముఖులు, మేధావులు, కమ్యూనిస్టు కార్యకర్తలు, అభిమానులు, హాజరయ్యారు. ❑


## స్వీకారం





వెల : 150


ప్రతులకు :
డి.నిర్మల, ఫ్లాట్ నెంబరు 303,
చంద్రప్రియ రెసిడెన్సీ, ఆదిమూర్తి నగర్,
అనంతపూర్ - 515001
సెల్ : 94400 44922

వెల : 160




ప్రతులకు :
టి.రమణయ్య,
24-2-365, నీలగిరి
సంఘం, మూలపేట,
నెల్లూరు - 524 003
సెల్ నెంబరు :
94912 39884




వెల : 150

ప్రతులకు :
బి.లలితానంద ప్రసాద్,
(రిటైర్డ్ ప్రొఫెసర్),
12-24, సృజన రథశాల
స్ట్రీట్, దుగ్గిరాల - 522
330, ఏపీ


# కమ్యూనిస్టు ప్రణాళిక - కొన్ని ముఖ్యాంశాలు

-

కారల్ మార్క్స్, ఏంగెల్స్‌లు యంగ్ కమ్యూనిస్టు లీగ్ ఆదేశం మేరకు 1848లో రాసిన ప్రపంచం పై అత్యధిక ప్రభావం చూపిన 23 పేజీలతో కూడిన, అత్యధిక భాషలలో అత్యధిక కాపీలు ముద్రించబడిన మహోన్నత గ్రంథం. గతితార్కిక నియమాలను అత్యంత ప్రతిభావంతంగా అన్వయించి, మానవ సమాజ పరిణామాన్ని, కార్మికవర్గ కర్తవ్యాన్ని మార్క్స్, ఎంగెల్స్ ఈ గ్రంథంలో వివరించారు. అప్పటికి వారి వయసు మార్క్స్‌కు 29 సంవత్సరాలు, ఏంగెల్సుకు 28 సంవత్సరాలు మాత్రమే. వివిధ అంశాలపై ఈ గ్రంథంలో వెల్లడించిన భావాలు మార్క్స్, ఎంగెల్స్‌ల వ్యక్తిగత అభిప్రాయాలు కావు. తమ అధ్యయనం, పరిశీలనలో వచ్చిన శాస్త్రీయ నిర్ధారణలు, అవి నేటికీ సజీవంగా ఉండటమే ఇందుకు తార్కాణం. క్లుప్తంగా ఆ నిర్ధారణలు ఇవీ..

## పెట్టుబడిదారీ విధాన విశ్లేషణ

- **1.రాజ్యాంగ యంత్రం :** ఆధునిక రాజ్యంలో ప్రభుత్వమనేది మొత్తం బూర్జువా వర్గపు సమష్టి వ్యవహారాలు చక్కబెట్టే కమిటీ మాత్రమే.
- **2.సాంప్రదాయక దోపిడీ రూపాల నుండి నగ్న దోపిడీ :** ఒక్క మాటలో చెప్పాలంటే బూర్జువా వర్గం మత, రాజకీయ భ్రమల ముసుగు చాటున జరిగే దోపిడీని తొలగించి, దాని స్థానంలో నగ్న, లజ్జా రహిత, ప్రత్యక్ష, పాశవిక దోపిడీని నిలిపింది.
- **3. వృత్తి పనివారు కూలీలుగా మారటం :** గతంలో ప్రజల గౌరవానికి పాత్రమైన వృత్తులన్నింటినీ బూర్జువా వర్గం నీచ స్థాయికి తీసుకు వచ్చింది. వైద్యులను, న్యాయవాదులను, కవులను, శాస్త్రవేత్తలనూ అది తన క్రింద పనిచేసే నౌకర్లుగా మార్చి వేసింది.
- **4.కుటుంబ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా దిగజార్చటం:** కుటుంబ వ్యవస్థ మీద ఉన్న మమకారపు మేలి ముసుగును లాగి పారవేసి, కుటుంబ సంబంధాలను కేవలం ఆర్థిక సంబంధాలుగా దిగజార్చింది.
- **5. పరిశ్రమల జాతీయ పునాది తొలగింపు :** బూర్జువా వర్గం ప్రపంచమంతటినీ తన మార్కెట్ చేసుకోవటం ద్వారా ప్రతి దేశంలోనూ సరుకుల ఉత్పత్తికీ, సరుకుల వినియోగానికీ జాతి, మతాతీత స్వభావం కల్గించింది. సనాతన వాదులకు మనఃక్షోభ కలిగేట్లుగా అది పరిశ్రమల రాళ్ల క్రింది జాతీయ పునాదిని తొలగించి వేసింది.
- **6.ఆటవిక జాతులు :** నాగరికతలోకి సమస్త ఉత్పత్తి సాధనాల సత్వరాభివృద్ధి ద్వారానూ, వార్తా రవాణా సాధనాల అపారమైన అభివృద్ధి ద్వారానూ బూర్జువా వర్గం సకల జాతులనూ, అత్యంత ఆటవిక జాతులను సైతం నాగరికతలోకి లాగుతుంది. తాను ఉత్పత్తి చేసే సరుకుల చౌక ధరలు అనే భారీ ఫిరంగులతో బూర్జువా వర్గం ఎటువంటి కోట గోడలనైనా పగుల గొడుతుంది.




- **7.గ్రామ సీమలు పట్టణాల పెత్తనంలోకి మారువా వర్గం :** గ్రామ సీమలను పట్టణాల పెత్తనం క్రిందకు తెచ్చింది. అది బ్రహ్మాండమైన నగరాలను సృష్టించింది. గ్రామీణ జనాభా తో పోలిస్తే పట్టణ జనాభాను అపారంగా పెంచివేసింది. ఈ

విధంగా జనాభాలో గణనీయమైన భాగాన్ని గ్రామ జీవితపు మూఢత్వం నుండి రక్షించింది.

- **8.అన్నీ కేంద్రీకరణ వైపే :** ప్రజలూ, ఉత్పత్తి సాధనాలూ, ఆస్తులూ చెల్లా చెదురుగా వుండే పరిస్థితిని బూర్జువా వర్గం దిన దినానికి నిర్మూలిస్తూ ఉంది. అది జనాభాను సమూహాలుగా చేర్చింది. ఉత్పత్తి సాధనాలను కేంద్రీకరించింది. ఆస్తిని కొద్దిమంది చేతుల్లోకి సాంద్రీకరించింది. దీని ఫలితంగా విధిగా రాజకీయ కేంద్రీకరణ ఏర్పడింది.
- **9.ఉత్పత్తి శక్తుల పెరుగుదల.. ఆటంకాల విశ్లేషణ - సంక్షోభం :** ఉత్పత్తికీ మారకానికి చెందిన ఫ్యూడల్ సమాజపు నియమాలకు అనగా ఫ్యూడల్ వ్యవసాయ వ్యవస్థకూ, ఫ్యూడల్ కర్మాగార పరిశ్రమల వ్యవస్థకూ - ఒక్క మాటలో చెప్పాలంటే ఫ్యూడల్ ఆస్తి సంబంధాలకు అప్పటికే అభివృద్ధి చెందిన ఉత్పాదక శక్తులతో ఇక ఏ మాత్రం పొత్తు కుదరలేదు. వాటి స్థానంలో నిర్నిబంధ పోటీ ప్రవేశించింది. దాని వెంట దానికనుగుణమైన సామాజిక వ్యవస్థా వచ్చాయి. బూర్జువా వర్గ ఆర్థిక, రాజకీయ పెత్తనమూ వచ్చింది. బ్రహ్మాండమైన ఉత్పత్తి సాధనాలను, మారకపు సాధనాలను సృష్టించిన ఈ బూర్జువా సమాజం తన మంత్ర శక్తిచే సృష్టించబడిన భూతాలను తానే అదుపులో పెట్టుకోలేని భూత వైద్యుని దురవస్థలో పడింది.
- **10. కార్మికవర్గం :** బూర్జువా వర్గం' ఏ నిష్పత్తిలో అభివృద్ధి అవుతుందో, అంటే పెట్టుబడి ఏ నిష్పత్తిలో అభివృద్ధి అవుతుందో ఆ నిష్పత్తిలో ఆధునిక కార్మికవర్గం అభివృద్ధి అవుతుంది. ఆధునిక పరిశ్రమలు అభివృద్ధి అయ్యే కొద్దీ కార్మికుని నైపుణ్యానికి, శరీర బలానికి ప్రాబల్యం తగ్గిపోతుంది.
- 11.పగలంతా ఫ్యాక్టరీ యజమాని దోపిడీకి గురయ్యే కార్మికునికి ఆ సాయంత్రంతో దోపిడీ అంతం కాదు. సాయంత్రం కూలి డబ్బులు చేతిలో పడిన వెంటనే అతన్ని ఇతర బూర్జువా దోపిడీదార్లు ఇంటి యజమాని, అంగడి వాడు, వడ్డీ వ్యాపారస్తుడు మొదలైన వారు ముట్టడిస్తారు.
- **12.ఇతర వర్గాలు - పరిణామం :** మధ్య తరగతి కింది వర్గం వారైన చిన్న, చిన్న వ్యాపారస్తులు, దుకాణదారులు, రిటైరైన వర్తకులు, చేతిపని వాళ్లు, రైతులు వీళ్లందరూ క్రమ క్రమంగా కార్మిక వర్గంలోకి దిగజారిపోతారు.
- **13.కార్మికుల ఐక్యత - వివిధ దశలు :** యంత్రాలలో అంతకంతకూ వేగంగా జరిగే నిరంతర అభివృద్ధి వలన కార్మికుల జీవనాధారాలు అంతకంతకూ నమ్మకం లేనివి అవుతాయి. కార్మికులకు, బూర్జువాలకు మధ్య వ్యక్తిగతంగా జరిగే ఘర్షణలు రాను రాను రెండు వర్గాల మధ్య జరిగే పోరాటాలుగా పరిణమిస్తాయి. అపుడు బూర్జువాలకు వ్యతిరేకంగా కార్మికులు ట్రేడ్ యూనియన్లు, సమ్మేళనాలు ఏర్పర్చుకోవటం ప్రారంభిస్తారు. బూర్జువాలు, కార్మికుల మధ్య జరిగే పోరాటాలలో అపుడపుడు కార్మికులకు విజయాలు లభిస్తాయి. కానీ అది తాత్కాలికమే. ఈ యుద్ధాల వల్ల వాళ్లకు కలిగే లాభం తక్షణ ఫలితాలలో లేదు. నిత్యం విస్తరించే కార్మికుల ఐక్యతే నిజమైన లాభం. ఆధునిక పరిశ్రమలు సృష్టించే వార్తా రవాణా సాధనాలు వివిధ ప్రాంతాలలోని కార్మికులకు పరస్పర సంబంధాలు ఏర్పరిచి ఐక్యతకు తోడ్పడతాయి. కార్మికవర్గం ఒక వర్గంగా సంఘటిత పడదము తత్పర్యవసానంగా ఒక రాజకీయ పార్టీగా సంఘటిత పడదమనేది కార్మికులలో వాళ్లలో వాళ్లకే ఉన్న పోటీ వల్ల నిరంతరం తల్లక్రిందులు అవుతూ వుంటుంది. కానీ మళ్లీ అది పైకి లేస్తుంది. మరింత బలంగా, మరింత స్థిరంగా, మరింత ప్రచండంగా ముందుకు సాగుతుంది. పరిశ్రమల పురోగమనం మూలంగా కార్మికులలో పరస్పర పోటీ వల్ల ఏర్పడే అనైక్యత పోయి, పరస్పర సహచర్య ఫలితమైన విప్లవకర సమ్మేళనం వస్తుంది.
- **14.కార్మికులకు రాజకీయాలు :** సిద్ధాంతాలు ఎలా సమకూరుతాయి. ఫ్యూడల్ ప్రభుత్వ వర్గంతో యుద్ధంలో బూర్జువా వర్గం, కార్మికవర్గం సాయం అర్థించక తప్పదు. ఆ విధంగా కార్మిక వర్గాన్ని రాజకీయ రంగంలోకి లాగుతుంది. దాని మూలంగా బూర్జువా వర్గమే తన రాజకీయ విద్యనూ, సాధారణ విద్యను కార్మిక వర్గానికి నేర్పుతుంది. అనగా బూర్జువా వర్గంతో యుద్ధం చేయడానికి కావలసిన ఆయుధాలను కార్మిక వర్గానికి బూర్జువా వర్గమే అందిస్తుంది. బూర్జువా వర్గంలో ఒక భాగం విడిపోయి కార్మిక వర్గంలో కలుస్తుంది. ముఖ్యంగా మొత్తం చారిత్రక గతినంతటినీ సిద్ధాంతరీత్యా అవగాహన చేసుకోగల స్థాయికి చేరుకున్న బూర్జువా సిద్ధాంతవేత్తలలో ఒక భాగం ఆ విధంగా కలుస్తుంది.
- **16.మధ్య తరగతి వర్గం పాత్ర పోరాట స్వభావం :** చిన్న, చిన్న పరిశ్రమల యజమానులూ, దుకాణాదారులు, చేతిపని వాళ్ళు, రైతులు వీళ్లందరూ బూర్జువా వర్గంతో పోరాడతారు. కానీ వీళ్ల పోరాటమంతా మధ్య తరగతిలో భాగాలుగా తమ ఉనికిని కాపాడుకోవటం కోసమే. కనుక వీళ్లు విప్లవకారులు కాదు. యధాస్థితి వాదులు. అంతేకాదు ఒక వర్గంగా ప్రగతి వ్యతిరేకులు కూడా.
- **16.ఉద్యమ స్వభావం:** చరిత్రలో ఇప్పటి వరకు జరిగిన ఉద్యమాలు అల్పసంఖ్యాకుల ఉద్యమాలు లేదా అల్ప సంఖ్యాకుల ప్రయోజనాల కోసం జరిగిన ఉద్యమాలు.

ఈనాటి కార్మికవర్గ ఉద్యమం అత్యధిక సంఖ్యాకుల ప్రయోజనాల కోసం అత్యధిక సంఖ్యాకులు బుద్ధి పూర్వకంగా నడిపే ఉద్యమం.

- **17.ఉద్యమ దశలు :** ప్రస్తుత సమాజంలో మొత్తం మీద ప్రచ్ఛన్నంగా రగులుతున్న అంతర్యుద్ధం బహిరంగ విప్లవంగా ప్రజ్వలించే దశ వరకు, బూర్జువా వర్గాన్ని బల ప్రయోగం ద్వారా కూలదోయటం ద్వారా కార్మికవర్గ అధికారానికి పునాదులు పడే దశ వరకూ చిత్రించాము. (వివరాలు గ్రంథంలోనే)
- **18.కార్మికులు, కమ్యూనిస్టు సంబంధం :** కమ్యూనిస్టులు కార్మికవర్గ పార్టీలన్నింటిలోకి అత్యంత పురోగామి, అత్యంత దీక్షా పూరితమైన భాగం.
- **19.కమ్యూనిస్టు సిద్ధాంతం :** ఈ అర్థంలో కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఒక్క వాక్యంలో చెప్పవచ్చు – స్వంత ఆస్తిని రద్దు చేయటం,
- **20.పెట్టుబడి అంటే :** పెట్టుబడి అంటే సమిష్టి ఉత్పాదితం పెట్టుబడి అనేది వ్యక్తి యొక్క శక్తికాదు. అది ఒక సామాజిక శక్తి.
- **21.శ్రమ పాత్ర :** బూర్జువా సమాజంలో ప్రాణంగల శ్రమ, కూడబెట్టిన శ్రమను వృద్ధి చేసే సాధనం మాత్రమే. కమ్యూనిస్టు సమాజంలో కూడబెట్టిన శ్రమ శ్రమపడే వాని జీవితాన్ని విస్తృత పర్చటానికి, సంపన్నం చేయటానికి, ప్రోత్సహించటానికి సాదనం మాత్రమే. కాబట్టి బూర్జువా సమాజంలో గతం వర్తమానాన్ని శాసిస్తుంది. కమ్యూనిస్టు సమాజంలో వర్తమానం గతాన్ని శాసిస్తుంది. కమ్యూనిస్టుల పై బూర్జువాల విమర్శలు – సమాధానాలు మేము స్వంత ఆస్తిని రద్దు చేయాలనటం మీకు(బూర్జువాలకు) ఎంతో కంపరం పుట్టిస్తున్నది. కానీ ఇపుడున్న మీ సమాజంలో నూటికి తొంభై మందికి స్వంత ఆస్తి రద్దయిపోయింది. నూటికి తొంభై మందికి లేదు కనుకనే తక్కిన కొద్దిమందికి ఉండగలుగుతున్నది. 'కమ్యూనిజం ఏ వ్యక్తికీ సమాజ ఉత్పత్తులను సొంతం చేసుకునే హక్కు లేకుండా చేయదు. అలా స్వతపర్చుకోవటం ద్వారా ఇతరులను కూలివాళ్లుగా మార్చే హక్కును మాత్రమే అది తొలగిస్తుంది.
- **28.వ్యక్తిత్వం:** వ్యక్తిగత ఆస్తిని బూర్జువా ఆస్తిగా, పెట్టుబడిగా మార్చటం ఎపుడు సాధ్యం కాదో, అపుడు ఆ క్షణం నుండి ఏ వ్యక్తుల వ్యక్తిత్వం అదృశ్యమౌతుందని మీ వాదన అనగా మీ అవగాహనలో వ్యక్తి అంటే బూర్జువా వ్యక్తేనన్నమాట. మధ్య తరగతి, ఆస్తి పరుదు తప్ప మరెవరూ కాదన్నమాట.
- **24.సంస్కృతి :** బూర్జువా దృష్టికి ఏ విధంగానైతే వర్గ ఆస్తి అదృశ్యం కావటం అసలు ఉత్పత్తే అదృశ్యం కావటంగా కనిపిస్తుందో, అదేవిధంగా ఆ దృష్టికి వర్గ సంస్కృతి అదృశ్యం కావడం మొత్తం సంస్కృతి అంతా అదృశ్యం కావడంగా కనిపిస్తుంది. ఏ సంస్కృతి పోతుందని బూర్జువా విలపిస్తున్నదో ఆ సంస్కృతి సమాజంలో అత్యధిక సంఖ్యాకులను యంత్రాలలాగా పనిచేసే శిక్షణ మాత్రమే.
- **25.న్యాయశాస్త్రం :** మీ (బూర్జువా) వర్గం యొక్క ఇచ్ఛ (కోరిక) సమస్త జనులూ అనుసరించవలసిన చట్టంగా రూపొంది అది న్యాయశాస్త్రం
- **26.కుటుంబం :** ఈనాటి కుటుంబం – అనగా బూర్జువా కుటుంబం – ఏ పునాదుల మీద నిలబడి ఉంది? పెట్టుబడి మీద, వ్యక్తిగత లాభం మీద. ఈ కుటుంబం పరిపూర్ణ రూపం బూర్జువాలలో మాత్రమే ఉంది. కానీ ఈ స్థితికి అనుబంధంగా రెండు అంశాలు ఉన్నాయి. కార్మికులలో కుటుంబం అనేది లేకపోవడము, బహిరంగంగా సాగే సాని వృత్తి, బూర్జువా కుటుంబం యొక్క ఈ అనుబంధ అంశాలు అంతరించినపుడు దూర్జువా కుటుంబం దానంతటదే అంతరిస్తుంది.
- **27. విద్య :** విద్యలో సమాజ జోక్యం అనేది కమ్యూనిస్టు సృష్టించింది కాదు. అయితే కమ్యూనిస్టుల జోక్యం యొక్క స్వభావం మార్చాలంటారు. పాలకవర్గ ప్రభావంలో చిక్కుకున్న విద్యను రక్షించాలంటారు.
- **28. స్త్రీ :** కమ్యూనిస్టులు స్త్రీలను సమష్టి ఆస్తిగా చేస్తారని బూర్జువాలందరూ ఒకే గొంతుకతో పొలి కేకలు పెడుతున్నారు. బూర్జువాకు తన భార్య కేవలం ఉత్పత్తి సాధనంగా మాత్రమే కనపడుతుంది. ఉత్పత్తి సాధనాలను సమష్టిగా ఉపయోగించుకుంటామని అతని చెవులో పడగానే స్త్రీలకు అదేగతి సంభవిస్తుందని అతను నిర్ణయించుకుటాడు. బూర్జువా బుద్ధికి అంతకుమించిన ఆలోచన ఎలా వస్తుంది. స్త్రీలు కేవలం ఉత్పత్తి సాధనాలుగా ఉండే ఈ దుస్థితిని రద్దు చేయటమే కమ్యూనిస్టుల అసలు లక్ష్యం.
- **29.జాతీయత :** బూర్జువా వర్గ అభివృద్ధి మూలంగాను, స్వేచ్ఛా వాణిజ్యం మూలంగాను, ప్రపంచమార్కెట్ మూలంగాను, ఉత్పత్తి విధానంలోను దాన్ని అనుసరించి ఉండే జీవిత విధానంలోను వచ్చే ఏకత్వం మూలంగాను, దిన దినానికి వివిధ జాతుల మధ్య ఉండే విభేదాలు, వైరుధ్యాలు అంతరించి పోతున్నాయి. కార్మికవర్గ ఆధిపత్యంలో అవి ఇంకా వేగంగా అంతరించి పోతాయి. కార్మికవర్గ విమోచనకు ఒక ముఖ్య సరుకు ఏమంటే వివిధ దేశాలు సమైక్యంగా కృషిచేయటం.

- **30.నిత్య సత్యాలు:** స్వేచ్ఛ, నీతి, న్యాయం మొదలైన నిత్య సత్యాలు సమాజ పరిణామంలోని అన్ని దశలలోను ఉన్నాయి. కానీ కమ్యూనిజం ఆ నిత్యసత్యాలనే రద్దుచేస్తుంది అని మీరు (బూర్జువాలు) అంటారు. కానీ ఒక విషయం మాత్రం గతించిన సమాజాలన్నింటికీ సమాన లక్షణంగా ఉంది. ఏదంటే సమాజంలో ఒక భాగాన్ని మరొక భాగం దోపిడీ చేయటం. దోపిడీ రద్దు కావటంతోనే దోపిడీని రక్షించే నిత్యసత్యాలు కూడా రద్దవుతాయి.
- **31.సాంప్రదాయక భావాలు :** కమ్యూనిస్టు విప్లవమనేది సంప్రదాయక ఆస్తి సంబంధాలతో అత్యంత మౌలికంగా తెగతెంపులు చేసుకోవటం కనుక కమ్యూనిస్టు విప్లవం యొక్క అభివృద్ధిలో సంప్రదాయక భావాలతో అత్యంత మౌలికంగా తెగతెంపులు చేసుకోవటం ఇమిడి ఉంటుంది.
- **32.విప్లవానంతరం :** ఉత్పత్తి విధానాన్ని విప్లవాత్మకంగా మార్చటానికి కొన్ని చర్యలు అనివార్యమౌతాయి. భూమిపై అస్థి హక్కు రద్దు, వారసత్వ హక్కు రద్దు, బ్యాంకుల జాతీయం, వార్తా రవాణా సాధనాలు ప్రభుత్వపరం, ఫ్యాక్టరీలు ఉత్పత్తి సాధనాలు విస్తరించటం, పనిచేసే బాధ్యత అందరికీ సమానం చేయటం, వ్యవసాయాన్ని పరిశ్రమలను సమ్మేళనం చేయటం, ఉచిత విద్యను అందించటం వగైరా. వివిధ సోషలిస్టు సిద్ధాంతాలు శాస్త్రీయ సోషలిజం
- **38.ఫ్యూడల్ సోషలిజం :** ఫ్యూడల్ ప్రభువర్గం తమ స్వంత ప్రయోజనాలు విస్మరించినట్లు కనపడుతూ, పీడిత, కార్మిక వర్గ ప్రయోజనాల రీత్యా మాత్రమే బూర్జువా వర్గంపై నేరారోపణ చేయసాగారు. ఈ విధంగా ఉత్పన్నమైనదే ఫ్యూడల్ సోషలిజం.
- **34.పెట్టీ బూర్జువా సోషలిజం :** జనాభాలో సగంకంటే ఎక్కువ మంది రైతులుగా ఉన్న ఫ్రాన్సువంటి దేశాలలో బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా ఉన్న రచయితలు రైతునూ, పెట్టీ బూర్జువాను ప్రమాణంగా తీసుకుని ఈ మధ్యవర్గాల దృష్టితో కార్మికవర్గం తరపున పోరాటానికి పూనుకున్నారు. ఈ విధంగా ఉద్భవించింది పెట్టీ బూర్జువా సోషలిజం.
- **35.బూర్జువా సోషలిజం :** కార్మికవర్గం లేకుండా బూర్జువా వర్గం ఉండాలని వీళ్ల కోరిక. బూర్జువా సోషలిజాన్ని ఒక్క మాటలో క్రోడీకరించి చెప్పవచ్చు. బూర్జువా బూర్జువాగా ఉండటం ఎందుకంటే కార్మికవర్గ శ్రేయస్సు కొరకు.
- **36.ఊహాస్వర్గ సోషలిజం కమ్యూనిజం :** ఫ్యూడల్ సమాజాన్ని కూలదోస్తున్న కాలంలో.. తన విమోచనకు ఇంకా పరిస్థితులు పరిపక్వం కాని దశలో కార్మికవర్గం చేసిన ప్రారంభ ఉద్యమాల సందర్భంగా ఈ సాహిత్యం పుట్టింది. ఈ సాహిత్యం సార్వత్రిక సుఖ విముఖతను, అత్యంత మొరటు రూపంలో సాంఘిక సమానతను బోధించింది. ఈ సిద్ధాంతాల స్థాపకులు ఆనాటి సమాజం లోని వర్గ వైరుధ్యాలను బాగానే గమనిస్తారు. కానీ, ఇంకా శైశవ దశలో ఉన్న కార్మికవర్గం ఏ విధంగాను చరిత్రను మార్చే శక్తిగాని, ఏ విధమైన స్వతంత్ర రాజకీయ ఉద్యమం కానీ లేని వర్గంగా వాళ్లకు కనపడుతుంది. సకల ఉద్యమాలలోను ఆస్తి సమస్యను ప్రధాన సమస్యగా ముందుకు తేవాలి. ఆనాటికి ఆస్తి వ్యవస్థ ఏ మేరకు అభివృద్ధి చెంది ఉండినా సరే.
- **37. ప్రతిపక్ష పార్టీల పట్ల కమ్యూనిస్టుల వైఖరి :** బూర్జువా వర్గం విప్లవకరంగా ప్రవర్తించినప్పుడల్లా, కమ్యూనిస్టులు ఆ బూర్జువా వర్గంతో కలిసి నిరంకుశ రాజరికానికి, ఫ్యూడల్ ప్రభు వర్గానికీ, పెట్టీ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తారు. కానీ బూర్జువా వర్గానికి, కార్మిక వర్గానికి గల శత్రుత్వాన్ని కార్మికుల సుస్పష్టంగా గుర్తించేట్లు చేయటానికి కమ్యూనిస్టు ఒక్క క్షణం కూడా విరామం లేకుండా కృషి చేయాలి. కమ్యూనిస్టులు ప్రతిచోటా ఆనాటి సాంఘిక, రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే ప్రతి విప్లవోద్యమాన్ని బలపరచాలి. ఈ 'కమ్యూనిస్టు పార్టీలకు తమ అభిప్రాయాలను, లక్ష్యాలను దాచుకోవటమంటే అసహ్యం. వర్తమాన సాంఘిక పరిస్థితులను బలవంతంగా కూలదోయటం ద్వారానే తమ లక్ష్యాలు సిద్ధించగలవని వాళ్లు బహిరంగంగానే ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవమంటే పాలకవర్గాలు గజ గజా వణరనీ.. కార్మికులు పోగొట్టుకునేది ఏమీలేదు. తమ సంకెళ్లు తప్ప. వారికి గెలవవలసిన ప్రపంచం ఉంది. "సకల దేశ కార్మికులారా, ఏకంకండి" కమ్యూనిస్టు ప్రణాళికలో పేర్కొన్న అనేక అంశాలు ఈనాడు మనకు సజీవంగా కనపడుతుండటం మహాద్భుతమైన విషయం. అయితే ఈ అద్భుతం వెనక శాస్త్రీయత ఉంది. పసుపు, సున్నం కలిపితే వాటి రంగులతో ఏమాత్రం సంబంధంలేని కొత్తరంగుతో పొరాణి కావటం అద్భుతంగా కనపడుతుంది. అయితే వాటి రసాయనిక చర్యలు, పదార్ధ నిష్పత్తులు అర్ధమైతే ఆ మార్పు చాలా సహజ విషయంగా అర్ధమౌతుంది. అలాగే నేటి పరిణామాలను ఆనాడే అంచనా కట్టిన మార్క్స్, ఏంగెల్స్ గొప్పదనానికీ, నేటి పరిస్థితులు భవిష్యత్తులో ఎక్కడికి ప్రయాణిస్తాయనే దాన్ని అర్ధం చేసుకోవటానికి మనకున్న అవకాశానికి ఆధారం ఒక్కటే. అదే శాస్త్రీయ పరిశీలన. ఆ పరిశీలన పద్ధతిని అలవర్చుకుంటే, దానిని ఆచరణకు జోడిస్తే, ఈ సమాజ పరిణామాన్ని మరికొంత వేగం చేసే ప్రక్రియంలో మనమూ భాగస్వాములం కాగలం. ❑




మాయే మంత్రం




ఏదో తేడా కొడుతోందే






కాస్త లేటయినా..


కార్టూన్స్ : సతీష్ ఆచార్య


RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)
Vol : 1 - Issue No : 12 September 2023

## కొత్త పుస్తకాలు స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.